

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
-డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 196 పేజీలు: 10+4 వెల: 6.50



ప్రపంచదేశాల్లో పెరుగుతున్న భారత్ క్రేజ్

భారతీయ రైల్వేలపైనే ఐఎస్ఐ ఫోకస్ 5లో


# డిసెంబర్ 7 నుంచి 9 వరకు
# గ్లోబల్ సదస్సు
## 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో నిర్వహణ



శుక్రవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని హెచ్ఎండిఎ గ్రౌండ్స్‌లో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు

### నేడు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ
### 7 రకాల సన్నాలకు బోనస్
17.54లక్షల మె.ట. ధాన్యం విక్రయం

స్కిల్ వర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, ఎటిసిలు, పాలిటెక్నిక్స్

ఆటో రిక్షాలన్నీ ఇవి వాహనాలుగా కన్వర్షన్

హెల్త్ పాలసీ దరఖాస్తుల గడువు పెంపు

కొడంగల్ లిఫ్ట్‌కు రూ.2,100 కోట్లు

కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు14:** గత యేడాది నిర్వహించినట్లే.. ఈ యేడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 7,8,9 తేదీల్లో సదస్సు నిర్వహించాలని ప్రాధమికంగా తేదీలను నిర్ణయించింది. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతోపాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. గత యేడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదంతెలిపింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించనుంది. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం జరిగింది. కేబినెట్‌లో సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. ప్రధానంగా మన రాష్ట్రంలో డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గతంలో >>2

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ముందే జమచేస్తాం
జ్యోతిబా పూలే, సావిత్రిబాయి విగ్రహాల ఆవిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి 7లో



శుక్రవారం జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### వికసిత్ భారత్ లక్ష్యసాధనలో ప్రతిపౌరుడు
# భాగస్వామి కావాలి
### ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా మూల్యం చెల్లించాల్సిందేనని చెప్పిన ఆపరేషన్ సిందూర్

శాంతి, పరస్పర సహకారమే విదేశాంగ విధానానికి పునాది

ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ వ్యవస్థగా భారత్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ప్రతి ఒక్క భారతీయ పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత్‌భారత్ లక్ష్యసాధనవైపు వడివడిగా అడుగులు పడుతోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. జాతీయ భద్రత కోసం ప్రభుత్వం, సమాజం ఏకతాటిపై నిలిచినట్లే విద్యార్థుల వర్తమాన, భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పరీక్షల్లో సమగ్ర సంస్కరణలు తీసుకు రావడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పరీక్షల్లో అక్రమ మార్గాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం, పరీక్షల విధానాన్ని మరింత పారదర్శకంగా, సురక్షితంగా, యువతకు విశ్వసనీయంగా మార్చడం ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యాలని ముర్ము చెప్పారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలు కల్పిస్తున్న యువతలో పెరుగుతున్న వ్యాపార స్ఫూర్తిని రాష్ట్రపతి ప్రశంసించారు. ఉద్యోగాల కోసం వెతకడం కంటే స్వయం ఉపాధి, ఉద్యోగాల కల్పన వైపు యువత అడుగులు వేస్తోందని చెప్పారు. యువపారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో దేశంలో బలమైన స్టార్టప్‌వ్యవస్థ ఏర్పడిం >>2

యూనిఫాం సర్వీసెస్ కొలువులకు
## వయో పరిమితి రెండేళ్లు పెంపు


**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** యూనిఫాం సర్వీసుల పరిధిలోని పోలీసు, ఫైర్ సర్వీస్, జైళ్ల విభాగం, ఎస్‌పిఎఫ్, రవాణా, అటవీ, అబ్కారీ శాఖల్లో ఎస్ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టులకు రెండేళ్ల వయో పరిమితిని పెంచుతూ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ యేడాది మే నెల 26వ తేదీన ఐదేళ్ల వయో పరిమితిని పెంచగా తాజాగా మరో రెండేళ్ల వయోపరిమితిని పెంచారు. ఈమేరకు శుక్రవారం సర్కారు ఆదేశాలుజారీచేసింది. ప్రస్తుతం ఆయా విభాగాల్లో ఎస్ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టులకు మరో రెండేళ్లవరకు పెంచారు. డైరక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు ఈ పెంపుదల వర్తిస్తుంది.కానిస్టేబుల్ అభ్యర్థులకు వయస్సు 32 నుంచి 34 సంవత్సరాలు, ఎస్ఐ అభ్యర్థులకు 35 నుంచి 37 సంవత్సరాలు సడలించి అర్హత కల్పించినందున సిఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్రనిరుద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఇబిసి జెఎసి జాతీయ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

# జనగణనకు 40 ప్రశ్నలు



### నోటిఫికేషన్ విడుదల
### సెప్టెంబర్ నుంచి కులగణన

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**జనాభా లెక్కల సేకరణకు చెందిన ప్రశ్నావళిని కేంద్ర హోంశాఖ రిలీజ్ చేసింది. 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా 40 ప్రశ్నలు అడగనున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ నోటీఫికేషన్ జారీ చేశారు. 1948 జనాభా లెక్కల చట్టం కింద ఆ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. ఇంటింటి సర్వేలో సమాచార సేకరణ కోసం మొత్తం 40 ప్రశ్నలు వేస్తారు. భౌగోళిక, సామాజిక, విద్యా, ఆర్థిక అంశాల >>2




### ఆంక్షలు విధించడానికి
# మీరెవరు?
### నల్సార్ విద్యార్థులపై బార్‌కౌన్సిల్ ఆదేశాలు తప్పుబట్టిన సిజెఐ సూర్యకాంత్

**న్యూఢిల్లీ:** నల్సార్ విద్యార్థులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఆదేశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు శాంతియుతంగా తమ అభిప్రాయాలను, నిరసనను వ్యక్తం చేసేహక్కు కలిగిఉన్నారని స్పష్టం చేశారు. >>2



శుక్రవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బిజెపి అధ్వర్యంలో తిరంగా ర్యాలీలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు

### జాతీయ జెండాల రెపరెపలతో తిరంగా ర్యాలీ



శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల, సీతక్క, సురేఖ

### గోదావరి పుష్కరాల పనుల
# నాణ్యతలో రాజీ పడొద్దు

- రూ.1000 కోట్లు కేటాయింపు
- ఈ నెలాఖరుకు టెండర్లు పూర్తి
- సెప్టెంబర్ మొదటి వారం నుంచి పనులు ప్రారంభించాల్సిందే
- కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు14:** 'గోదావరి పుష్కరాలు2027' నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారు >>2

14 మంది పోలీసులకు
## గ్యాలంట్రీ అవార్డులు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో విశేష కృషి చేసిన పోలీసు అధికారులకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటించే విశిష్ట సేవా పతకాలు ఈ యేడాది తెలంగాణ నుంచి 14 మందికి దక్కాయి. ఇందులో ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పతకం నిఘా విభాగంలో ఎస్పిగా పనిచేస్తున్న ఆర్.జగదీశ్వర్ రెడ్డి, సికింద్రాబాద్ జోన్ అదనపు డిసిపి జోగుల జోగయ్యకు దక్కాయి. ఇందులో జగదీశ్వర్ రెడ్డి 1995 బ్యాచ్ ఎస్ఐ కాగా అంచలంచ >>2




# స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోడీ ఫొటో ఎందుకు పెట్టరు?

## బిజెపి ఎంపీ రఘునందన్‌రావు విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు14:** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫొటో లేకపోవడంపై బిజెపి ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోడీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు.

రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# తీవ్ర సంక్షోభంలో రాష్ట్ర విద్యావ్యవస్థ

## ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

### విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

**హైదరాబాద్, ఆగస్టు 14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని.. విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలు ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టర్మ్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజులు, బిల్డింగ్ ఫండ్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు చేయడం తగదన్నారు. వెల్కమ్ డేలు, ఈవెంట్ల పేరుతోనూ వేల రూపాయలు గుంజుతున్నారని.. లక్షల రూపాయలు చెల్లిస్తున్నా నాణ్యమైన విద్య అందక తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల అర్హతల పట్ల కూడా నాన్‌ప్రాఫిట్ సొసైటీల పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ. అనుబంధ కంపెనీల ద్వారా విద్యను పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చేశారని ఆరోపించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో విద్య కార్పొరేట్ మయం అయిపోయిందని.. హైదరాబాద్లో ఓ ప్రైవేట్ పాఠశాలకు సంబంధించి ఏకంగా 750 కోట్ల రూపాయల విదేశీ ముసుగు బిజినెస్ జరిగిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని ఆకునూరి మురళి ఉదాహరణలతో వివరించారు. బస్సులు, ల్యాబ్స్, లైబ్రరీలు, సెక్యూరిటీ వంటి సదుపాయాలు కల్పించిన మోడల్ స్కూళ్లలో అడ్మిషన్లకు భారీ స్పందన వస్తోందని.. కేవలం వారంలోనే అడ్మిషన్లు 600 నుంచి 2,000కు పెరిగినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్నారంటే నమ్మకం పెరిగిందని స్పష్టం చేశారు.కానీ, రాష్ట్రంలో విద్యకు తగినంత బడ్జెట్ కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 15 శాతం ఇస్తామని హామీ ఇచ్చినా.. ప్రస్తుతం కేవలం 8 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, అందులోనూ 95 శాతం జీతాలకే సరిపోతోందని తెలిపారు. వియత్నాంలో 20 శాతానికి పైగా, కెనడాలోని ఒంటారియోలో 24 శాతం, చివరికి అఫ్ఘానిస్థాన్లోనూ 15 శాతం, కేజీవాల్ హయాంలో ఢిల్లీలో 30 శాతం వరకు బడ్జెట్ కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం విద్యకు కనీసం 18 నుంచి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పెంచి.. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు స్వస్తి పలకాలని ఆకునూరి మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ పీపుల్స్ కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పద్మజ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎంవీ. రెడ్డి, మాలోత్ చంపాలాల్, సామాజిక కార్యకర్తలు రుబీనా, తమ్మినేని నిర్మల, ముప్పరి కురుమన్న, పరీత, సృజన యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిఆర్ సర్టిఫికెట్ల జారీ బాధ్యతలు హెచ్‌ఎండిఏకు అప్పగింత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు14:** ట్రాన్స్ ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్)పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టిడిఆర్ జారీ, వినియోగ నిబంధనల్లో మార్పులు చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012లో సవరణలు చేసింది. ఈ మేరకు క్యూర్,ఫ్యూర్ పరిధిలో టిడిఆర్‌లను హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండిఏనే జారీ చేయనుంది. హెచ్‌ఎండీఏ చేపట్టే ప్రాజెక్టుల కోసం అవసరమైన/స్వాధీనం చేసుకున్న భూములకు ఆ సంస్థే టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేయనుంది. క్యూర్,ఫ్యూర్ పరిధి సహా సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ప్రజా ప్రయోజన/ప్రాజెక్టుల కోసం ఇచ్చే భూములకూ ఈ నియమం వర్తించనుంది. హెచ్‌ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్‌ను ఆ సంస్థ పరిధిలో ఎక్కడైనా వినియోగించుకోవచ్చు/ డిస్పోజ్ చేసుకోవచ్చు. అలాగే టీడీఆర్ జారీ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు.

అదేవిధంగా టిడిఆర్‌కు సంబంధించిన వివరాలు, లెక్కలు, వినియోగంపై ఏకరీతి విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. ఈమేరకు సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్/యుఎల్‌బి/ఎఫ్‌సిడిఎలకు టీడీఆర్ సర్టిఫికెట్ కాపీ అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బిల్డ్ నౌ వ్యవస్థలో టీడీఆర్ ప్రాసెసింగ్, జారీ, అకౌంటింగ్, వినియోగానికి అవసరమైన మార్పులూ చేసింది. గెజిట్‌లో ప్రచురించిన తేదీ నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

# ప్రతిపౌరుడు భాగస్వామి కావాలి

>> దన్నారు. భారత యువత ప్రతిభ, అంకితభావంతో ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ సంస్థలు వారికి కీలక నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్నాయని తెలిపారు. యువత సాధిస్తున్న విజయాలు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠను పెంచుతున్నాయని, భారత సాయుధ దళాల అసమాన ధైర్యసాహసాలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపచేస్తున్నాయన్నారు. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారు ఎక్కడ దాక్కున్నా తమ చర్యలకు మూల్యం చెల్లించాల్సిందేనన్న స్పష్టమైన, కఠినమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ఇచ్చిందని ముర్ము అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా రైతుల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా రాష్ట్రపతి అభివర్ణించారు. దశాబ్దాలుగా దేశానికి తీవ్రమైన సవాలుగా ఉన్న నక్సలిజాన్ని నిర్మూలించడం గొప్ప విజయమని ముర్ము అన్నారు. బస్తర్ ఒలింపిక్స్, బస్తర్ పాండుమ్ వంటి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ఆమె ప్రస్తావించారు. సారనాథ్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపుభారత నాగరికత, వారసత్వ గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ.. భగవాన్ బుద్ధుడు తొలిసారిగా ధర్మబోధ చేసిన సారనాథ్‌ను ఈ ఏడాది యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చినట్లు రాష్ట్రపతి తెలిపారు. గత యేడాది 12 మరాఠా సైనిక కోటలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. ఆధ్యాత్మికతకు ప్రతీకలైన స్మారక చిహ్నాలతో పాటు సైనిక శక్తి, పోరాట స్ఫూర్తికి ప్రతీకలైన చారిత్రక కట్టడాలను కూడా భారత్ గర్వంగా సంరక్షిస్తోందని చెప్పారు.

**శాంతి,పరస్పర సహకారమే విదేశాంగ విధానానికి పునాది**

భారత విదేశాంగ విధానానికి శాంతి, సంభాషణ, సహకారం, వసుధైవ కుటుంబకం సూత్రాలు పునాదిగా ఉన్నాయని రాష్ట్రపతి తెలిపారు. నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను భారత్ విశ్వసిస్తోందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర బహుపాక్షిక సంస్థల్లో ప్రపంచ సమాజంలోని అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు భారత్ కృషి చేస్తోందని చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో భారతదేశ ప్రాధాన్యం పెరుగుతోందని పేర్కొన్నారు.70 ఏళ్లు పైబడిన వారికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యందేశంలో ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్నప్పటికీ వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోందని ముర్ము తెలిపారు. 70 ఏళ్లు పైబడిన సుమారు 6 కోట్ల మంది వృద్ధులు ప్రభుత్వ పథకాల కింద ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందే అవకాశం కల్పించినట్లు చెప్పారు.

# 7 నుంచి 9 వరకు గ్లోబల్ సదస్సు

>> రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబీకుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది.రాష్ట్రంలో ఈరోజుకు మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వీరికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారని, ఇదే సమయంలో అన్ని జిల్లాల్లో మంత్రులు కూడా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేబినేట్ నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని కేబినేట్ తీర్మానించిందని వెల్లడించారు. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుందని తెలిపారు.. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం(ఈ-యాక్షన్) ద్వారా విక్రయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయిందని, ఈ వేలం ద్వారా ధాన్యం అమ్మాలని కేబినేట్ నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐటీఐలు, ఎటిసిలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐయుఎస్) పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించిందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ లకు అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత తొందరగా స్థల సేకరణ చేసి, నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందని, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించిందని పేర్కొన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి, హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలున్నాయి. వీటిని ఇవి (విద్యుత్తు వాహనాలుగా) మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1 లక్ష 50 వేలు సబ్సిడీ అందిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించనున్నారు. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు కేబినెట్ నిర్ణయం. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు అప్లై చేసుకునేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మక్తల్ -నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందుతుందన్నారు. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియామకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.

# జనగణనకు 40 ప్రశ్నలు

>> వివరాలను ప్రశ్నావళిలో అడగనున్నారు. వ్యక్తి పేరు, ఇంటి యాజమానితో రిలేషన్, లింగం, పుట్టిన తేది, వయసు, మ్యారేజ్ స్టేట్, జీవిత భాగస్వామి పేరు, నేషనాలిటీ లాంటి సమాచారాన్ని సేకరించనున్నారు. ఇక మతపరమైన అంశాల్లో షెడ్యూల్ కులమా లేక షెడ్యూల్ తెగకు చెందిన వారా అని తెలుసుకోనున్నారు. కులం, తల్లితండ్రులు, వైకల్యం, మాతృభాషతో పాటు ఇతర అంశాలను సేకరిస్తారు. అక్షరాస్యత, డిజిటిల్ లిటిరసీ స్టేటస్ కూడా తెలుసుకుంటారు. కోవిడ్19 టీకా తీసుకున్నారా, ఎన్ని బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి, డాక్యుమెంట్ల వివరాలు, మొబైల్ నెంబర్, ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు వివరాలు కూడా సేకరించనున్నారు. లడాక్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు జనాభా లెక్కల సమాచారాన్ని సేకరించనున్నారు. దేశంలోని మిగితా ప్రాంతాల్లో వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ జరగనున్నది. జనాభా లెక్కల్లో భాగంగా తొలిసారి కులం వివరాలను సేకరించనున్నారు. గత ఏడాది ఏప్రిల్ 30వ తేదీన ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ కమిటీ భేటీలో కుల వివరాల సేకరణ కూడా చేపట్టాలని నిర్ణయించారు. యావత్ జనాభా లెక్కల ప్రక్రియ మొత్తం డిజిటల్ విధానంలో జరగనున్నది. తొలి దశలో భాగంగా ఇప్పటి హౌజ్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ ప్రక్రియ జరుగుతున్నది. సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఆ సమాచారాన్ని సేకరిస్తారు. ఏప్రిల్ 16వ తేదీన ఈ ప్రక్రియ మొదలైంది. దేశవ్యాప్తంగా ఉన్న కట్టడాలు, ఇండ్లు, ఇంటి నిర్మాణాల సమాచారాన్ని ఎన్యుమరేటర్లు సేకరిస్తున్న విషయం తెలిసిందే. జనాభా లెక్కల నిర్వహణ కోసం కేంద్రం సుమారు 11 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.

# 14 మంది పోలీసులకు గ్యాలంట్రీ అవార్డులు

>> లుగా పదోన్నతులు పొంది నాన్ కేడర్ ఎస్‌పి స్థాయికి ఎదిగారు. నిఘా విభాగంతో పాటు ఎస్ఐబిలో ఆయనకు విశేష అనుభవం వుంది. కాగా సికింద్రాబాద్ జోన్ అదనపు డిసిపి జోగుల జోగయ్య 1991 బ్యాచ్ ఎస్ఐ. నగర పోలీసు విభాగంలో చిరపరిచితులైన జోగయ్య అనేక కీలక కేసులను ఛేదించి నేరగాళ్లను కటకటాల్లో నెట్టారు. పోలీసు శాఖలో ఆయనకు ట్రబుల్ షూటర్‌గా పేరుంది. దీంతో పాటు మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ కరీంనగర్ కమిషనరేట్ పరిపాలనా విభాగం అదనపు డిసిపి (పరిపాలనా విభాగం) వెంకటర మణ, సిటీ సైబర్ క్రైం ఎసిపి శివమారుతి, సైబరాబాద్ సిటిసి ఆశల గంగారాం, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి రవికుమార్ రెడ్డి, ఈగల్ డిఎస్‌పి రమేష్, సంగారెడ్డి సిఐడి డిఎస్‌పి శ్రీనివాసరావు, కొండాపూర్ టిఎస్ఎస్‌పి బెటాలియన్ అసిస్టంట్ కమాండంట్ సత్యనారాయణ, సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్, ఆక్టోపస్ హెడ్ కానిస్టేబుల్ రాములు, సిటీ పోలీసు రవాణా విభాగం హెడ్ కానిస్టేబు ల్ తిరుపతి రాజులు ఎంపికయ్యారు. కాగా మెరిటోరియస్ మెడల్ గ్రే హౌండ్స్ హోంగార్డు యాదయ్యకు దక్కింది. గ్రే హౌండ్స్ జూనియర్ క మాండోలు సత్యరావు, సందీప్ కుమార్, వంశీకృష్ణలకు గాలంటరీ మెడల్స్ దక్కాయి.

## వారం - వర్జ్యం

15-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.తదియ సా.5.34
న.ఉత్తరఫాల్గుణి రా.3.27
వ. ఉ.10.51-మ.12.26
దు.1. ఉ.5.51-ఉ.7.30
రాహు ఉ.9.00-ఉ.10.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** కుటుంబ సభ్యులతో దేవాలయ దర్శన భాగ్యమునకు ఆస్కారము ఉన్నది. మిత్రుల కలయిక. స్వల్ప ధనలాభం పొందు తారు.

**వృషభం :** చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహ కరంగా ఉంటుంది. సోదరుల కలయిక.

**మిథునం :** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు. గృహనిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కర్కాటకం :** నూతన పరిశ్రమలు వ్యాపా రాలు ప్రారంభిస్తారు. ప్రముఖులతో పరిచ యాలు ఏర్పడతాయి. వస్త్ర లాభం.

**సింహం :** ఎంత సాధించినా ఇంకా సాధిం చాలనే ధోరణి అప్రశాంతతకు గురి చేస్తుంది. కొన్ని అవకాశాలు అప్రయత్నంగా కలిసి వస్తాయి.

**కన్య :** భూముల విషయంలో నెలకొన్న వివా దాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. నూతన ఒప్పందాలలో జాగ్రత్తలు పాటించండి.

**తుల :** జీవిత భాగస్వామి సహాయం అందు కుంటారు. సన్నిహితుల నుండి కీలక సమా చారం తెలుసుకుంటారు.

**వృశ్చికం :** చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు. గృహ నిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**ధనుస్సు :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కళలు, రాజకీయ రంగాల వారికి పదవులు లభిస్తాయి.

**మకరం :** నూతన పెట్టుబడులతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగిన సూచన. ప్రయాణాలు.

**కుంభం :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్ట్‌లు లభిస్తాయి. వస్త్ర లాభం.

**మీనం :** వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టు కొని పనులు పూర్తి చేస్తారు. స్వల్ప ధనలాభం పొందుతారు. ఇంటా బయటా అనుకూలం

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం న్యూఢిల్లీలో కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన భారతీయ సైనికబృందంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# నాణ్యతలో రాజీ పడొద్దు

>> లను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించిందని, సెప్టెంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు - 2027' కేబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా...కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్‌ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినేట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఆంక్షలు విధించడానికి మీరెవరు?

>> ఈ విషయంలో బిసిఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు ఏదైనా సమస్యపై నిరసన తెలిపే కారణం ఉంటే ఇందులో బిసిఐకి ఎలాంటి సంబంధం లేదు. మేము మీకు అండగా ఉన్నాం. విద్యార్థులు నాకు లేఖ రాశారు. ఇదివిద్యార్థులకు, నాకు మధ్య జరిగే సంభాషణ. బిసిఐ తీసుకున్న చర్య పూర్తిగా అనవసరం. ఎలాంటి కారణం లేకుండా తీసుకున్న చర్య. నేను కూడా విద్యార్థిగా ఉన్నప్పుడు విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నాను. వారు శాంతియుతంగా తమ గొంతు వినిపిస్తున్నారు. అలా చేయడానికి వారిని అనుమతించాలని బిసిఐ పేర్కొన్నారు. ఏ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం లేదా ఇతర న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు, అధ్యాపకులపై బిసిఐ లేదా ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్ అయినా శిక్షాత్మక చర్యలు తీసుకోరాదని సిజెఐ ఆదేశించారు.నోటీసులు జారీ చేయాలి. ఈలోగా ఏ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం/న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి లేదా అధ్యాపకుడిపై ఎలాంటి శిక్షాత్మక చర్యలు తీసుకోకూడదని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.కోర్టు నోటీసును బిసిఐ అంగీకరించింది. వివాదానికి కారణమైన సర్క్యులర్‌ను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు బిసిఐకి సుప్రీంకోర్టు రెండు వారాల సమయం ఇచ్చింది. లేఖల్లో పేర్కొన్న ఘటనలకు సంబంధించి నల్సార్ విద్యార్థులపై ఎలాంటి శిక్షాత్మకచర్యలు తీసుకోరాదని మరోసారి స్పష్టం చేసింది. యువకులు చేసిన ఏదైనా తప్పు వ్యాఖ్య కారణంగా వారి నిరసన తెలిపే హక్కును హరించరా దని సిజెఐ అన్నారు. విద్యార్థులు నిరసనల్లో పాల్గొనేందుకు వెనుకాడవద్దని సూచించారు. యువకులుగా ఉన్నప్పుడు ఎవరైనా తప్పుగా ఏదైనా వ్యాఖ్య చేసినంత మాత్రాన వారికి నిరసన తెలిపే హక్కు ఉండదని కాదు. విద్యార్థులందరికీ ఈ విషయాన్ని చెప్పండి. వారు బార్‌లో నమోదు చేసుకుని సుప్రీంకోర్టు బార్‌లో చేరాలి. మేము వారిని న్యాయ సహాయ కోర్సులకు ఎంపిక చేస్తామని సీజేఐ వ్యాఖ్యానించారు. బిసిఐ అన్ని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేస్తూ, నల్సార్‌నుంచి 2026లో పట్టభద్రులైన విద్యార్థులను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని పేర్కొంది.అయితే ఈ ఆదేశాలపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో కొన్ని గంటల్లోనే బిసిఐ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈ అంశంపై తమ వద్ద సమర్పించిన సమాచారాన్ని పరిశీలించిన అనంతరం ఆగస్టు 19న తుది నిర్ణయం తీసుకుంటామని న్యాయవాదుల అత్యున్నత చట్టబద్ధసంస్థ తెలిపింది.హైదరాబాద్‌లోని నల్సార్‌వర్సిటీకి చెందిన కొంతమంది విద్యార్థులు ఈయేడాది జూలైలో విసి,రిజిస్ట్రార్, ప్రొఫెసర్లకు లేఖరాశారు. విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను వారు వ్యతిరేకించారు.

# సిఎం రేవంత్‌రెడ్డి కుటుంబంపై లోకాయుక్తలో బిఆర్‌ఎస్ ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు14:** తెలంగాణ సిఎం ఎ. రేవంత్ రెడ్డి కుటుంబం భూ కుంభకోణంకు పాల్పడిందని ఆరోపిస్తూ శుక్రవారం బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ కోటి రెడ్డి తదితరులు లోకాయుక్త జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.సిఎం తమ్ముడు కొండల్‌రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ. 200 కోట్ల విలువైన భూములను కేటాయించారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 5 ఎకరాల ప్రజా భూమిని కేవలం రూ.7 కోట్లకు దారాదత్తం చేశారని విమర్శించారు. ఏరోస్పేస్ కంపెనీ అని చెప్పుకుంటున్న టెస్సెరాక్ట్ చెల్లించిన మూలధనం కేవలం రూ. లక్ష మాత్రమేనని, టెస్సెరాక్ట్ కంపెనీ అధికారిక బోర్డు నివేదిక ప్రకారం కంపెనీలో ఉద్యోగుల సంఖ్య సున్నా అని తేలిందని దాసోజు శ్రావణ్ ఆరోపించారు.

నివాస ఫ్లాట్ అడ్రస్‌తో నడుస్తున్న కంపెనీకి రూ. 200 కోట్ల విలువైన డిఫెన్స్ భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీయడంతో రాత్రికి రాత్రే వెబ్‌సైట్‌లో వివరాలను మార్చేశారని తెలిపారు. సీఎం సోదరుడు కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా, సీఎం మేనల్లుడు నయన్ రెడ్డి సీఈవోగా ఉన్నారని లోకాయుక్తకు ఆధారాలు సమర్పించామని వెల్లడించారు. మంత్రి శ్రీధర్ బాబు మీడియా సమావేశంలో అబద్ధాలు చెబితే, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ భూ కేటాయింపులను స్వయంగా ఒప్పుకున్నారని వివరించారు. రికార్డుల్లో కొండల్ రెడ్డి పేరు లేకుండా బినామీలను పెట్టారని ఆరోపించారు. కర్ణాటక ముడా తరహాలోనే తెలంగాణలో టెస్సెరాక్ట్ భూ కుంభకోణం సాగిందని దుయ్యబట్టారు. టెస్సెరాక్ట్ భూ కేటాయింపులను వెంటనే రద్దు చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి పాత్రపై విచారణ కోసం నివేదికను గవర్నర్‌కు పంపాలని డిమాండ్ చేశారు.

## సిబ్బంది డ్యూటీల కుదింపుపై ఆర్‌టిసి యాజమాన్యం

# ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి

### టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 14:** ఆర్‌టిసి సిబ్బంది డ్యూటీల కుదింపుపై యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలని టిజిఎస్ ఆర్‌టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. సమ్మె అనంతరం ఒప్పందంలో భాగంగా ఈడీల కమిటీలో అంగీకరించిన అంశాలలో ప్రధానమైనది ఎంటిడబ్ల్యు యాక్ట్ ప్రకారం 8 గంటల పని విధానాలు అమలు చేయాలని, డ్యూటీ షెడ్యూల్ టైమ్ శాస్త్రీయబద్ధంగా కార్మిక సంఘాల ప్రతినిధి సమక్షంలో రూట్ సర్వే నిర్వహించి, రన్నింగ్ టైమ్ ఆధారంగా కిలోమీటర్లు ఫిక్స్ చేయాలని ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా ఈమధ్య కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో సిబ్బంది డ్యూటీలను యాజమాన్యం ఏకపక్షంగా ఇష్టానుసారంగా కుదించి నామమాత్రపు ఓవర్ టైమ్ ను ఫిక్స్ చేసి, కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న విమర్శించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో కార్మిక సంఘాలన్నీ నిమగ్నమై ఉన్న సమయంలో ఇదే అదనుగా యాజమాన్యం భావించి, రహస్య ఆదేశాలతో సిబ్బంది స్పెషల్ ఆఫ్ డ్యూటీలను మార్చి ఉన్న ఓటీనీ తగ్గిస్తూ వారి శ్రమను దోచుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

# తెలంగాణలో గ్రీన్ మొబిలిటీకి ప్రభుత్వం తోడ్పాటు

## ఎలక్ట్రిక్ వాహనాలకు సర్కారు ప్రోత్సాహం

## నూతన టాటా సియెర్రాను ఆవిష్కరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రభుత్వం చురుగ్గా ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన టాటా సియెర్రా ఇవి వాహానంను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాటా మోటార్స్‌ను అభినందించిన ఆయన, భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన, గౌరవ నీయమైన బ్రాండ్లలో టాటా ఒకటని పేర్కొన్నారు. విశ్వసనీయత, ఆవిష్కరణలు, భద్రత, నాణ్యత విషయంలో టాటా సంస్థకు సుదీర్ఘమైన గుర్తింపు ఉందన్నారు. టాటా బ్రాండ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మంత్రి, తాను చాలా సంవత్సరాల పాటు టాటా సఫారీ వాహనాన్ని ఉపయోగించానని, టాటా వాహనాల విశ్వసనీయత తనకు వ్యక్తిగతంగా తెలుసని చెప్పారు. నూతన సియెర్రా టాటా కుటుంబంలో మరో గర్వించదగిన వాహనం. భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో ఇది గొప్ప విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాన్న అని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా ఆటోమొబైల్ రంగం ప్రస్తుతం భారీ పరివర్తన దిశగా సాగుతోందని, భవిష్యత్ రవాణా వ్యవస్థలో ఎలక్ట్రిక్, సుస్థిర మొబిలిటీ కీలక పాత్ర పోషించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థను విస్తరించడంలో టాటా మోటార్స్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ వల్ల కాలుష్యం తగ్గుతుంది. పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, సుస్థిరమైన వాతావరణాన్ని అందించేందుకు ఇది ఉపయోగపడుతుంద్ధి అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని చురుగ్గా ప్రోత్సహిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ మినహా యింపు వంటి ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. 'తెలంగాణను మరింత పచ్చదనం, పర్యావరణహితమైన, సుస్థిర భవిష్యత్ వైపు తీసుకెళ్లేందుకు ఆటోమొబైల్ పరిశ్రమతో కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోంద్ధి అని మంత్రి చెప్పారు. నూతన టాటా సియెర్రా ఆవిష్కరణ సందర్భంగా టాటా మోటార్స్ యాజ మాన్యం, ఉద్యోగులు, జాస్పర్ టాటా ప్రతినిధులను ఉత్తమ్ కుమార్ రెడ్డి అభినందించారు. భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో నూతన సియెర్రా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టాటా మోటార్స్ సీనియర్ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# స్నేహితుడిని హతమార్చిన డెలివరీ బాయ్

**హైదరాబాద్ (నార్సింగి), ఆగస్టు 14, ప్రభాతవార్త :** పనిచేసే ప్రాంతంలో తలెత్తిన చిన్నపాటి గొడవ స్నేహితుడి ప్రాణాలను బలితీసుకుంది. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండలం కోకాపేట ప్రాంతానికి చెందిన సమీద్(31) తన స్నేహితుడితో కలిసి నార్సింగిలోని ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు చాలాకాలంగా అన్యోన్యంగా ఉంటున్నారు. ఓ డెలివరీ విషయంలో ఇద్దరి మధ్య దూరం పెరిగింది. తరుచూ ఈ విషయంపైనే దూషించుకునే వారు. ఈ నేపథ్యంలోనే గురువారం అర్ధరాత్రి ఇరువురి మధ్య మాటమాట పెరిగింది. ఇరువురు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. స్నేహితుడు ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో సమీద్ తలకు బలమైన గాయమై కుప్పకూలిపోయాడు. తీవ్ర రక్తస్రావం అవడంతో స్థానికులు వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్ప టికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు వివరించారు.


దేవాదాయ-ధర్మాదాయ శాఖ

**శ్రీ హనుమాన్ దేవస్థానము**

సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలము ప్రకటన

File No.47/SKHD/2026 తేది: 13-08-2026

| క్ర. సం. | టెండరు వివరములు | కాల పరిమితి | ధరావత్తు (E.M.D) | టెండరు షెడ్యూల్ ధర |
| --- | --- | --- | --- | --- |
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1. | [illegible] | తేది 11-11-2026 నుండి 10-11-2027 వరకు | ₹.3,00,000/- | ₹. 1000/- + 18% GST |
| 2. | [illegible] | -do- | ₹.60,000/- | ₹. 1000/- + 18% GST |
| 3. | [illegible] | -do- | ₹.25,000/- | ₹. 500/- + 18% GST |

సం/-
కార్యనిర్వహణాధికారి

DIPR.No.7878-PP/CL/Advt/1/2026-27, తేది: 14.08.2026


# తల్లి ఆత్మహత్య

## కొడుకులు పెడదోవ పట్టారని..

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** నవమాసాలు మోసి, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచిన బిడ్డలే తన బ్రతుకును నరకప్రాయం చేస్తారని ఆ తల్లి ఏనాడూ ఊహించి ఉండదు. రెక్కల కష్టం ధారపోసి, కడుపు కట్టుకుని పెద్ద చేసిన కుమారులు చేతికి అందివచ్చి తనకు ఆసరాగా నిలుస్తారని, ముసలితనంలో నీడగా ఉంటారని ఆశపడింది. కానీ..ఆ బిడ్డలే పెడదోవ పట్టి తన జీవితాన్ని తీవ్ర అంధకారంలోకి నెట్టేస్తారని గ్రహించలేకపోయింది. కన్నప్రేమ కరిగిపోయి, తీవ్ర మనోవేదన కన్నీటి చుక్కగా మారిన వేళ, ఆ తల్లి గుండె పగిలింది. చివరికి ఆ నిస్సహాయక తల్లి ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలిని రంగారెడ్డి జిల్లా జన్వాడ గ్రామానికి చెందిన తిరుపతి రవీందర్ భార్య సుధ(54)గా గుర్తించారు.

ఆమె కెపిహెచ్‌బి సర్దార్ పటేల్‌నగర్‌లోని శ్రీ సాయిసుధా లేడీస్ ప్రైవేటు హాస్టల్లో హౌస్‌కీపింగ్ పనిచేస్తూ, అక్కడే ఒక గదిలో నివాసముంటోంది. సుధకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కొడుకు కొన్నేళ్ల క్రితం కన్న తండ్రినే హత్య చేసిన కేసులో నిందితుడిగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇక చిన్న కొడుకు గంజాయికి బానిసై నిత్యం డబ్బుల కోసం, ఇతర విషయాల్లో తల్లి సుధని తీవ్రంగా వేధించేవాడు. ఒక కొడుకు జైలుపాలు కావడం, మరో కొడుకు వ్యసనానికి బానిసగా మారి తనను వేధిస్తుండటంతో సుధ తీవ్ర మానసిక క్షోభకు గురైంది. భవిష్యత్తుపై ఆశ కోల్పోయిన ఆమె హాస్టల్ గదిలోనే ఆత్మహత్య చేసుకుంది.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపడుతున్నారు. సమాజంలో చెడు వ్యసనాలు, పెడదోవ పడుతున్న యువత వల్ల కుటుంబాలు ఏ విధంగా కూలిపోతున్నాయో చెప్పడానికి ఈ ఘటన ఒక సజీవ సాక్ష్యం. కన్నబిడ్డల బాధ్యతారాహిత్యం, మత్తు పదార్థాల మహమ్మారి ఒక అమాయక తల్లి ప్రాణాన్ని బలితీసుకోవడం సమాజ నైతికతకే తీరని కలంకమై నిలిచింది.

# అనుమానాస్పదస్థితిలో ఎక్సైజ్ అధికారి మృతి

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా దోమకుంట ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో జూనియర్ అసిస్టంగ్‌గా పనిచేస్తున్న అనిల్ కు మార్ (41) శుక్రవారం తన ఇంట్లోనే ఆకస్మికంగా చనిపోయారు. గురువారం రాత్రి భోజనం చేసి నిద్రపోయిన ఆయన శుక్రవారం ఉదయం ఎ ంతకు లేవక పోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. జూనియర్ అసిస్టంట్‌గా పనిచేస్తున్న అనిల్ కుమార్ ఇటీవలే అబ్కారీ శాఖలో ఎస్ఐగా పదోన్నతి పొందారు. ఆ పదవిలో ఆయన త్వరలో చేరాల్సి వుండగా హఠాత్తుగా కన్నుమూశారు. ఆయన మృతిపట్ల అబ్కారీ శాఖ అధికారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# విద్యుత్ ఉత్పత్తిలోనూ సింగరేణి మార్క్

## ఇప్పటివరకు 245.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

## 1.23 మెగావాట్ల ప్లాంట్‌ను ప్రారంభించిన సిఎండి బుద్ధప్రకాష్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** బొగ్గు ఉత్పత్తితో పాటు, విద్యుత్ ఉత్పత్తిలో కూడా సింగరేణి తనకంటూ ఒక మార్క్‌ను చూపిస్తోందని ఆ సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ పరిధిలోని సంస్థకు సంబంధించిన భవనాలపై ఏర్పాటు చేసిన 1.23 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్ లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తదుపరి పవర్ ప్లాంట్ నుండి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్ కు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి అంటే బొగ్గు ఉత్పత్తి చేసే కంపెనీగా చాలా ఏళ్లుగా గుర్తింపు ఉందన్నారు. కానీ నేడు సంస్థ చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలతో సింగరేణి కాలరీస్ అంటే థర్మల్ విద్యుత్ రంగంలోనూ, సోలార్ విద్యుత్, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ తనదైన మార్క్‌ను చాటుతోందన్నారు.



స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

# అక్రమంగా మినీగ్యాస్ సిలిండర్ల తయారీ, రవాణా గుట్టురట్టు

## నలుగురి అరెస్టు, 750 సిలిండర్లు సీజ్

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 14,ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మినీ గ్యాస్ సిలిండర్లను తయారు చేస్తూ, రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 750 మినీ గ్యాస్ సిలిండర్లు, ఒక బొలేరో వాహనం మరియు 7 తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 12వ తేదీన నమ్మదగిన సమాచారం మేరకు శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్ పహాడ్ మెయిన్ రోడ్డు వద్ద రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం ఒక బొలేరో వాహనాన్ని తనిఖీ చేసింది. రాజాపూర్ నుండి హైదరాబాద్‌కి 400 మినీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా రవాణా చేస్తున్న మహమ్మద్ అబ్దుల్ హన్నాన్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో దిగ్భ్రాంతికర నిజాలు:అరెస్టయిన అబ్దుల్ హన్నాన్‌ను విచారించగా, మహమ్మద్ భోలేషా సూచనల మేరకు తాను ఈ సిలిండర్లను రవాణా చేస్తున్నట్లు తెలిపాడు. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందం భోలేషాను అదుపులోకి తీసుకుంది. తనకు ట్రూప్ బజార్‌కు చెందిన మహమ్మద్ షకీల్ వీటిని సరఫరా చేస్తున్నట్లు భోలేషా వెల్లడించడంతో షకీల్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు నిందితులను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించగా, వారిపై క్రైమ్ నంబర్ 371/2026 కింద కేసు నమోదు చేశారు. అనంతరం మహమ్మద్ షకీల్‌ను లోతుగా విచారించగా, రాజాపూర్ గ్రామంలోని ఒక గోదాములో ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా అక్రమంగా మినీ గ్యాస్ సిలిండర్లను తయారు చేసి హైదరాబాద్‌కి రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. షకీల్ ఇచ్చిన సమాచారంతో రాజాపూర్ గ్రామంలోని తయారీ కేంద్రాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి, ఢిల్లీలోని మోతీనగర్‌కు చెందిన కార్మికుడు ఎండీ దిల్‌షాద్ (45, తండ్రి: నౌషాద్) ను అరెస్ట్ చేశారు. అక్కడ తయారీకి ఉపయోగిస్తున్న 7 యంత్రాలు, మరో 350 మినీ సిలిండర్లను సీజ్ చేసి రాజాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రెండు కేసుల్లో కలిపి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా... 750 మినీ గ్యాస్ సిలిండర్లు, ఒక బొలేరో వాహనం, 7 సిలిండర్ల తయారీ యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అభినందనలు: హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఐపీఎస్ పర్యవేక్షణలో, డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఐపీఎస్, అడిషనల్ డిసిపి కే.ఎస్. రావు సూచనలతో ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బి. సంజీవులు, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. రవి మరియు సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌ను ఉన్నతాధికారులు అభినందించి, వారి పురస్కారాలను ప్రకటించారు.




వార్త

ఏమీ తెలియని అమాయకులకు మౌనమే సగం బలం. అయితే, ఈ సూక్ష్మం తెలుసుకున్న వారిని అమాయకులని అనుకోలేము.

- సాధి

# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

**ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆ పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితులేననేది వాస్తవం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులెన్నో చేస్తూ ఇంకెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి పేదరికం వారి నోరువిప్పనీయడం లేదు. తల్లిదండ్రులకు దూరమై, వారి ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు ఇటు తమకు ఇష్టంలేని వ్యవస్థలో పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్రమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతమేరకైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ మూలాలను వదిలిపెట్టి చట్టాలు తెచ్చుకున్నాం, సమీక్షలు చేస్తున్నామంటూ అంతా అయిపోయినట్టుగా ప్రకటించుకోవడం మనలను మనం మోసం చేసుకోవడమే.**

దామెర్ల సాయిబాబ

చేసింది చెప్పుకోవడం సులభం. కానీ చెప్పింది చేయడం మాత్రం ఎంతో కష్టతరం. అందరికీ సాధ్యం కాదు. అలా హామీలిచ్చి ఆ తర్వాత మాట మార్చిన నేతలెందరో కాలగర్భంలో కలిసిపోయారు. కేవలం కొందరు మాత్రమే ఇచ్చిన మాట నిలబెట్టుకొని ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకుని చిరస్థాయిగా నిలిచిపోతారు. అందుకే మాట ఇచ్చేముందు అన్నికోణాల్లో ఆలోచించి ఆచరణయోగ్యమా? కాదా? అందుకు తగిన వనరులున్నాయా? తదితర అంశాలను కూలకషంగా పరిశీలించుకొని మాట ఇవ్వాలి. అందులోనూ కీలకపదవుల్లో ఉన్న నేతలు మరింత లోతుగా ఆలోచించి హామీలివ్వాలి. ఎందుకోఏమో కానీ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన విషయంలో పాలకులు మాట నిలబెట్టుకోలేకపోతున్నారు. చట్టాల మీద చట్టాలు చేస్తున్నారు. అధికారుల మీద అధికారులను నియమిస్తున్నారు. అవేమీ ఆశించిన ప్రయోజనాలు చేకూర్చడం లేదు. అందుకు కారణం అమలులో చిత్తశుద్ధి లేకపోవడమే. చట్టాలు చేసేటప్పుడు, నిబంధనలను విధించేటప్పుడు ఉన్న శ్రద్ధ ఆచరణకు వచ్చేసరికి ఉండడం లేదు. అందుకే ఈ వ్యవస్థ నానాటికీ పెరిగిపోతున్నది. వాస్తవంగా పరిశీలిస్తే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కొంత మేరకు ఫలితాలు కూడా సాధించారని చెప్పొచ్చు. కానీ గత రెండు, మూడు దశాబ్దాలుగా ఆ కోణంలో నిర్దిష్టమైన చర్యలు లేకపోవడంతో ఈ వ్యవస్థకు అడ్డులేకుండాపోతున్నది. మొన్న కరోనా రక్కసి విజృంభించిన తర్వాత బాలకార్మిక వ్యవస్థ మరింతగా పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, మరీ నిరుపేదల పిల్లలు బడిబాట మానేసి కార్మికుల అవతారమెత్తారు. ఆర్థిక వసతులులేకపోవడం, కంప్యూటర్, వాట్సాప్, ఫోన్‌లుకొనలేక, కొన్నాసాంకేతిక పరిజ్ఞానం రాక, ఇవన్నీ ఉన్నా పాఠశాలలో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో చాలామంది విద్యార్థులుచదువులకు స్వస్తి చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా బాలబాలికలు చదువులకు స్వస్తి చెప్పి వ్యవసాయరంగంలోనో, లేక పారిశ్రామిక రంగంలోనో అవి, ఇవి కాకపోతే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏదోరకం పనుల్లో చేరిపోయారు. ఆ తర్వాతపాఠశాలలు తెరిచినా పాలకులు మళ్లీ బడిబాట పట్టించేందుకు ఎంతప్రయత్నాలు చేస్తున్నా పాఠశాలలవైపు మళ్లించలేకపోతున్నారు. ఒకవేళ ఉచితాలకు ఆశపడి వచ్చినా ఉండలేకపోతున్నారు. ఫలితంగా ఆటపాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన ఎంతోమంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి కొత్త చట్టాలు తీసుకువచ్చామని ఎన్నిసార్లు నేతలు ప్రకటించుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక రూపంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నిటికంటే ప్రధానంగా ఈ కూపం నుంచి బయటకుతీసుకువచ్చిన బాలకార్మికులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్టమైన చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇది ఎన్నో

## ఒక్క మాట

ఏళ్ల నుంచి జరుగుతున్నా, చాలామంది అధికారులకు తెలిసినా పాలకులను నమ్మించేందుకు కాగితాల మీద ఏవో రాసుకొని కాలం గడుపుతున్నారు. దీనికితోడు ఇటీవలకాలంలో బాలబాలికలను అపహరించి అమ్మే వ్యాపారం చేసే ముఠాలు పెరిగిపోతున్నాయి. ఈముఠాలు కూడా బాలలను అమ్ముకోవడంతోపాటు భిక్షాటన కూడా చేయించడం ద్వారా వ్యాపారంగా మలుచుకుంటున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా యేటా వేలాదిమంది బాలబాలికలు అపహరణకు గురవుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నేటి ప్రధాని నరేంద్రమోడీ వరకు రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్ కలాం, తదితర పెద్ద లెందరో బాలలపట్ల అత్యంత ప్రేమాభిమానాలుచూపినవారే. ఈ బాలలే భావిభారత పౌరులని వారి జీవితాల్లో వెలుగు నింపాలని ఆశించినవారే. ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించినవారే. మన రాజ్యాంగ నిర్మాతలు కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాజ్యాంగంలోని 24వ అధికరణం బాలకార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. బాలబాలికలను సంస్థలు కానీ, వ్యక్తులు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని 39(ఇ) అధికరణ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేతవయసులో ఉన్న పిల్లలను వాళ్ల వయసుకు మించిన పనుల్లో పెట్టకూడదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. తల్లిదండ్రులు తమ ఆర్థిక పరిస్థితుల నిమిత్తం పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో నియమించరాదని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. మరోకపక్క ప్రమాదాలకు అవకాశం ఉన్న పరిశ్రమల్లో బాలకార్మికులను నియమించరాదని మరో చట్టంతీసుకువచ్చారు. ఇప్పటివరకు ఇలాఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. పెద్ద ఎత్తున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. వెట్టిచాకిరి నుంచి వారిని బయటకు తీసుకువచ్చి వారి, వారి స్వస్థలాలకు పంపారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు ఎంతో కృషిచేశారు. వెట్టిచాకిరిలో ఏళ్లతరబడి మగ్గిపోతూ బయటకు వచ్చి స్వగ్రామాలకు చేరుకున్నవారు ఎంతోకాలం అక్కడ ఉండలేకపోయారు. ఏదోమార్గం ద్వారా పాతపనులకు వచ్చి చేరుకుంటున్నారు. బాలకార్మికులను ఆ కూపం నుంచి బయటకు తీసుకువచ్చామని, పునరావాసం కల్పించామని చేస్తున్న ప్రకటనలు ప్రచారార్భాటాలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికీ ఆశించిన లక్ష్యం చేరుకునే అవకాశాలు కనుచూపుమేరలో కన్పించడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలు ఏమిటనేది పాలకులకు తెలియందేమీ కాదు. అలాగే తల్లిదండ్రులే తమ పిల్లలను నాలుగు డబ్బుల కోసం ఇలాంటి పనుల్లో చేర్పిస్తున్నారనే వాదనను తోసిపుచ్చలేం. పాలకులు ఒకవిషయాన్ని మనసు పెట్టి ఆలోచించాలి. లేత వయసులో చదువు సంధ్యలతో, ఆటపాటలతో ఆడుతూపాడుతూ కళ్లముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న వారి తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతున్నారో వేరేచెప్పక్కర్లేదు. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆ పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్లకోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితులేననేది వాస్తవం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులెన్నో చేస్తూ ఇంకెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి పేదరికం వారి నోరువిప్పనీయడం లేదు. తల్లిదండ్రులకు దూరమై, వారి ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు ఇటు తమకుఇష్టంలేని వ్యవస్థలో పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్రమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతమేరకైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ మూలాలను వదిలిపెట్టి చట్టాలు తెచ్చుకున్నాం, సమీక్షలు చేస్తున్నామంటూ అంతా అయిపోయినట్టుగా ప్రకటించుకోవడం మనలను మనం మోసం చేసుకోవడమే. ●

# మాటల్లోనే గాంధీయిజం!


కరంచంద్ నేడుండినా ఈ నిషా బంద్ కాకుండెనా.. ఎంతో ఆవేదనతో అన్నాడో ఓ కవి. వాస్తవానికి మద్యపాన నిషేధం అన్నది మహాత్ముడు జాతికి అందించిన అమృత సందేశం. ఆనాడు కాంగ్రెస్ పార్టీయేకాదు, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ప్రజాస్వామ్యవాదులెందరో మద్యపానాన్ని ఈ దేశం నుంచి పారద్రోలాలని నినదించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో తీర్మానాలు చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మద్యపాన నిషేధం దేశంలో మొట్టమొదటిసారిగా అమలు చేసింది. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే ఆనాడు తాగుబోతులంటనే సమాజంలో ఏమాత్రం గౌరవభావాలు ఉండేవి కావు. ఒక రకంగా చెప్పాలంటే వారిని సమాజం బహిష్కరించినట్టుగా వ్యవహరించేది. ఎక్కడో చాటుమాటుగా తాగేవారు. పూర్తి మైకంలో పది మందిలోకి రావడానికి ఏమనుకుంటారోనని సిగ్గు, బిడియం ఉండేవి. తాగుబోతుల విషయంలో ఆనాటి పాలకులు ఎంతో కఠినంగా వ్యవహరించేవారు. దొంగసారా, గుడంబ, మద్యం తయారీ, అమ్మకందారులపై ప్రభుత్వం ఎంతో దృఢవైఖరి అవలంబించేది. కానీ రానురాను పరిస్థితులు మారిపోయాయి. మద్యం సేవించడం ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. స్వాతంత్ర్యం వచ్చి ఈ ఎనభై ఏళ్లలో ఎంతో అభివృద్ధి సాధించినా, మరెన్నో రంగాల్లో ఘనవిజయాలు సొంతం చేసుకున్నా మద్యం విషయంలో మాత్రం చతికిలపడిపోతున్నారు. ప్రభుత్వం ఆదాయం కోసం దుకాణాలు పెట్టించి మద్యం సేవించండి, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చండంటూ బతిమాలి, భంగపడి తాగించే దురదృష్టపు రోజులు దాపురించాయి. గాంధీ వారసులమని చెప్పుకుంటున్నవారు, పార్టీలు వేరైనా గాంధీ సిద్ధాంతాలను అమలు చేస్తున్నామని చెప్పుకుంటున్న పెద్దలు మద్యం నిషేధం విషయంలో మాత్రం అందుకు పూర్తిగా భిన్నమైన బాటలో నడుస్తున్నారు. దశలవారీగా ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. అసలు యేడాది యేడాదికి పెరుగుతున్న మద్యం ఆదాయం చూస్తే మద్యం ఏస్థాయిలో వినియోగం అవుతుందో తెలుస్తుంది. ఏమి చేసి అయినా మద్యం ద్వారా ఎంత వీలైతే అంత, ఎలా వీలైతే అలా పెంచుకోవాలనే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్ల కొద్దీ నడిచే పరిస్థితుల నుండి ఇప్పటికీ బయటపడని పల్లెలు కోకొల్లలు. కానీ మద్యం దొరకని గ్రామాలు దుర్భిణి పెట్టి వెతికినా కన్పించకపోవచ్చు. బెల్టుషాపు విధానం ఎవరి ఆలోచనో కానీ గ్రామాలకు గ్రామాలను మద్యంలో ముంచెత్తుతున్నాయి. రికార్డు పరంగా సారాను నిషేధించారు. కానీ అమలు చేసే త్రికరణశుద్ధి పాలకులకు లేకుండాపోతున్నది. కారు చౌకగా లభించే నాటుసారా, గుడంబ తయారీకొన్ని ప్రాంతాల్లో కుటీర పరిశ్రమగా మారిపోయింది. అప్పుడప్పుడు రికార్డుల కోసం నాటుసారా బట్టీలను పగలగొట్టి కేసులు పెడుతున్నారు. అసలు అక్రమంగా మద్యంఅమ్ముకునేవారికి కానీ, నాటుసారా తయారీదారులకు కానీఎక్సైజ్ అధికారులన్నా, పోలీసు అధికారులన్నా భయభక్తులు లేకుండాపోయాయి. ఒకప్పుడు ఎక్సైజ్‌శాఖ అధికారులంటే గడగడలాడే అక్రమ మద్యం వ్యాపారులు ఇప్పుడువారిని పట్టించుకునే పరిస్థితిలో లేరు. ఒకపక్క మామూళ్లు, మరొకపక్క రాజకీయ ఒత్తిడిలు వారు వానపాముల్లా మారికాలం గడుపుతున్నారు. అందుకు వారిని నిందించే కంటే ఈ పాపానికి పాలకులను బాధ్యులను చేయాలి. చివరకు పరిస్థితి ఎక్కడవరకు వచ్చిందంటే నాటుసారా, గుడంబాను నియంత్రించలేక మద్యంపేరుతో చీప్‌లిక్కర్‌ను తయారు చేసి సారా తాగేవారిని తమవైపు తిప్పుకునేందుకు మద్యం వ్యాపారులు రూపకల్పన చేశారు. ఒక రకంగా చెప్పాలంటే రంగుకలిపిన నాటుసారా రెక్టిఫైడ్ స్పిరిట్‌లో నీళ్లు కలిపి రంగుపొడి చల్లి సీసాలు నింపితే చీప్ లిక్కర్ తయారవుతుంది. తగిన పరిణామంలో నీళ్లు కలపకపోయినా, వాడే రంగులు కాలం చెల్లినా, ఖాళీ సీసాలు సరిగ్గా శుభ్రం చేయకపోయినా, కలుషిత నీరు కలిపినా చీప్ లిక్కర్ కాస్త విషతుల్యంగా మారుతుంది. దీనికితోడు కిక్ బాగా ఎక్కించాలని కొందరు వ్యాపారులు రసాయనాల పెస్టిసైడ్స్ కలుపుతున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. వ్యాపారులకు అంచనాలకు మించి ఆదాయం తెచ్చి పెట్టే ఈ చీప్ లిక్కర్ అమ్మకాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ చీప్ లిక్కర్ తాగి లక్షలాది నిరుపేదలు అనేక రోగాలబారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. అందులో కొందరి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మరి కొందరు తాగి, తాగి కృంగి, కృశించిమంచానికే పరిమితమై లేవలేని స్థితిలోపరలోకానికి పయనం కడుతున్నారు. ఇంకొందరు కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులబారిన కూడా పడుతున్నారు. తాగుడు కారణంగా రహదారి ప్రమాదాలు, మహిళలపై అఘాయిత్యాలువంటి నేరాలు ఊహించని రీతిలో పెరిగిపోతున్నాయి. నిర్భయ, దిశ కేసులతోసహా అఘాయిత్యాల్లో నిందితుల్లో అధికశాతం మద్యంమత్తులో ఉన్నవారే. రహదారుల్లో జరుగుతున్న అధిక శాతం ప్రమాదాలు వాహన చోదకులు మద్యం సేవించి నడపడంవల్లనే జరుగుతున్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. రోడ్లపక్కనే వెలసిన అనధికార మద్యం కేంద్రాలు డ్రైవర్లను మత్తులో ముంచుతున్నాయి. కొందరు మైనర్లు కూడా ఈమత్తుకు అలవాటుపడుతున్నారు. ఎన్నికల్లో కూడామద్యం పంపిణీ కీలకమైపోయింది. ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని చెప్పుకునే నేతలు నిరుపేదలు ఇలా బలైపోతున్నా అధికారం, డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తుంటే ఎవరికిచెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? ఏదిఏమైనా రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రజాప్రతినిధులు ఆలోచించాల్సిన తరుణమిది.

కవి బాధ్యత జాతిని గురించి పరిశీలించడమే కానీ, వ్యక్తిని గురించి ఆలోచించడం కాదు.



శామ్యూల్ జాన్సన్

రచయితల సంఖ్య పెరిగే కొద్దీ పాఠకులు సోమరులుగా మారడం సహజం.



గోల్డ్‌స్మిత్

# విశ్వవిద్యాలయాలకు అధ్యాపకుల కొరత!

సి.హెచ్.ప్రతాప్

దేశంలో ఉన్నత విద్య విస్తరిస్తోంది. కొత్త విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, కొత్త కోర్సులు, పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య ఇవన్నీ విద్యా విస్తరణకు సంకేతాలే. కానీ తరగతి గదిలో బోధించే అధ్యాపకులు లేకపోతే ఈ విస్తరణ ఎంతవరకు ప్రయోజనకరం? విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న వేగానికి అనుగుణంగా అధ్యాపక నియామకాలు జరగకపోవడం ఉన్నత విద్యనాణ్యతకు ముప్పుగా మారుతోంది. విశ్వవిద్యాలయానికి భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు అవసరమే. అయితే వాటికి ప్రాణం పోసేది నాణ్యమైన అధ్యాపక బృందమే. దేశంలోని 23 ఐఐటీల్లో 12,498 మంజూరైన బోధనా పోస్టులకు గాను 4,804ఖాళీగా ఉన్నట్లు 2026జనవరి 30నాటి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38.4శాతం పోస్టులు భర్తీ కాలేదు. ఐఐటీ పట్నాలో 54.6శాతం, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 51.3 శాతం పోస్టులు ఖాళీగా ఉండగా, మరో 12 ఐఐటీల్లో మూడో వంతుకు పైగా ఖాళీలున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎఐఎస్‌హెచ్‌ఇ గణాంకాల ప్రకారం 2014-15లో 3.42 కోట్లుగా ఉన్న ఉన్నత విద్యలో విద్యార్థుల నమోదు 2022-23 నాటికి 4.46 కోట్లకు చేరింది. విద్యార్థుల సంఖ్య ఈస్థాయిలో పెరుగుతున్నప్పుడువారికి తగిన అధ్యాపక బలం కూడా ఉండాలి. అధ్యాపకుల కొరత ప్రభావం ఒక్కతరగతి గదితో ఆగదు. అందుబాటులో ఉన్న సిబ్బందిపై అదనపు బోధనా భారం పడుతుంది. విద్యార్థుల సందేహనివృత్తి, వ్యక్తిగత మార్గదర్శకత్వం, ప్రాజెక్టుల పర్యవేక్షణకు సమయం తగ్గుతుంది. ప్రయోగశాల బోధన, పరిశోధన, పీహెచ్‌డీ విద్యార్థుల పర్యవేక్షణ కూడా దెబ్బతినవచ్చు. అధ్యాపకుల సంఖ్య తక్కువగా ఉంటే విశ్వవిద్యాలయం జ్ఞానాన్ని సృష్టించే కేంద్రం నుంచి కేవలం పాఠ్యాంశాలను పూర్తిచేసే సంస్థగా మారే ప్రమాదం ఉంది. ఈవిషయంలో ప్రైవేటు విద్యా సంస్థల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలున్నాయి. విద్యార్థులను ఆకర్షించడంలో పరస్పర పోటీ పెరగడంతో పలు ప్రైవేటుసంస్థలు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయి. మెరుగైన వేతనాలు, పరిశోధనా అవకాశాలు, పరిశ్రమ అనుసంధానం, ఆధునిక బోధనా విధానాలు, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రతిభను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నాయి. విద్యార్థులు కూడా ఇప్పుడు సంస్థ భవనాల కంటే అక్కడి అధ్యాపకుల నాణ్యత, పరిశోధన, బోధనా ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐఐటీల్లో ఖాళీలకుప్రపంచవ్యాప్తంగా పరిశోధకులకు ఉన్న డిమాండ్, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, బహుళజాతి పరిశోధనా సంస్థలు, డీప్ టెక్ కంపెనీలతో పోటీ, కఠినమైన ఎంపిక ప్రమాణాలు కారణమవుతున్నాయని ఆయాసంస్థలు చెబుతున్నాయి. కాబట్టి ఖాళీలను భర్తీ చేయడం కోసం ప్రమాణాలను తగ్గించడం పరిష్కారం కాదు. ప్రతిభావంతులైన అధ్యాపకులను ఆకర్షించే, నిలుపుకునే విద్యా వాతావరణం కల్పించడమేఅసలు మార్గం. రాష్ట్రవిశ్వవిద్యాలయాల పరిస్థితిపైనా ప్రత్యేకదృష్టి అవసరం. దేశంలోని ఉన్నత విద్యార్థుల్లో అత్యధికులురాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ద్వారానే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అక్కడ అధ్యాపక ఖాళీలు దీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం లక్షలాది మంది విద్యార్థులపై పడుతుంది. అందువల్ల ఖాళీలను ఎప్పటికప్పుడు గుర్తించి, కాలపరిమితితో కూడిన నియామక ప్రక్రియను అమలు చేయాలి. నియామకాలు వేగంగా జరగాలి. అయితే వేగంతోపాటు మెరిట్, పారదర్శకత, అనుభవం, పరిశోధనా సామర్థ్యం కూడాకీలకం. అధ్యాపక నియామకం ఒక ఉద్యోగ భర్తీ ప్రక్రియ కాదు. దేశ భవిష్యత్తుకు మేధో పునాదినిర్మించే కార్యక్రమం. విద్యార్థుల సంఖ్య పెరగడం విద్యా విస్తరణ, వారికి నాణ్యమైన గురువులు అందడం విద్యా ప్రగతి. ●

# స్వతంత్ర భారత మార్గదర్శకులు



సి.పి. రాధాకృష్ణన్

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారతీయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధులందరికీ నివాళులు అర్పిస్తున్నాను. గతవారం అండమాన్, నికోబార్ దీవుల్లో పర్యటించినప్పుడు 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసే గౌరవం నాకు లభించింది. శ్రీ నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ 1943 డిసెంబర్ 30న భారత భూభాగంపై తొలిసారి మువ్వన్నెల జెండాను ఎగరవేసిన పవిత్ర భూమి పై నిలబడటం నా హృదయాన్ని కదిలించే అనుభవం. పసుంపోన్ ముత్తురామలింగ థేవార్ ఆహ్వానం మేరకు 1939 సెప్టెంబరులో శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ మధురైని సందర్శించిన విషయాన్ని ఈ సందర్భం నాకు గుర్తు చేసింది. ఆ ప్రాంతంలోని అనేక మంది దేశభక్తుల్లో ఈ చారిత్రక ఘట్టం స్ఫూర్తిని రగిలించింది. జాతీయ స్మారకమైన సెల్యూలార్ జైలును సందర్శించడం కూడా నా పర్యటనలో మరో స్ఫూర్తిదాయకమైన సందర్భం. శ్రీ వీర్ సావర్కర్, శ్రీ యోగేంద్ర శుక్లా, శ్రీ బతుకేశ్వర్ దత్, శ్రీ సచ్చీంద్రనాథ్ సన్యాల్‌తో సహా ఎందరో భరతమాత వీర పుత్రులను వలసవాద శక్తులు ఇక్కడ బంధించాయి. ఏకాంత కారాగార వాసాన్ని విధించాయి. స్వేచ్ఛగా, గౌరవంగా భారత్ మనుగడ సాగించాలనే లక్ష్యంతో ప్రాణాలర్పించిన వారి ధైర్యాన్నీ, వేదననూ, మహోన్నత త్యాగాల గాథలు నేటికీ ఈ జాతీయ స్మారకం గోడలు ప్రతిధ్వనిస్తు న్నాయి. లక్షలాది ప్రజల్లో దేశభక్తి జ్వాలను రగలించి దేశా న్ని స్వాతంత్రం దిశగా నడిపించిన ఈ మార్గదర్శకులందరికీ నివాళిగా ఈ వ్యాసం రాయడానికి ఈ సందర్శనే నాకు స్ఫూర్తి నిచ్చింది. క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తు చేసు కుంటూ ఆగస్టు 9న అండమాన్ దీవుల్లో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రారంభించడం నాకు ఎంతో ఆనం దాన్నిచ్చింది. జాతిపిత మహాత్మాగాంధీ 1942లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించి 'డూ ఆర్ డై' అనే స్ఫూర్తిదాయక నినాదాన్ని ఇచ్చారు. ఈ పిలుపుతో దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యం సాధించాలనే ఆకాంక్ష తీవ్రమయింది. భరతమాతకు స్వేచ్ఛ కోసం దేశ వ్యాప్తంగా లక్షలాది స్వాతంత్ర్య సమరయోధులు చెక్కు చెదరని సంకల్పంతో పోరాడారు. ఉత్తరాన కాశ్మీర్, దక్షిణాన తమిళనాడు, పశ్చిమాన గుజరాత్, తూర్పున అస్సాం ఇలా అన్ని ప్రాంతాలకూ, నేపథ్యాలకూ, వయసులకూ చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, ధీరవనితలూ ఒకే ఉమ్మడి లక్ష్యం కోసం ఏకమయ్యారు. అదే - భరత మాతకు స్వాతంత్ర్యం. మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాటానికి శాశ్వత ప్రతీకగా నిలిచిన ఝాన్సీ రాణి లక్ష్మీబాయి శౌర్యం, మంగళ్ పాండే ధైర్యం, స్వరాజ్యం నా జన్మహక్కు, నేను దానిని సాధిస్తాను అనే నినాదంతో దేశాన్ని జాగృతం చేసిన బాలగంగాధర తిలక్ పిలుపు - ఇలా ప్రతి స్వరం స్వాతంత్ర్యం దిశగా చేపట్టిన ప్రయాణాన్ని బలోపేతం చేసింది. తొలి స్వదేశీ నౌకారవాణా సంస్థను ప్రారంభించి వలస పాలన ఆర్థిక ఆధిపత్యాన్ని వీవో చిదంబరం సవాలు చేశారు. యుద్ధభూమిలో మాత్రమే కాకుండా.. వాణిజ్య రంగంలోనూ స్వాతంత్ర్య పోరాటం సాగిందని ఆయన నిరూపించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల విప్లవ కాంక్ష... స్వేచ్ఛా సాధనకు త్యాగం చేసేలా తరతరాలకూ స్ఫూర్తిగా నిలిచింది. ఈశాన్యంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన జ్వాలను రాణి గైడిన్లియు రగలించారు. అస్సాంలో అంచంచలమైన ధైర్యంతో జాతీయ పతాకాన్ని మోస్తూ, క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ కనకలతా బారువా అనే యువతి ప్రాణాలను అర్పించారు. భగవాన్ బిర్సా ముండా, అనేక మంది ఇతర గిరిజన నాయకులు వలస పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన చారిత్రక పోరాటానికి నాయకత్వం వహించారు. మనచరిత్ర పుటల్లో పోరాట పటిమనూ, ధైర్యాన్నీ, పట్టుదలనూ ప్రదర్శించే అనేక గాథలున్నాయి. అవన్నీ కలిసి ధైర్యాన్నీ, సాహసాన్నీ తనలో ఇముడ్చుకున్న గొప్ప చిత్రాన్ని ఆవిష్కరిస్తాయి. కోడి కాథ కుమరన్ (పతాక రక్షకుడు కుమరన్)గా ప్రసిద్ధి చెందిన తిరుప్పూర్ కుమరన్‌కు నివాళి అర్పిస్తున్నారు. నా స్వస్థలమైన తిరుప్పూర్‌లో, స్వాతంత్ర్య పోరాట సమయంలో జాతీయపతాకాన్ని కింద పడనీయకుండా పట్టుకొని మృత్యుఒడిలోకి చేరారు. అందుకే ఆయనకు ఈ బిరుదు లభించింది. చిన్నవయసులోనే కుమరన్ మనసులో దేశభక్తి జ్వాలప్రజ్వరిల్లింది. మహాత్మా గాంధీ ఆదర్శాలతో ప్రభావితమైన కుమరన్ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో జాతీయవాది స్ఫూర్తిని మేల్కొలపడానికి దేశబంధు యూత్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. వలసవాద పాలనలో అన్యాయాల పట్ల ప్రజలు చైతన్య వంతులైనప్పుడే, వలస పాలకులను ఎదుర్కొనే ధైర్యాన్ని, స్పష్టతను పెంపొందించుకున్నప్పుడే అసలైన స్వేచ్ఛ సాధ్య మవుతుందని కుమరన్ దృఢంగా విశ్వసించారు. గాంధీజీ బోధించిన సామాజిక సంస్కరణలకు కట్టుబడి, మద్యపానాన్ని విడిచిపెట్టి ఆత్మ నియంత్రణను అలవర్చుకోవాలని ప్రోత్సహిస్తూ.. కల్లు దుకాణాల వద్ద పికెటింగ్‌లో పాల్గొన్నారు. 1932 జనవరి 10న జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో కుమ రన్ ఓ యాత్రకు నాయకత్వం వహించారు. చేతిలో జాతీయ వాద పతాకాన్ని పట్టుకొని, మరికొందరు ధైర్యవంతులతో కలసి చేపట్టిన ఆ యాత్రలో వందేమాతరం నినాదాలతోతిరుప్పూర్ వీధులుప్రతిధ్వనించాయి. ఈ బృందంపై వలస వాదశక్తులు దాడిచేశాయి. ఈ దాడిలో తలకుగాయమైన కుమరన్ వందేమాతరం అని నినదిస్తూ.. జెండాను శరీరా నికి హత్తుకొని దేశం కోసం ప్రాణాలర్పించారు. మరణించే నాటికి ఆయన వయసు కేవలం 27 ఏళ్లు. తిరుప్పూర్ కుమరన్ వయసు గురించి రాస్తున్నప్పుడు, మాతృభూమి కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎందరో యువకులు గుర్తుకు వస్తున్నారు. భగత్ సింగ్ (23), సుఖ్‌దేవ్ (23), రాజ్‌గురు (22), ఖుదీరామ్ బోస్ (18), కనకలతా బారువా (18), అనంత లక్ష్మణ్ కన్హేరే (19), వంచినాథన్ (25) లాంటి ఎందరో యువకులు తమ ప్రాణాలను త్యాగం చేసి, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులయ్యారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అజ్ఞాత వీరులను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ చొరవను ప్రశంసిస్తున్నాను. సుప్రసిద్ధమైన, అజ్ఞాత స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పిస్తున్నాను. ఈ మహత్తర సందర్భంలో, మన మాతృభూమి పట్ల మన మన బాధ్యతను సమీక్షించుకొని, నవీకరించుకుందాం. ఈ అమృత కాలంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించడానికి మనల్ని మనం అంకితం చేసుకుందాం. మన దేశ పురోగతి, శ్రేయస్సు కోసంకలిసికట్టుగా కృషిచేద్దాం. అచంచలమైన ధైర్యంతో పోరాడి, మన స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధు లకు మనం అర్పించగల అత్యంత సముచితమైన నివాళి ఇదే. ●

జై హింద్! భారత్ మాతాకీ జై!

(రచయిత: భారత ఉపరాష్ట్రపతి)

# ప్రజావాక్కు

### పెట్టుబడులు సమాంతరంగా సాగాలి

**భారత** ఆర్థిక ప్రస్థానంలో మరో కీలక మైలురాయి నమోదైంది. అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ2026 ఏప్రిల్ వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ అంచనాల ప్రకారం 2025లో భారతనామమాత్ర స్థూల దేశీయోత్పత్తి3.92 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలో ఆరోఅతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది. ఇది కేవలం గణాంకాల్లో కనిపించే విజయంకాదు. కోట్లాదిమంది ప్రజలశ్రమ, వ్యాపార రంగం చొరవ, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, తయారీ రంగ విస్తరణ వంటి అనేక అంశాల సమ్మిళిత ఫలితమే ఈపురోగతి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం వంటి చర్యలుదేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు దోహదపడుతున్నాయి. వ్యవసాయంలో సాంకేతికత, సాగునీటి సదుపాయాలు, విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత బలం.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

**దాదాపు** రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలన నుంచి ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల శాంతియుత సత్యాగ్రహ, వీరోచిత ఆయుధ పోరాటాలతో దేశానికి 1947 ఆగస్టు 15న విముక్తి లభించడంతోఏటా ఆగస్టు15న దేశవ్యాప్తంగా జెండావందన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర వేడుకలతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని భారతీయులమైన మనం జరుపుకుంటూ 2026 ఆగస్టు 15ను 80వ స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కొన్ని రంగాలలో వెట్టిచాకిరీ పెరిగి సమతుల్యత లోపించి నాటి పరిపాలకుల బానిస బతుకులు గుర్తు చేసుకుంటూ ఎవరి ఉనికికోసం వారుపోరాడవలసి వస్తుంది. స్వతంత్ర పదం మసకబారక ఫలాలుఅందరికీ అందేలా అన్నిస్థాయిల వారు ప్రయత్నించి దేశఔన్నత్యం కోసం పాటుపడాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు

**ఓటరు** ప్రక్షాళన జాబితానే లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు మీ ఓటును చెక్ చేస్తాం లేదా మీ అప్లికేషన్ రిజెక్ట్ అయింది అని రకరకాల పేర్లతో ఓటర్లను ఓటీపీలు అడుగుతూ బురిడి కొట్టిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మీ వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు. మిమ్మల్ని ఏ అధికారి ఫోన్ చేసిఓటీపీలుఅడగరు. ఎవరైనాతెలియని వ్యక్తులు అడిగితే పోలీస్‌కంప్లైంట్ ఇవ్వండని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### ఉద్యోగుల ఆవేదన పట్టేదెవరికి?

**రాష్ట్రవ్యాప్తంగా** విద్యాశాఖలో వివిధ విభాగాలలోగత 15ఏళ్లుగా సుమారు 20,000 వేల మంది వివిధ హోదాలలో పని చేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గత ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా స్పందన శూన్యం అని ప్రస్తుత ప్రభుత్వంఅయినా తమసమస్యలుపట్టించుకో వాలని వాపోతున్నారు. 2023 ఆగస్టు17 నుంచి 45 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో, ప్రదేశాల్లో సామూహిక, రిలే నిరాహార దీక్షలుచేశారు. అధికారులకుఎన్నోసార్లు వినతి పత్రాలను సమర్పించారు. దీక్షలు విరమించి విధుల్లో చేరితేనే చర్చలు జరుపుతామని గతప్రభుత్వం ప్రకటించడంతో విధులలో చేరారు. అప్పటి పి.సి.సి అధ్యక్షులు ప్రస్తుత సి.యం రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మీ సమస్యలు తప్పక నెరవేరుస్తామని చెప్పడం జరిగింది. ఇప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రమాదకరంగా రోడ్డు ప్రయాణాలు

**వాతావరణ** మార్పులతో ఇటీవలకాలంలో తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంట ప్రయాణాలు ప్రమాదకరంగామారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలు తెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండిఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపైఉన్న చెట్లనుతొలగించే విధంగాచర్యలు చేపట్టాలి.

- టి. యోగేందర్, నల్లగొండ జిల్లా

### యువతను పురుగులతో పోల్చడం సరికాదు

**నల్సార్**దేశంలోనే పేరెన్నికగల న్యాయ విద్యాలయం. అయితే ఇక్కడ ఒకటి గుర్తు పెట్టుకోవలసి ఉంది. దేశ అత్యున్నత న్యాయమూర్తి నిరుద్యోగులను పురుగులతో పోల్చడం యువతకు నచ్చడంలేదు. ఎంతో జ్ఞానం సంపాదించి ఎంతో కష్టించి చదివిన చదువుపట్టాను మానవత్వంలేని పురుగులుగా చూసే మనసుతో ఆలోచించే వారి చేతఎట్లా తీసుకుంటాం అనికూడా వారు అంటున్నారు. జంతర్‌మంతర్ పోరాటంలో పోలీసులు విచక్షణరహితంగా విద్యార్థులను చావాబాదుతున్న ఫోటోలను చూసే టైంలేదని చెప్పడం ప్రధానన్యాయమూర్తికే చెల్లింది.

-భారత అవినాష్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రపంచదేశాల్లో పెరుగుతున్న భారత్ క్రేజ్




## పాక్ మినహా అన్నింటా సానుకూల వైఖరి

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** ప్రపంచదేశాల్లో భారత్‌పట్ల సానుకూల వైఖరి అత్యధికంగా కనిపిస్తోంది. భారత్‌లో అన్ని రంగాల వాతావరణం అనున కూలంగా ఉండటం వల్లనేదినదినాభివృద్ధి చెందు తున్నదన్న భావన విదేశీయుల్లో అత్యధికంగా కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వే ఆసక్తికర సమాధానాలు ఇచ్చింది. 36 దేశాల్లో 42 వేల మందికిపైగా అభిప్రాయాలను సేకరించిన ఈ సర్వేలో భారత్‌పై సానుకూలతే ఎక్కువగా కనిపించింది. ఈ దేశాల్లో భారత్‌పై సగటున 45 శాతం మంది సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. 41 శాతం మంది ప్రతికూలంగా స్పందించారు. భారత్‌కు అత్యధిక మద్దతు శ్రీలంకలో కనిపించింది. అక్కడ ఏకంగా 79 శాతం మంది భారత్‌పై సానుకూల అభిప్రాయం వెల్లడించారు. కేవలం 11 శాతం మందే వ్యతిరేకంగా స్పందించారు. 2024లో భారత్‌పై సానుకూలంగా ఉన్న శ్రీలంక వాసుల సంఖ్య 65 శాతం కాగా ఇప్పుడు అది 79 శాతానికి పెరిగింది. కెన్యాలో 71 శాతం, బ్రిటన్‌లో 71 శాతం, జర్మనీలో 63 శాతం, ఇజ్రాయెల్‌లో 60 శాతం, ఇటలీలో 56 శాతం, స్వీడన్‌లో 55 శాతం మంది భారత్‌పై సాను కూలంగా ఉన్నారు. జపాన్‌లో 55 శాతం, థాయ్ లాండ్‌లో 55శాతం, సింగపూర్ లో 51 శాతం, ఇండోనేషియాలో 50 శాతం మంది భారత్‌ను సానుకూల దేశంగా భావిస్తున్నారు. అయితే పాకిస్థాన్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ 91 శాతం మంది భారత్‌పై ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం 7 శాతం మందే సానుకూలంగా స్పందించారు. భారత్‌పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఫలితం పెద్దగా ఆశ్చర్యం కలిగిం చలేదు. బంగ్లాదేశ్‌లో 42 శాతం మంది భారత్‌కు అనుకూలంగా ఉండగా 51 శాతం మంది వ్యతిరేకంగా ఉన్నారు.అమెరికాలో అభిప్రాయాలు దాదాపు సమానంగా ఉన్నాయి. 50 శాతం మంది భారత్‌పై ప్రతికూలంగా స్పందించగా 45 శాతం మంది సానుకూలంగా ఉన్నారు. 2023లో భారత్‌పై సానుకూలంగా ఉన్న అమెరికన్ల సంఖ్య 51 శాతం ఉండగా 2026లో 45 శాతానికి తగ్గింది. మొత్తంగా చూస్తే ఆసియా, ఆఫ్రికాలో భారత్‌కు మంచి ఆదరణ కనిపించింది. యూరప్, అమెరికాలో మాత్రం అభిప్రాయాలు మిశ్రమంగా ఉన్నాయి. పొరుగు దేశాల్లో పాకిస్థాన్ అత్యంత ప్రతికూల వైఖరితో ప్రత్యేకంగా నిలిచింది.

# నేడు ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రసంగించనున్నారు. జాతీయ గీతం వందే మాతరానికి 150 ఏళ్ల చారిత్రక వారసత్వాన్ని స్మరించుకోవడంతో పాటు, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో యువశక్తి ఉత్సాహం, ఆకాంక్షలు, కీలక పాత్రను ఈ వేడుకల్లో ప్రదర్శించనున్నారు. తొలిసారిగా ఎర్రకోట స్వాతంత్ర్య వేడుకల్లో వందే మాతర్ధంను ప్రత్యేకంగా ఆలపించనున్నారు. శనివారం ఉదయం 7.30 గంటల నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రత్యక్ష ప్రసారం కాను న్నాయి. అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల వేడుక లను ప్రసారం చేయనుండగా, దూరదర్శన్ అధి కారిక ప్రసారకర్తగా వ్యవహరిస్తుంది. ఎర్రకోటకు చేరుకున్న ప్రధాని మోడీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ స్వాగతం పలుకుతారు. అనంతరం ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేశ్ సేథీని ప్రధానికి పరిచయం చేస్తారు. ఆయన ప్రధాని మోడీని సల్యూటింగ్ బేస్‌కు తీసుకెళ్లగా, త్రివిధ దళాలు, ఢిల్లీ పోలీసులతో కూడిన గార్డ్ ప్రధానికి జనరల్ సెల్యూట్ సమర్పి స్తుంది.ఆ తర్వాత ప్రధాని గార్డ్ ఆఫ్ ఆనర్‌ను పరిశీలిస్తారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమన్వయ బాధ్యతను భారత సైన్యం నిర్వహిస్తోంది. గార్డ్ ఆఫ్ ఆనర్‌కు లెఫ్టినెంట్ కల్నల్ అర్జున్‌సింగ్ నేతృత్వం వహించనున్నారు.గార్డ్ ఆఫ్ ఆనర్ పరిశీలన అనంతరం ప్రధాని ఎర్రకోట ప్రాకారాలపైకి చేరుకుంటారు. కెప్టెన్ సోనియా సింగ్ చౌహాన్ సహాయంతో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. అదే సమయంలో 1721 ఫీల్డ్ బ్యాటరీకు చెందిన సైనికులు 21 తుపాకుల వందనం సమర్పిస్తారు. స్వదేశీ 105ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌ను ఇందు కోసంవినియోగించనున్నారు.జాతీయ పతాకావిష్క రణ అనంతరం రాష్ట్రీయ సెల్యూట్ నిర్వహిస్తారు. ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్, 25 మంది ఇతర సిబ్బందితో కూడిన ఆర్మీ బ్యాండ్ వందే మాతరాన్ని ఆలపిస్తుంది. అనంతరం ఎర్రకోట వద్ద హాజరైన వారందరూ జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.పతాకావిష్కరణ సమయంలో భారత వైమానిక దళానికి చెందిన రెండు హెలికాప్టర్లు పూల వర్షం కురిపించను న్నాయి. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని, మరొకటి వందే మాతరంను సూచించేజెండాను మోసుకెళ్తుంది.ఈ కార్యక్రమాల అనంతరం ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

# భారతీయ రైల్వేలపైనే ఐఎస్ఐ ఫోకస్



## ఇప్పటికే సమాచార సేకరణ కోసం ఏజెంట్ల నియామకం, ఐబి హెచ్చరికలు

న్యూఢిల్లీ, ఆగస్టు 14: దేశానికి జీవనాడి అయిన భారతీయ రైల్వే వ్యవస్థపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఐఎస్ఐ) భారీ కుట్రకు తెరలేపి నట్లు భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. రైల్వేలు ఇటీవల కాలంలో ఉగ్ర వాదుల ప్రధాన లక్ష్యంగా మారాయని, దేశవ్యా ప్తంగా భయాందోళనలు సృష్టించేందుకు ఐఎస్ఐ ఒక పక్కా వ్యూహంతో ముందుకెళుతోందని ఇం టెలిజెన్స్ బ్యూరో తన నివేదికలో హెచ్చరిం చింది. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఈ హెచ్చరికలు తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఎస్ఐ తన గూఢచర్య కార్యకలాపాలను ప్రధానంగా భారత సైన్యం, రైల్వేలపైనే కేంద్రీకరించింది. ఇటీవలి కాలంలో ఈ వ్యూహంలో స్పష్టమైన మార్పు కనబడు తోంది. సైనిక స్థావరాలపై సమాచారం సేకరణ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా ఉండగా, రైల్వేలపై మాత్రం తక్షణ దాడులు చేయాలనే ఉద్దేశంతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. దేశ రవాణా వ్యవస్థకు రైల్వేలు వెన్నెముక అని, వాటిని దెబ్బతీస్తే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించవచ్చని ఐఎస్ఐ భావిస్తోంది. ఈ కుట్రలో భాగంగా ఐఎస్ఐ రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. ఒకటి, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లపై నేరుగా దాడులు చేయడం. రెండోది, ప్రజలను మానసికంగా దెబ్బతీసేందుకు మైండ్ గేమ్స్ ఆడటం. ఇందుకోసం ప్రత్యేకంగా కొం దరిని నియమించుకుని, రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో బాంబు బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయిస్తున్నారు. ఈ కుట్ర కోసం గత ఏడాది కాలంగా ఐఎస్ఐ నిఘాను పది రెట్లు పెంచింది. కేవలం రూ.3వేలు వంటి స్వల్ప మొత్తానికే కొందరు యువ కులను ఏజెంట్లుగా నియమించుకుని, వారి ద్వారా రైల్వే స్టేషన్లలోని కీలక ప్రదేశాలను ఫొటోలు తీయించడం, భద్రతా ఏర్పా ట్లను అంచనా వేయించడం వంటివి చేస్తోంది. మరింత పక్కాగా సమాచారం కోసం కొన్ని రైల్వే స్టేషన్లలో సోలార్ పవర్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను కూడా రహస్యంగా ఏర్పాటు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కో కెమెరా అమర్చినందుకు రూ.ఐదువేల నుంచి రూ.పదివేల వరకు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు.

ఈ దాడులకు ఇస్లామిస్ట్ గ్రూపులతో పాటు పంజాబ్, హర్యానాల్లో రైల్వేలను లక్ష్యం చేసుకునేందుకు బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ) వంటి సంస్థలను కూడా ఐఎస్ఐ వాడుకుంటోందని తెలిసింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో భద్రతా బలగాలు ఢిల్లీపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని, ఇదే అదనుగా రైల్వే వ్యవస్థపై దాడికి ఉగ్రమూకలు ప్రయత్నిం చవచ్చని ఐబీ హెచ్చరించింది. దీంతో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో హై అలర్ట్ ప్రకటించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

# విజయ్ సర్కారు నిర్ణయానికి సుప్రీంలో ఊరట


**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** కరూర్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు సీఎం విజయ్ తీసుకున్న నిర్ణయానికి సుప్రీంకోర్టు మద్దతు లభించింది. ఈ నియామకాలు చెల్లవు అంటూ ఇటీవల మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. ఈ మేరకు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్ ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలివి. తమిళనాడులో గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్ పట్టణంలో తొక్కిసలాట జరిగింది. టీవీకే అధినేత విజయ్ నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా జరిగిన ఈ తొక్కిసలాటలో 41 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన విజయ్ కరూర్ బాధితులైన పలువురి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు అందజేశారు. జూలై 10న సీఎం విజయ్ నియామక పత్రాలు అందజేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రమాద మృతులకు ఏ ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగం ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వారి ఉద్యోగ నియామకాల్ని రద్దు చేయాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు ప్రభుత్వ ఆదేశాలు చెల్లవని పేర్కొంది. ఈ ఉద్యోగ నియామకాల్ని రద్దు చేసింది. ఇలా చేస్తే, ఇదేతరహా విజ్ఞాపనలు ఇంకా పెరుగుతాయని పేర్కొంది. ఇలా పరిహారం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం చెల్లదని, ఎందరో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని హైకోర్టు పేర్కొంది. ఉద్యోగాలు అర్హతతో సాధించుకోవాలని సూచించింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, ఆర్ శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. తాము కల్పించిన ప్రభుత్వ ఉద్యోగాల్ని హైకోర్టు రద్దు చేయడంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.మీరు ప్రభుత్వ పాలసీనే ప్రశ్నిస్తారా కుటుంబానికి ఆదాయం అందించే వ్యక్తి మరణిస్తే వారి కొడుకుకు లేదా కూతురుకు ఉపాధి కింద ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వకూడదా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.


# స్టాండప్ కమెడియన్ సమయ్‌రైనాపై కేసు కొట్టివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** యూట్యూబ్ కామెడీ షో ఇండియాస్ గాట్ లేటెంట్‌లో దివ్యాంగుల నుద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కేసుకు సంబంధించి ప్రముఖ స్టాండప్ కమెడియన్ సమయ్ రైనాతో పాటు మరో నలుగురికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారీ ఉపశమనం లభించింది. వారిపై నమోదైన అన్ని క్రిమినల్ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో దివ్యాంగుల సంక్షేమం, నిధుల సమీకరణ, చైతన్య కార్యక్రమాలు నిర్వహిం చాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను సమయ్ రైనా బృందం సమర్థవం తంగా అమలు చేయడాన్ని ధర్మాసనం ప్రశంసిం చింది. నిజాయతీతో కూడిన ప్రయత్నాలు చేసినప్పుడు కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయి. వీరంతా అత్యంత తెలివైన యువకులు. వీరు సానుకూల దిశలో పనిచేయడం ప్రారంభిస్తే, ఆ నిష్పత్తిలోనే మంచి ఫలితాలు వస్తాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సమయ్ రైనాతో పాటు విపుల్ గోయల్, బల్‌రాజ్ పరమ్‌జీత్ సింగ్ ఘాయ్, సోనాలి థక్కర్ నిశాంత్ జగదీష్ తన్వర్ లపై ఉన్న క్రిమినల్ వ్యవహారాలను పూర్తిగా ముగిస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.

# ప్రతి నీటి బొట్టూ భారత్‌కు రెడ్‌లైన్: షెహబాజ్

**ఇస్లామాబాద్, ఆగస్టు14:** సింధూ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. సింధూ జలాల్లో తమకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టును రెడ్‌లైన్‌గా పరిగణిస్తామని ప్రేలాపనలు చేశారు. తమ నీటి హక్కులను కాలరాసేలా భారత్ ఎలాంటి చర్యలకు పాల్పడినా గట్టిగా బదులిస్తామని ప్రగల్భాలు పలికారు.





బావమరిది శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, చిత్రంలో కెటిఆర్ తదితరులు

# శ్రీనివాసరావు అంత్యక్రియల్లో మాజీ సిఎం కెసిఆర్

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** అనారోగ్యంతో మృతి చెందిన తన బావమరిది, జోగినపల్లి శ్రీనివాసరావు భౌతికకాయానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు ఉన్నారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జోగినపల్లి శ్రీనివాసరావు ఈ నెల 13న తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న కేటీఆర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు కూడా కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం శ్రీనివాసరావు అంత్యక్రియలను కంటోన్మెంట్ శ్మశానవాటికలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, బంధువులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతితో ఆల్వాల్‌లోని ఆయన నివాసానికి వెళ్లేందుకు కేసీఆర్ బయలుదేరిన సమయంలో శామీర్‌పేట సమీపంలో ఆయన కాన్వాయ్ కొద్దిసేపు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజీవ్ రహదారిపై పలు డిమాండ్లతో స్థానిక రైతులు ఆందోళన చేపట్టడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కేసీఆర్ కాన్వాయ్ కూడా ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఆందోళనకారులను రహదారి పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం కేసీఆర్ కాన్వాయ్‌ను ఆల్వాల్ వైపు పంపించారు.

### జాతీయ ఉపాధ్యాయ పురస్కారం-2026 ఫైనల్ ఇంటర్వ్యూకు

# తెలంగాణ నుంచి ఆరుగురు ఎంపిక

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్ అభినందనలు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** జాతీయ ఉపాధ్యాయ పురస్కారం – 2026 ఫైనల్ ఇంటర్వ్యూ కోసం ఆరుగురు తెలంగాణ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఎంపికైన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయులను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అభినందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకి ఎంపికైన తెలంగాణకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులతో నేషనల్ టీచర్ అవార్డ్(ఎన్‌టిఏ)–2026 ఇండిపెండెంట్ జూరీ శుక్రవారం పాఠశాల విద్య శాఖ కార్యాలయంలో గూగుల్ మీట్ వర్చువల్ మోడల్‌లో నిర్వహించారు. ఫైనల్ ఇంటర్వ్యూకు రాష్ట్రం నుండి ఆరుగురు ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఇంటర్వ్యూ చేశారు. ధర్మపురి వెంకటేశ్వర్లు – స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్), జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్, జంకాపూర్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా. డిజిటల్ ఇంగ్లీష్ ల్యాబ్, ఐసిటీ ఆధారిత బోధన, విద్యార్థుల కెరీర్ మార్గదర్శకత్వంలో విశేష కృషి. షేక్ తాజ్ బాబు – హెడ్‌మాస్టర్, జెడ్పీ హై స్కూల్, దర్గా హుస్సేన్ షావలి, రాయిదుర్గ్ మండలం, రంగారెడ్డి జిల్లా. స్కూల్ అభివృద్ధి, స్టెమ్ అండ్ రోబోటిక్స్ ల్యాబ్, డిజిటల్ లిటరసీ పెంపు. పెం దోటా రూపా రాణి – గణిత ఉపాధ్యాయురాలు, ఇన్నోవేటివ్ గణిత బోధన, ఐసిటీ ఆధారిత పాఠాలు, గణిత గీతాలు, పరిశోధన పత్రాలు. బొంపెల్లి భవాని – సెకండరీ గ్రేడ్ టీచర్, ఎం.పి.పి.ఎస్. గర్ల్స్, గంధారి, కామారెడ్డి జిల్లా. ఫౌండేషనల్ లిటరసీ, బాలికల విద్యా ప్రోత్సాహం, కమ్యూనిటీ భాగస్వామ్యం. మాదరి యెల్లన్న – సెకండరీ గ్రేడ్ టీచర్, ఎం.పి.పి.ఎస్. వనలపహాడ్, భైంసా మండలం, నిర్మల్ జిల్లా. పప్పెట్రీ, లోకల్ మెటీరియల్స్‌తో టిఎల్ఎం తయారీ, విద్యార్థుల నమోదు పెంపు. చందూరి రాజిరెడ్డి – హెడ్ టీచర్(ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం), ఎం.పి.పి.ఎస్. గుల్లకోట, ఎండపల్లి మండలం, జగిత్యాల జిల్లా. సమాజ భాగస్వామ్యం, సీఎస్ఆర్ ద్వారా స్కూల్ అభివృద్ధి, డిజిటల్ లెర్నింగ్ కార్నర్ ఏర్పాటు. తెలంగాణకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు తమ సృజనాత్మక బోధన, విద్యార్థుల సమగ్రాభివృద్ధి, కమ్యూనిటీ భాగస్వామ్యం, ఐసిటీ వినియోగం, విద్యా సమానత్వం కోసం చేసిన విశేష కృషి కారణంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని, వారిని పాఠశాల విద్యా శాఖ సంచాలకులు డాక్టర్ ఈ నవీన్ నికోలస్ అభినందించారు.

# వాతావరణ మార్పులు తట్టుకునే వ్యవసాయ పరిశోధనలు

### హైదరాబాద్ వర్సిటీకి రూ.2.5 కోట్ల విలువైన గ్రాంట్లు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డిబిటి) వారి బయోఈ3 బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ పాలసీ కింద హైదరాబాద్ విశ్వవిద్యాలయం (యూఓహెచ్) రూ. 2.5 కోట్ల విలువైన రెండు పరిశోధన గ్రాంట్లను దక్కించుకుంది. క్లైమేట్ రెసిలియంట్ అగ్రికల్చర్ పై డిబిటిబిరాక్ జాయింట్ కాల్ ఫర్ ప్రపోజల్స్ ద్వారా వీటిని సాధించింది. ఈ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ప్లాంట్ సైన్సెస్ విభాగానికి చెందిన డాక్టర్ ఎం. ముత్తమిలరసన్, ఈ రెండు ప్రాజెక్టులకు విశ్వవిద్యాలయం తరపున ప్రధాన పరిశోధకుడిగా ఉన్నారు. ఈ ప్రాజెక్టులు వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయం కోసం బయోటెక్నాలజీ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి పలు జాతీయ సంస్థల శాస్త్రవేత్తలను ఒకచోట చేర్చుతున్నాయి. రెండవ ప్రాజెక్ట్ జన్యు సవరణ, పెప్టైడ్ ఆధారిత పత్ర చికిత్స ద్వారా టమాటాలో వైరస్ నిరోధకతను కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. టమాటా, చిరుధాన్యాలపై తాము చేస్తున్న పరిశోధనా ప్రయాణానికి ఈ రెండు బయోఈ3 ప్రాజెక్టులు సహజమైన కొనసాగింపు అని ఈ సందర్భంగా శుక్రవారం డాక్టర్ ముత్తమిలరసన్ అన్నారు. ఈ రెండు గ్రాంట్లతో, మా ల్యాబ్ ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియో రూ. 417.71 లక్షలకు పెరిగిందని వెల్లడించారు.

# వ్యవసాయానికి రూ.265 కోట్లు మంజూరు

### రాష్ట్రానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అమలు చేస్తున్న వ్యవసాయానికి సంబంధించిన ప్రాయోజిత పథకాల నిమిత్తం కేంద్రం నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ. 265.12 కోట్లకు సంబంధించిన నిధులను మంజూరు చేస్తూ కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృష్ణోన్నతి యోజనల కింద తెలంగాణకు రూ. 265.12 కోట్లు, రాజస్థాన్‌కు రూ. 340.59 కోట్ల కేటాయింపును ఆమోదించింది. భోపాల్ నుండి రాజస్థాన్ వ్యవసాయ మంత్రి కిరోరి లాల్ మీనా, తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో చౌహాన్ నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆర్థిక ఆమోదాలు జారీ చేయబడ్డాయి. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి ఆతీష్ చంద్ర, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు, ఇరు రాష్ట్రాల ఉన్నత వ్యవసాయ అధికారులు కూడా పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ప్రాజెక్ట్ ఆమోద కమిటీ సమావేశాలలో ఆమోదించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికలు, తొలి మాత్ర మంజూరు వినియోగం, ఇప్పటివరకు సాధించిన వ్యయ పురోగతిని సమీక్షించిన అనంతరం ఈ ఆమోదాలు జారీ చేయబడ్డాయి. రైతు గుర్తింపు కార్డు, ఎరువుల పంపిణీకి సంబంధించి తెలంగాణ అనుసరించిన కొత్త నమూనాని పనితీరు పట్ల కేంద్ర మంత్రి సంతృప్తి వ్యక్తం చేసింది.

# హద్దు దాటితే ఎంతటి వారిపైనైనా క్రమశిక్షణ చర్యలు

### రాజ్‌గోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందన

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ హద్దు ఉల్లం ఘిస్తే ఎంతటి నేతైనా సహించేది ఉండదని క్రమశిక్షణ చర్యలు ఉంటాయని రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా మాట్లాడటం సబబు కాదనీ ఆయన వ్యాఖ్యలను సీరియస్‌గా పరిగణిస్తామనీ టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ద్వారా హైకమాండ్‌దృష్టికి తీసుకెళ్ళుతామని తెలిపారు. ఎవరైనా సరే పార్టీ లైన్ దాటి మాటా ్డితే సహించేది లేదనీ అన్నారు. రాజగోపాల్ రెడ్డి మంచి మిత్రుడు ఆవేదన అర్థం చేసుకున్నాం కానీ క్రమశిక్షణ విషయంలో కటినంగా ఉంటాం అని అన్నారు. ఎన్నికల సమయంలో మునుగోడు ప్రచారం సందర్భంగా రాజగోపాల్‌రెడ్డికి పార్టీ అదిష్టానం కొన్ని హామిలు ఇచ్చిఉండవచ్చు అయినప్పటికి పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటానికి ఎవరి హక్కులేదు అని అన్నారు. మంత్రివర్గంలో స్థానం లభించ లేదని ఒకవైపు నిధులు కేటాయించడంలేదని అసంతృప్తితో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యా నించవచ్చు కానీ పార్టీ క్రమశిక్షణ కమిటికి పంపే ఆలోచనచేస్తామని అన్నారు. మంత్రివర్గ విస్తరణ పదువుల ఇవ్వడంహైకమాండ్ నిర్ణయం ఒకే రోజు అందరికోరికలు తీర్చడం అసాధ్యం అని అన్నారు. పార్టీ ఫస్ట్ ప్రయారిటీ రాష్ట్రం అప్పుల పాపం కెసిఆర్‌దే అని అన్నారు. కెసిఆర్‌ను పాపం పోచారం అర్థం చేసుకోవాలి. అందరినీ సంతృప్తి పరచాలంటే రాష్ట్ర అప్పు అడ్డు వస్తుంది 2018 నుంచి అనేక బిల్లులు పెండింగ్ లో ఉన్నాయనీతెలిపారు కాంగ్రెస్ వచ్చాకే సిఎం రిలీఫ్ ఫండ్ రిలీజ్ అయ్యాయనీ వివరించారు తమిళనాడు, తెలంగాణ రాజకీయాలు వేరని అభిప్రాయపడ్డారు. సన్న బియ్యం కార్యక్రమం తెలంగాణ లో తప్ప దేశంలో ఎక్కడ లేదని అన్నారు. తప్పుడు కథనాలను నమ్మవద్దని చెప్పారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయం తో ముందుకు వెళతామనీ అన్నారు. ప్రభుత్వ ప్రధాన నిర్ణయాల్లో పార్టీ పాత్ర కూడా ఉంటుందనీ తెలిపారు. భట్టి పై బిఆర్ఎస్ దుష్ప్రచారం చేయిస్తుందనీ సమర్థుల అయిన వారికే పదవులు వస్తాయని చెప్పారు. వచ్చే చైర్మెన్ పదవుల్లో పాతవారికి 60శాతం ఇస్తామని ,కొత్త వారికి 40 శాతం పదవులు ఇస్తామని తెలిపారు.

# పంద్రాగస్టు వేడుకలకు దేశవ్యాప్తంగా భారీభద్రత

### రాష్ట్రంలోనూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా శనివారం నాడు జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల కోసం భారీ భద్రత చేబ ట్టారు. పంద్రాగస్టు వేడుకలకు కొద్ది రోజుల ముందు గత ఏడాది ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడును ఉగ్రదాడిగా ఐక్యరాజ్యసమితి పేర్కొ నడం, ఢిల్లీలో ఉగ్రవాదులు పేలుళ్లకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ఢిల్లీతో పాటు అన్ని రాష్ట్రాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో పంద్రాగస్టు వేడుకల కోసం అన్ని చోట్ల బందోబస్తును ముమ్మరం చేశారు. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల వద్ద తనిఖీలు చేబట్టి, భద్రతను కట్టుదిట్టం చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ప్రముఖుల రాకపోకలకు వాడుతున్న బేగంపే ట్ విమానాశ్రయలో ఇప్పటికే హై అలర్ట్ ప్రకటించి భద్రతను మరింత ముమ్మరం చేశారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకల కోసం పోలీసు యంత్రాంగం భారీ భద్రతను చేబట్టింది. పంద్రాగస్టు వేడుకల సమయంలో హింసాత్మక ఘట నలకు పాల్పడేందకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దశాబ్దాల తరబడి కుట్రలు చేస్తూనే వుండడం తెలిసిందే. కొన్నిసార్లు ఈ విషయంలో ఉగ్రవా దులు కాల్పులు జరిపి, బాంబులు పేల్చి పోలీసులతో పాటు అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉదంతాలు వుండడం విదితమే. అయితే గడచి న కొంత కాలంగా ఉగ్రవాదుల కార్యకలాపాలు తక్కువగానే వున్నా కొన్ని సందర్భాలలో ఉగ్రమూకలు హింసాత్మక ఘటనలకు పాల్పడుతూనే వు న్నాయి. దీంతో పాటు దేశ రాజధాని ఢిల్లీలో దాడులకు ఉగ్రవాదులు చాలా ఏళ్లుగా కుట్రలు పన్నుతున్నారు.

కాగా పంద్రాగస్టు వేడుకలకు ముం దుగా నిఘా వర్గాలు పోలీసులను అప్రమత్తం చేయడంతో ఢిల్లీలో భద్రతను భారీగా పెంచారు. దీంతో పంద్రాగస్టు వేడుకలను కేంద్ర హోం శా ఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుని భద్రత విషయంలో రాజీ పడకుండా వుండాలని అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని చోట్ల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణ వరకు వస్తే రాష్ట్రం ఏర్పాటయ్యాక 13వ సారి జరుగుతున్న ఈ వేడుకలు ధూం ధాంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ సర్కారు ఘనంగా ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో మావోయిస్టులు పూర్తిగా కనుమరుగ య్యాక జరుగుతున్న స్వాతంత్ర వేడుకలు ఇవే కావడం గమనార్హం. అయితే తెలంగాణలో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లోని కొన్ని గ్రామా ల్లో ఇప్పటికీ మావోయిస్టుల కదలికలు వుండడంతో ఇక్కడ గస్తీ పెంచారు. రాష్ట్రంలో గోల్కొండ కోటలో అధికారిక వేడుకలు జరగనుండగా ఇక ్కడ సిఎం రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. దీంతో పాటు హైదరాబాద్ సహా అన్ని జిల్లాలలో జరిగే వేడుకలకు మంత్రు లతో పాటు ప్రముఖులు పాల్గొననున్నారు. మరోవైపు ఉగ్రవాదుల కుట్రల నేపథ్యంలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్ర యం, బేగంపేట్ విమానాశ్రయం వద్ద భద్రతను పెంచారు. పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనే ప్రముఖులకు భద్రతను పెంచారు.

# సౌదీ కోర్టు ఖర్చుల కోసం రూ 40వేల ఆర్థిక సాయం

### పరిహారం కోసం ఎన్నారై వ్యాపారవేత్త శంకర్ మద్దతు

### సిఎం ప్రవాసీ ప్రజావాణిలో చెక్కు అందజేసిన స్టేట్ నోడల్ అధికారి విద్యాసాగర్




ఆర్థిక సహాయం చెక్కును పూజారాణికి అందిస్తున్న స్టేట్ నోడల్ అధికారి విద్యాసాగర్

**హైదరాబాద్(బేగంపేట), ఆగస్టు 14, ప్రభాతవార్త:** సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి పరిహారం అందేలా కోర్టులో కేసు దాఖలు చేసేందుకు అవసరమైన ధృవ పత్రాల అటెస్టేషన్ ,కోర్టు ఖర్చుల కోసం ప్రవాస భారతీయ వ్యాపార వేత్త ఆకునూరి శంకర్ రూ 40వేల ఆర్థిక సహాయం అందించారు.ఈ చెక్కును సీఎం ప్రజావాణీలో శుక్రవారం స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్ పూజారాణికి అందజేసారు.జగిత్యాల జిల్లా అనంతారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుర్రం మహేష్ ఉపాధి కోసం మూడేళ్ల క్రితం సౌదీ అరేబియా కు వెళ్లాడు. సౌదీకి చేరుకున్న 45రోజులకే 6 జులై 2023లో అల్ హసా,హుఫూఫ్ ప్రాంతంలో సైకిల్ పై వెళ్తుండగా కారు ఢీ కొనడంతో మృతి చెందాడు.మృతి అనంతరం ఆయన కుటుంబానికి రావాల్సిన పరిహారం కోసం న్యాయ పరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన సహాయం కోరుతూ ఆయన భార్య పూజా రాణి తన ఇద్దరు కుమార్తెలతో కల్సి శుక్రవారం సీఎం ప్రవాసీ ప్రజావాణికి వచ్చారు.ఆమె పరిస్థితిని తెల్సుకున్న ప్రవాస భారతీయ వ్యాపార వేత్త ఆకునూరి శంకర్ స్పందించి పరిహారం కేసు దాఖలు చేయడానికి అవసరమైన ఖర్చుల కోసం రూ 40వేల చెక్కును పూజారాణికి అందజేసారు.ఈ సందర్భంగా సీఎం ప్రజావాణీ స్టేట్ నోడల్ ఆఫీసర్ కె.విద్యాసాగర్,తెలంగాణా ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ అంబాసిడర్ డా.బి.ఎం.వినోద్ కుమార్,వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు,సచివాలయం ఎన్ఆర్ఐ విభాగం అధికారి చిట్టిబాబు,సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి,వాలంటీర్ కర్రి పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

**ఇంం ప్రజావాణిలో అందిర దరఖాస్తులు 135**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 247వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 135దరఖాస్తులు అందాయి.వాటిలో రెవెన్యూ శాఖకు 30దరఖాస్తులు,బీసీ సంక్షేమ శాఖకు 22,సాధారణ పరి పాలన శాఖకు 15,ప్రవాసీ ప్రజావాణికి 03,ఇతర శాఖలకు 65దరఖాస్తులు అందాయి. ప్రజావాణీ ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యా సాగర్, దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేం దర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు,ఎన్ఆర్ఐ సలహా మండలి ఛైర్మన్ బీ.ఎం. వినోద్‌కుమార్,వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు,సమన్వయ కర్త బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగోసారి ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

### 31 వరకు అవకాశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్

### ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 88 వేల మంది చేరిక

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరడానికి గడువును నాలుగోసారి పొడిగించారు.

ఈ నెల 15 వరకు ఉన్న అడ్మిషన్ల గడువును కాస్త ఈ నెల 31 వరకు పొడిగిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కాలేజీల్లో జనరల్, వొకేషనల్ విభాగాలలో రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సును అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, కోపరేటీవ్, టి.జి. రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్, బి.సి. సంక్షేమ రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, కె.జి.బి.వి, టి.జి. మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు, కాంపోజిట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్లకు ఈ నెల 31 వరకు అవకాశం కల్పించాలని ఇంటర్ బోర్డు సెక్రటరీ ప్రకటించారు. మొదటి విడతలో భాగంగా మే 8 నుంచి 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు.

తరగతులను జూన్ 1 నుంచి ప్రారంభించారు. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30తో ముగించారు. జులై 1 నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను 31 వరకు పొడిగించారు. మూడోసారి అడ్మిషన్ల గడువును ఈ నెల 15 వరకు పొడిగించారు.

ఇపుడు నాలుగోసారి అడ్మిషన్ల గడువును 31 వరకు పొడిగిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. అడ్మిషన్ల సందర్భంగా ప్రిన్సిపాల్‌లు ఇంటర్నెట్ మార్క్స్ మెమోల ఆధారంగా తాత్కాలిక ప్రవేశాలు కల్పించడానికి అనుమతి ఇచ్చారు. రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇప్పటి వరకు సుమారు 88 వేల మంది చేరినట్టు తెలిసింది.

# కాంగ్రెస్‌లోనే ఉంటా.. తెలంగాణ ఆత్మగౌరవమే ముఖ్యం

### పేదల కోసమే ప్రజాపాలన.. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కోసం కాదు: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**చౌటుప్పల్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** తన రాజకీయ వైఖరిపై నెలకొన్న సందేహాలకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెరదించారు. తాను రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించు కున్నామని, తెలంగాణ ఇచ్చింది.. తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చౌటుప్పల్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు స్పష్టత ఇచ్చారు. తాను ఎక్కడా కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించలేదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పార్టీలోకి బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే చెప్పానన్నారు.

తెలంగాణ కోసం ఉద్యమించిన, పార్టీ కోసం పనిచేసిన నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని మాత్రమే గుర్తు చేశానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడం వెనుక ప్రజల ఆత్మగౌరవ పోరాటం ఉందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆ పోరాట స్ఫూర్తికి భిన్నంగా రాష్ట్ర పాలన సాగకూడదని పేర్కొన్నారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం నడవకూడదని అన్నారు. తెలంగాణకు సంబంధించిన నిర్ణయాలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ఉండాలని సూచించారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పనిచేయడమేనని ఆయన అన్నారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, ఇతరుల ప్రయోజనాల కోసం కాకుండా సామాన్య ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, తెలంగాణను సాధించడంలోనూ కాంగ్రెస్ పాత్ర ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే సరైన వేదికగా అభివర్ణించారు. తనపై వస్తున్న రాజకీయ ఊహాగానాలకు తెరదించుతూ రాహుల్‌గాంధీ నాయకత్వంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ తెలంగాణ ప్రయోజనాల కోసం, ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్

### విజిటర్ పాసులు రద్దు

**శంషాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైఅలర్ట్ ప్రకటించారు. సందర్శకుల ప్రవేశంపై ఆంక్షలు విధించడంతో పాటు అన్ని రకాల విజిటర్ పాసులను రద్దు చేశారు. సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి ఆగస్టు 20 వరకు హైఅలర్ట్ కొనసాగించనున్నారు.




అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని మహిళల ధర్నా

**హైదరాబాద్(సైఫాబాద్), ఆగస్టు 14, ప్రభాతవార్త:** పేద, మధ్యతరగతి అమ్మాయిలకు కొంత ఉపయోగకరంగా ఉన్న కల్యాణలక్ష్మి, షాదిముబారాక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆనేక మంది బిఆర్ఎస్ మహిళలు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్బంగా మహిళా నేతలు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కావాలనే కల్యాణలక్ష్మి, షాదిముబారక్ ఎత్తి వేయడానికి కోర్టులో ఫిటిషన్ వేయించారని, ఆడపిల్లల పెళ్ళికి తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సిఎం మాట తప్పారని ఆరోపించారు. సిఎం అసమర్థత, చేతగాని తనం వల్ల సంక్షేమ పథకాలను నిలిచిపోతున్నాయని, కెసిఆర్ తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# కుల గణనపై హామీని విస్మరించిన కేంద్రం

### తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** జనాభా లెక్కింపులో కుల గణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించిందని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ విమర్శించారు. రెండో విడత జనాభా గణనలో బీసీ కులాల వివరాలను సేకరిస్తామని గతంలో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం విస్మరించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. జనాభా గణనలో సేకరించదలచిన అంశాలను ప్రస్తావిస్తూ శుక్రవారం కేంద్ర హోం శాఖ విడుదల చేసిన గెజిట్‌లో బీసీ కులాల ప్రస్తావనను విస్మరించడం విస్మయానికి గురిచేసిందన్నారు. ఇదే విషయమై కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒక స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై తెలంగాణ బీసీ కమిషన్ తరపున రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాతోపాటు సెన్సస్ కమిషనర్‌కు లేఖ రాయనున్నట్టు తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ ప్రకటనలో స్పష్టం చేశారు.

# బొమ్మరాసిపేట్ భూములపై ప్రభుత్వం విచారణ జరపాలి

### బాధిత రైతులకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్, బిజెపిలు

### రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

### బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఆగస్టు 14, ప్రభాతవార్త:** బొమ్మరాసిపేట్ గ్రామ బాధిత రైతులకు అండగా ఉంటా మని, న్యాయం జరిగే వరకు పోరా టాలు చేస్తామని బిఆర్ఎస్, బిజెపి పార్టీల నేతలు వేరువేరుగా ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక రైతులపై దాడులు,దౌర్జన్యాలు పెరిగి నట్లు బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డిలు ఆరోపించారు. నోటీసుల పేరుతో రైతులను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తు న్నారని, బొమ్మరాసిపేట్ భూముల విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. బ్రోకర్ల డబ్బులతో ఆశపడి లంచాలకు పాల్పడే అధికారులకు శిక్షలు తప్పవని, చట్టాన్ని దిక్కరించే వారు తప్పిం చుకోలేరని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల భూములపై కన్నేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సహించేది లేదని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బొమ్మరాసిపేట్ గ్రామ బాధిత రైతులు నిరసన ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులు– భూ మాఫియా కుమ్మక్కు రికార్డుల తారుమారు బొమ్మ రాసిపేట్ రైతుల నిరసన కార్యక్రమాన్ని వినూత్నంగా ధర్నా నిర్వహించారు. గ్రామ రైతుసంఘం నాయకులు రవికిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కొంత సేపు శామీర్‌పేట రాజీవ్‌రహదారిన రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ సూచనల మేరకు బిఆర్ఎస్ బృందంగా విచ్చేసి బొమ్మరాసిపేట్ గ్రామ రైతులకు మద్దతు తెలిపి అండగా ఉండటానికి రావటం జరిగిందని, రైతులకు న్యాయం చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భూభారతి రికార్డులు రైతులకు తెలియకుండానే మారిపోతు న్నాయని ఆయన విమర్శించారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లా డుతూ బొమ్మరాసిపేట్‌లో 60 యేళ్ల నుంచి పట్టాలు ఉండి కబ్జాలో ఉంటే వారికి తెలియకుండానే భూముల రికార్డులు మార్చటం, నోటీసుల పేరుతో రైతులను బెదిరింపులకు పాల్పడటం జరుగుతుందని బిఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు రైతులకు మద్దతు ఉంటుందని, ఈ భూములపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ బొమ్మరాసిపేట్‌లో వెయ్యి నలభైతొమ్మిది ఎకరాలు (1049) భూమిలో పట్టాదారు లుగా, కబ్జాలో ఉంటూ పంటలు పండించుకుంటే బ్రోకర్లకు అధికారులు అండగా ఉండి రికార్డులు మార్చటం దారుణమని, చట్టాన్ని ధిక్కరిస్తే అధికారులకు శిక్షలు తప్పవని ఎంపి ఈటల రాజేందర్ హెచ్చరించారు.




శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన రైతుల నిరసన ధర్నాలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి తదితరులు

## ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు అని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారు కలలుగన్న స్వేచ్ఛాయుత, సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలంతా ఐక్యత, సౌభ్రాతృత్వం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను మరింత బలోపేతం చేసేందుకు సంకల్పించాలని ఆయన కోరారు.

## ప్రజలకు కేసీఆర్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు14:** రాష్ట్ర ప్రజలకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పరాయి పాలనను పారదోలి, 1947 ఆగస్టు 15న భారతదేశం స్వయంపాలనను సాధించుకుందని పేర్కొన్నారు. నిస్వార్థ పోరాట స్ఫూర్తి, దార్శనిక నాయకత్వం, త్యాగంతో కూడిన ప్రజల భాగస్వామ్యమే దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిందని తెలిపారు. 79 వసంతాలు పూర్తి చేసుకుని 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ శుభసందర్భంలో, దేశ సామాజిక న్యాయం, ఆర్థిక ప్రగతిని ప్రతి ఒక్కరూ పునస్మరణ చేసుకోవాలని కేసీఆర్ అన్నారు. ఫెడరల్ పాలనా విధానం, సెక్యులర్ స్ఫూర్తితో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం మరింత ముందుకు సాగేందుకు ఇంకా చేరుకోవాల్సిన లక్ష్యాలను గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశ పాలనలో భాగస్వామ్యం కానున్న నేటితరం మరింత జ్ఞానం, సహనం, దార్శనికతతో ముందడుగు వేసినప్పుడే స్వాతంత్ర్యోద్యమ త్యాగాల ఫలాలు ప్రతి గడపకు చేరుతాయని కేసీఆర్ స్పష్టం చేశారు.

# చదువుతోనే తలరాతలు మారుతాయి

### యేటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ముందే జమ చేస్తాం

### విద్యతోపాటు సాంకేతిక నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం

### పూలే, సావిత్రిబాయి దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు14:** చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నెక్లెస్ రోడ్‌లోని హెచ్ఎండిఎ గ్రౌండ్స్‌లో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి దంపతుల విగ్రహాలను శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డి అవిష్కరించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విగ్రహాల ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహా రావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు.

ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ ఇస్తున్నామని చెప్పారు.

విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు.

సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీనవర్గాల లెక్కలు తేల్చింది మనదే తొలి రాష్ట్రం, చివరి రాష్ట్రం అని తెలిపారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు. చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం అని సీఎం అన్నారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. 'మంచి అవకాశం మళ్లీ రాదు.. మీరు కోరుకున్న ప్రభుత్వం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించండి'.. మీ ఉజ్వల భవిష్యత్తుకు పని చేసే అవకాశం లభించింది. మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. చదువులు, క్రీడలు, పరిపాలనలో రాణించండి. పారదర్శక ప్రభుత్వాన్ని నడిపేందుకు సహకరించాలి అని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మ మార్పు తీసుకువచ్చాం. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నాం అని సిఎం పేర్కొన్నారు.



ఈ ఏడాది నుంచి అడ్వాన్స్‌గా బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నాం. ఏటా రూ.2400 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు ముందే జమ చేస్తున్నాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెలలో ఫీజు పడుతుంది. సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికే ప్రపంచం ఎర్రతివాచితో స్వాగతం పలుకుతుంది. నైపుణ్యం ఉన్నవారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయి. ఐటి నిపుణులు కూడా ఉద్యోగాలు పోయి వెనక్కి వచ్చే పరిస్థితి వచ్చింది. సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలి. విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యం నేర్పిస్తున్నాం. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు ఇస్తాం అని సిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హాజరైన పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, అజరుద్దీన్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారులు వి హనుమంత రావు, కె కేశవ రావు. ఎంపీ లు అనిల్ కుమార్ యాదవ్, ఆర్ కృష్ణయ్య, సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు బీసీ సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సాగులో రియల్ టైమ్

### రైతులకు కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్

### కొత్త చొరవను ప్రారంభించిన క్రాప్ రీసెర్చ్ సంస్థ

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి రానుంది. వాతావరణ వైవిధ్యానికి అనుగుణంగా, జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమీ-అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రీశాట్) రైతులకు రియల్‌టైమ్, వ్యక్తిగతీకరించిన వాతావరణ సలహా సేవలను అందించడానికి కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)), మెషిన్ లెర్నింగ్ (ఎమ్ఎల్) లను ఉపయోగించుకునే కొత్త చొరవను ప్రారంభించింది. కృత్రిమ మేధస్సు ఆధారిత ఈ ప్రాజెక్ట్, చిన్న రైతులను హైపర్ లోకల్, కార్యాచరణ వాతావరణం మరియు వాతావరణ అంతర్‌రాష్ట్రాల కృషితో సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుని ప్రారంభించింది. ఈ చొరవకు కేంద్ర ప్రభుత్వ మాన్సూన్ మిషన్-3 కింద మద్దతు ఇస్తోంది. రుతుపవనాల సమయంలో అభివృద్ధి చేయబడిన ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అడ్వైజరీ టూల్, పైలట్ చేయబడిన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా అందుబాటులోకి తీసుకొస్తోంది. సంక్లిష్ట వాతావరణం, వ్యవసాయ డేటాను వ్యక్తిగతీకరించిన, సైన్స్ ఆధారిత సలహాగా సరళీకరించడానికి ఇంటిలిజెంట్ సిస్టమ్స్ ఆధారిత వ్యవస్థగా అప్‌గ్రేడ్ చేయబడుతోంది.

## జోరందుకున్న ఖరీఫ్ సాగు

### అన్ని పంటలూ కలిపి 81 శాతంతో 1.07 కోట్ల ఎకరాలకు చేరిక

### అత్యధికంగా 9 లక్షల ఎకరాలతో నల్లగొండ టాప్

### అత్యల్పంగా 12,699 ఎకరాలతో మల్కాజిగిరి లాస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఖరీఫ్ సాగు జోరందుకుంది. అన్ని పంటలూ కలిపి ఇప్పటి వరకూ 1,07,17,314 ఎకరాల్లో సాగయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలకు గాను 81 శాతం మేర సాగైంది. అయితే గత ఏడాది ఇదే సమయానికి సాగైన పంటల కంటే దాదాపు 1.32 లక్షల ఎకరాలు తక్కువ. అన్ని పంటల్లో కెల్లా అత్యధికంగా 101 శాతంతో 47,71,698 ఎకరాలతో పత్తి సాగు అగ్రస్థానంలో ఉంది. ఇక ఈ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానంగా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కేవలం వారం రోజుల్లోనే 10 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయడం విశేషం.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి సమర్పించిన వారాంతపు నివేదికలోని గణాంకాల ప్రకారం వరి, కంది, జొన్న, మినుము తదితర ఆహార ధాన్యాలు 53,49,253 ఎకరాల్లో సాగు చేయగా, ఇందులో వరి 63 శాతం చొప్పున 41,54,006 ఎకరాల్లో నాట్లు వేశారు. అలాగే మొక్కజొన్న 5,30,910 ఎకరాల్లో, కంది 5,04,174 ఎకరాల్లో, పెసర 96,394 ఎకరాల్లో, మినుము 35,011 ఎకరాల్లో సాగయ్యాయి.

ఇక సోయాబీన్ 3,71,990 ఎకరాల్లో, చెరకు 38,189 ఎకరాల్లో వేశారు. అలాగే రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 9,00,468 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అత్యల్పంగా మల్కాజిగిరి జిల్లాలో 12,699 ఎకరాలకే ఖరీఫ్ సాగు పరిమితమైంది.

## విశ్రాంత ఉద్యోగులే సైబర్ బాధితులు.. అప్రమత్తంగా ఉండాలి

### తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశంలోనే నంబర్ వన్: డిజిపి ఆనంద్



**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారిపోతోందని, ముఖ్యంగా సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కు తోందని, ఈ క్రమంలో అందరు అప్రమత్తంగా వుండాలని డిజిపి సి.వి ఆనంద్ అన్నారు. సైబర్ నేరాల నివారణ, నేరగాళ్ల పట్టివేత, బాధితు లు పోగొట్టుకున్న సొమ్ము రికవరీ విషయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) దేశంలోనే నంబర్ వన్‌గా వుందని ఆయన తెలిపారు. కమాండ్ కంట్రోల్‌లో శుక్రవారం టిజిసిఎస్‌బి ఆధ్వర్యంలో జరిగిన సురక్ష తిరంగా సైబర్ అవగాహన కార్యక్రమంలో డిజిపి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాల విషయంలో అన్ని వర్గాల వారు జాగ్రత్తగా ఉండడమే సరైన మార్గమని కోరారు. ఏమాత్రం ఏమరపాటుగా వున్నా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఖాతాలు ఖాళీ అవుతాయని ఆయన హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు విశ్రాంత ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నారని, చాలా సందర్భాలలో బాధితులు ఎవరు ఏమనుకుంటారోనని ఫిర్యాదు కూడా చేయడం లేదని బయటకు చెప్పుకోవడం లేదని ఆయన తెలిపారు. ఈ క్రమంలో విశ్రాంత ఉద్యోగులు మరింత జాగ్రత్తగా వుండాలని ఆయన కోరారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా నేరస్తులు ఎప్పటికప్పు డు అప్‌డేట్ అవుతూ కొత్త తరహా నేరాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. జాతీయ పతాకం స్ఫూర్తితో రూపొందించిన తిరంగ సైబర్ అవగాహన కార్యక్రమం ఒక మంచి ఉద్దేశంతో కూడుకున్నదని ఆయన అభినందించారు. సైబర్ నేరగాళ్లు ఎంతగా బరితెగిస్తున్నా తెలంగాణ వరకు వస్తే ఈ నేరాలు తక్కువగానే వున్నాయని, పెద్ద సంఖ్యలో నేరగాళ్లను పట్టుకుంటున్నామని, నేరగాళ్లు దోచుకున్న సొత్తులో భారీగా రికవరీ చేస్తున్నామని డిజిపి తెలిపారు. ఇందుకు టిజిసిఎస్‌బితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వున్న సైబర్ పోలీసు స్టేషన్ల సిబ్బందిని ఆయన అభినందించారు. టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలు 24 శాతం పెరగగా తెలంగాణలో మూడు శాతం తక్కువగా వుందని, ఇందుకు పోలీసుల సమిష్టి కృషి వుందని తెలిపారు. ఇతర విభాగాల్లోనూ ఈ పురోగతి వుండడం వల్లే ప్రధాన మంత్రి కార్యాలయం సమీక్షలో రాష్ట్రంలో సైబర్ నేరాల తగ్గుదలకు గానూ పోలీసు శాఖకు మొదటి స్థానం దక్కింద ని ఆమె తెలిపారు. సినీ నటుడు అక్కినేని నాగార్జున మాట్లాడుతూ తాను కూడా సైబర్ బాధితుడినని, తన కుటుంబ సభ్యులూ బాధితులని ఆయన తెలిపారు. ఈ క్రమంలో తాను ఫోన్ పాస్‌వర్డ్‌ను వారానికి ఒకసారి మారుస్తానని ఆయన అన్నారు. సైబర్ నేరాలకు విరుగుడు అప్రమత్తతేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ పోలీసు కమిషనర్ సజ్జన్నార్, అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) ఎం.శ్రీనివాస్‌తో పాటు పెద్దసంఖ్యలో విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీ విద్యార్థినులకు బస్సు సౌకర్యాలు

### హామీ ఇచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ విద్యార్థినులకు మెరుగైన బస్సు సౌకర్యాలు కల్పించడంతో పాటు, మౌలిక వసతులను కల్పించడానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం తెలిపారు. వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినుల ప్రయోజనార్థం మెరుగైన ప్రజా రవాణా, మౌలిక వసతుల కల్పనకు హామీ ఇచ్చారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ హాస్టల్‌లో నివసిస్తున్న సుమారు 700 మంది పీజీ విద్యార్థినులు, కోఠిలోని యూనివర్సిటీ క్యాంపస్‌కు రాకపోకలు సాగించే సమయంలో ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను మంత్రికి తెలిపినట్టు చెపాపరు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పీక్ అవర్స్‌లో ఆర్‌టీసీ బస్సుల ఫ్రీక్వెన్సీని పెంచేందుకు హామీ ఇచ్చారన్నారు.

## సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు మరింత మెరుగైన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేసి, రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకతను మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సంగారెడ్డిలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి వచ్చే

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు**

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదిక, భద్రత, పార్కింగ్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన కుటుంబాలకు రేషన్ వ్యవస్థలో మరింత సౌలభ్యం కలగడంతో పాటు, లబ్ధిదారుల వివరాల నిర్వహణ, సరుకుల పంపిణీ ప్రక్రియ మరింత సమర్థవంతంగా మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను ఆధునికీకరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డిలో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంపై జిల్లాలోని ప్రజల్లో ఆసక్తి నెలకొంది. కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికే జన సమీకరణకు ముమ్మర ఏర్పాటు చేస్తున్నారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తమ వంతు పూర్తి కృషి చేస్తున్నారు



## భార్యాభర్తల హత్య కేసులో ఇద్దరు అరెస్ట్

### కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

### సిసిటివి, సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు

**సూర్యాపేట/మోతే, ఆగస్టు 14, ప్రభాతవార్త:** మోతే పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల జంట హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, స్థానికుల సమాచారంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మోతే మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారి పక్కన వ్యవసాయ భూమిలో మృతదేహాలను పాక్షికంగా పాతిపెట్టినట్లు గురువారం ఉదయం స్థానికుల నుంచి పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కోదాడ డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై లచ్చిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. మృతులను మోతే మండలం బిక్యతండాకు చెందిన హలావత్ నాగులు, ఆయన భార్య హలావత్ బూబాగా గుర్తించారు. ఘటనపై ఎస్పీ నరసింహ స్వయంగా ఘటనా స్థలాన్ని పరిశీలించి, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా రెండో నిందితుడు జిల్లేపల్లి సుందర్ మృతదేహాలను తరలిస్తున్నట్లు అనుమానాస్పదంగా కనిపించాడు. దీనికి సంబంధించిన సాంకేతిక ఆధారాలను సేకరించి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద మొదటి నిందితుడు ఎం.డి. షరీఫ్, రెండో నిందితుడు జిల్లేపల్లి సుందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మోతేకు చెందిన సుందర్‌కు మోతే పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షరీఫ్‌తో పరిచయం ఉంది. సుందర్ ద్వారా నాగులు, బూబాలకు షరీఫ్ పరిచయ మయ్యాడు. కుటుంబ అవసరాల కోసం బూబా, నాగులు కోరడంతో షరీఫ్ వారికి సుమారు రూ.3 లక్షలు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని కోరిన సమయంలో ఇరువురి మధ్య వివాదం ఏర్పడింది. తనను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇరికిస్తామని వారు బెదిరించడంతో వారిని హత్య చేయాలని షరీఫ్ నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ నెల 11వ తేదీ రాత్రి నాగులును ద్విచక్రవాహనంపై మోతే గ్రామ శివారులోని జాతీయ రహదారి 365బీబీ ఫ్లైఓవర్‌కు సుమారు 200 మీటర్ల దూరంలోని వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ గుంత తవ్వే సమయంలో వెనుక నుంచి గుద్దబండతో తలపై బలంగా కొట్టి నాగులును హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బూబాను కూడా అదే ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసి, ఇద్దరి మృతదేహాలను గుంతలో పాతిపెట్టినట్లు విచారణలో వెల్లడైంది. బూబా ఒంటిపై ఉన్న ఆభరణాలను కూడా నిందితులు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడు ఎం.డి. షరీఫ్ (23), మోతే పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, రెండో నిందితుడు జిల్లేపల్లి సుందర్ మోతే గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కేసును వేగంగా ఛేదించిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, ఎస్సై లచ్చిరెడ్డి, సీసీఎస్ ఎస్సైలు సాయిరాం, హరికృష్ణతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.


# భారత ప్రగతిని చూసి బాధపడుతోన్న ప్రతిపక్ష నేతలు

### ప్రతి ఇంటిపై భారతీయుడు సగౌరవంగా జాతీయ జెండాను ఎగురవేయాలి: కిషన్‌రెడ్డి

### జాతీయ జెండా ఆత్మగౌరవ ప్రతీక త్యాగానికి ప్రతీక: బండి సంజయ్

### ఐక్యత, దేశ సమగ్రత కోసం మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి: రాంచందర్‌రావు

### ట్యాంక్‌బండ్‌పై జాతీయ జెండాను చేతబట్టి ఘనంగా బిజెపి శ్రేణుల హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు14:** ప్రతి ఇంటిపై ప్రతి భారతీయుడు సగౌరవంగా జాతీయ జెండాను ఎగురవేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడు చేతిలో జాతీయ జెండాను పట్టుకుని తిరంగా యాత్రలో పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ఐదేళ్లుగా హర్ ఘర్ తిరంగాలో భాగంగా దేశవ్యాప్తంగా కోట్లాది ఇళ్లపై మన జాతీయ జెండా రెపరెపలాడుతోందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం లిబర్టీ వద్ద బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రకు వేలాది మంది తరలివచ్చారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండా కోసం ప్రాణత్యాగం చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం అఖిల భారత విద్యార్థి పరిషత్ కార్యకర్త సామ జగన్ మోహన్ రెడ్డి త్యాగాన్ని స్మరించుకోవాలని గుర్తు చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో నక్సలైట్లు జాతీయ జెండాను దహనం చేసినప్పుడు, నక్సలైట్లు చేసిన దుర్మార్గాన్ని వ్యతిరేకించినందుకు ఆయనను కాల్చిచంపారని పేర్కొన్నారు. ఈరోజు విదేశీ శక్తులు మాత్రమే కాదు, మన దేశంలోనే కొందరు దేశానికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారు.

దేశంలో జాతీయ రహదారులు పెరుగుతున్నా, విమానాశ్రయాల సంఖ్య పెరుగుతున్నా, దేశ అభివృద్ధి వేగంగా జరుగుతున్నా.. వాటిని చూసి సంతోషించాల్సిన జాతీయ ప్రతిపక్ష నాయకులు బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి, ఉగ్రవాదాన్ని అరికట్టే చర్యలు తీసుకుంటుంటే, ప్రతిపక్ష నాయకుడికి కంటగింపుగా మారిందన్నారు. భారతదేశం అభివృద్ధి చెందుతుంటే పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు ఏ విధంగా అసూయతో, ఆందోళనతో చూస్తున్నాయో.. అదే విధంగా మన దేశంలోని కొన్ని ప్రతిపక్ష శక్తులు కూడా భారత ప్రగతిని చూసి బాధపడుతున్నాయన్నారు. పార్లమెంటుపై దాడులు జరగాలని, సుప్రీంకోర్టుపై దాడులు జరగాలని, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ వంటి దేశాల్లో జరిగిన పరిణామాల తరహాలో భారతదేశంలో కూడా పరిస్థితులు ఏర్పడాలని కొందరు దుర్మార్గులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్ గెలవాలని, భారత్ ఓడిపోవాలని కోరుకున్నట్లు కొన్ని రాజకీయ పార్టీలు, 'తుక్డే తుక్డే గ్యాంగులు' వ్యవహరించిన తీరును దేశ ప్రజలు గమనించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడుకోవాలి. ఇటీవల పార్లమెంటులో వందే మాతరం గీతాన్ని జాతీయ గీతంగా ప్రవేశపెట్టామని, అయితే తెలంగాణలోని మజ్లిస్ పార్టీ నాయకులు వందేమాతరం గీతానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేను సవాల్ విసురుతున్నాను. మీకు దమ్ము, ధైర్యం ఉంటే, పార్లమెంటులో చేసిన చట్టంపై మీకు విశ్వాసం ఉంటే.. వందేమాతరం గీతాన్ని వ్యతిరేకిస్తున్న మజ్లిస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వారు దారుస్సలాంలో ఉండకూడదు, చర్లపల్లి జైలుకు తరలించేలా చర్యలు తీసుకునే ధైర్యం మీకు ఉందా? ప్రశ్నించారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి ప్రవేశం కల్పించాలనే విషయంలో బేధాభిప్రాయం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మంత్రివర్గంలో జెన్ జీలకు అవకాశం కల్పించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. జాతీయ జెండా అంటే భారతీయుల ఆత్మ గౌరవ ప్రతీక. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగానికి ప్రతీక. సైనికుల ధైర్యానికి, రైతుల స్వేదానికి, జెన్ జీ కలల ప్రతీక. దేశ స్వాతంత్రం కోసం ఎన్ని లక్షల మంది బలిదానాలు చేశారో, ఎన్ని పోరాటాలు, త్యాగాలు చేశారో నేటి జెన్‌జీ తరం తెలుసు కోవాల్సిన అవసరసం ఉందన్నారు. దేశ అంతర్గత భద్రతతోపాటు రోడ్లు, రైల్వే, విమానయాన రంగాలను ఊహించని రీతిలో అభివృద్ధి చేశారని చెప్పారు.

రాంచందర్‌రావు మాట్లాడుతూ ఇంత పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, కార్యకర్తలు, ప్రజలు ఈ తిరంగా యాత్రలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ముందుగా బషీర్‌బాగ్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్‌తోపాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో ట్యాంక్ బండ్‌కు చేరుకుని తిరంగా యాత్రలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు జాతీయ జెండాలతో యాత్ర కొనసాగింది.

## గోల్డెన్ ట్రయంగిల్ నగరాల సరసన

# ఘోస్ట్ సిటీ, వియోంటిన్

**• పోలీసుల దాడుల్లో పదుల సంఖ్యలో కాల్ సెంటర్లు**

**వందల సంఖ్యలో నేరగాళ్లు, రూ.కోట్ల నగదు పట్టివేత**

హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త: సైబర్ నేరాలకు కేరాఫ్‌గా ఇంతకాలం గోల్డెన్ ట్రయాంగిల్‌గా పేరొందిన మయన్మార్, కాంబోడియా, వి యత్నాంలోని నాలుగైదు ప్రాంతాలే వుండేవి. ఇప్పుడు వీటి సరసన మలేషియాలోని ఘోస్ట్ సిటీతో పాటు లావోస్ రాజధాని వియోంటిన్ నగ రాలు కూడా చేరాయి. ఇందులో మలేషియాలో సముద్ర తీరంలో చైనా నిర్మించిన విలాసవంతమైన విల్లాలున్న ఫారెస్ట్ సిటీ (దీనిని ఘోస్ట్ సి టీగా కూడా పిలుస్తారు), ఇప్పుడు సైబర్ నేరాలకు అడ్డాలుగా మారాయి. దీనిపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘోస్ట్ సిటీలోని సైబర్ అడ్డాలపై దాడులు చేయగా పదుల సంఖ్యలో కాల్ సెంటర్ల గోల్‌మాల్ రట్టవడంతో పాటు వందల సంఖ్యలో నేరగాళ్లు పట్టుబడ్డారు. ఇ దే సమయంలో వియోంటిన్ నగరంలోనూ ఈ తరహా గోల్‌మాల్ కార్యకలాపాలు వెలుగు చూశాయి. దీంతో ఈ రెండు నగరాలు సైబర్ నేరాల కు అడ్డాలుగా మారాయని తేటతెల్లమయ్యింది. మొదటగా మలేషియాలోని ఘోస్ట్ సిటీ గురించి పరిశీలిస్తే ఈ నగరాన్ని 2016లో చైనాకు చెందిన కంపెనీలు భారీ అంచనాలతో వంద బిలి యన్ డాలర్ల వ్యయంతో నిర్మించాయి. ఫారెస్ట్ పేరిట వీటిని నిర్మించారు. సముద్ర తీరంలో అహ్లాదకర వాతావరణంలో వుండేలా విలాసవంత మైన సౌకర్యాలు వుండేలా వీటిని తీర్చిదిద్దారు. ఈ టవర్లకు భారీగా డిమాండ్ వుంటుందని భావించినా కరోనా రావడం, చైనాలో స్థిరాస్తి రంగ ం ఒడిదుడుకులకు లోనవడం, పర్యావరణ అనుమతులు ఆలస్యం కావడంతో డిమాండ్ తగ్గింది. దీంతో ఈ టవర్ల నిర్మానం ఆలస్యం కావడం తో మూడు లక్షల మంది నివాసం వుండేందుకు నిర్మించిన ఈ టవర్లు కేవలం పది వేల మంది మాత్రమే వుండే స్థాయికి పడిపోయింది. దీంతో చాలా అపార్ట్‌మెంట్లు ఖాళీగా వున్నాయి. దీంతో పాటు ఈ టవర్లు ఇదివరకు వున్న నగరానికి దూరంగా వుండడం కూడా జనాలు రాకపోవడానికి మరో కారణమయ్యింది. దీంతో ఫారెస్ట్ సిటీలో క్రమంగా అసాంఘీక శక్తులు రాజ్యమేలసాగాయి. సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిపోయింది. ఇక ఇక్కడ వున్న అనేక అపార్ట్‌మెంట్లలో సైబర్ నేరాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మలేషియా పోలీసులు ఇటీవల 32 చోట్ల ఆకస్మికం గా దాడులు నిర్వహించారు. ఇందులో 27 అపార్ట్‌మెంట్లలో గోల్‌మాల్ కాల్ సెంటర్లు కొనసాగుతుండగా వాటిపై దాడిచేసి అక్కడి వస్తువులను పోలీసులు జప్తు చేశారు. క్రిప్టో కరెన్సీ, పెట్టుబడి పథకాలతో పాటు ప్రేమ పేరు, మ్యాట్రిమోనియల్ వంటి అనేక రకాల మోసకారి వ్యవహారా లు ఇక్కడి నుంచి నడుస్తున్నట్లు తేలింది. ఈ దాడుల్లో 335 మంది నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేయగా 15 కోట్ల రూపాయలకు పైగా వివి ద దేశాల కరెన్సీ, 300పైగా కంప్యూటర్లు. 1500 పైగా సెల్‌ఫోన్లు, పెద్ద సంఖ్యలో ఎలక్ట్రానిక్ వస్తువులను జప్తు చేశారు. అరెస్టయిన వారిలో 90 శాతం మంది చైనీయులే కావడం గమనార్హం. విదేశాల్లో వుండే అమాయకులను టార్గెట్ చేస్తూ ఇక్కడి సైబర్ నేరగాళ్లు దోపిడి చేస్తున్నట్లు తేలింది. ఇక్కడ అరెస్టయిన వారిలో అనేక మంది ఇంతకు ముందు గోల్డెన్ ట్రయాంగిల్‌లోని సైబర్ అడ్డాలలో పట్టుబడ్డ వారుగా తేలింది. వీర ంతా అంతర్జాతీయ స్కాంలలో నిందితులుగా వున్నవారు కావడం గమనార్హం. దీంతో పాటు వియోంటిన్ నగరంలోనూ ఈ తరహా గోల్‌మాల్ కార్యకలాపాలు వెలుగు చూడడం గమనార్హం.

## లక్షడాలర్ల వీసా ఫీజులపై కాంగ్రెస్‌ప్రతినిధి ధ్వజం

**వాషింగ్టన్, ఆగస్టు 14:** అమెరికాలో హెచ్1బీ వీసాలపై కొత్తగా 1,00,000 డాలర్లు అంటే సుమారు రూ.95 లక్షలు భారీ ఫీజు విధించాలనే ప్రతిపాదనపై భారత సంతతికి చెందిన కాంగ్రెస్ ప్రతినిధి రాజా కృష్ణమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే అమెరికా కంపెనీలు తమ పనులను విదేశాలకు తరలిస్తా యని (ఆఫ్‌షోరింగ్), తద్వారా దేశం నైపుణ్యం కలిగిన నిపుణులను ఆకర్షించే సామర్థ్యాన్ని కోల్పో తుందని హెచ్చరించారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ వేదికపై దాని పోటీతత్వానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. స్పిల్ ది టీ అనే ఇంటర్వ్యూ సిరీస్‌లో మాట్లాడిన రాజా కృష్ణమూర్తి మీరు ప్రతిభా వంతులను దేశంలోకి తీసుకురావచ్చు లేదా పనిని విదేశాలకు తరలించవచ్చని స్పష్టం చేశారు. ఈ భారీ ఫీజుల కారణంగా అమెరికా కంపెనీలు చేతులు ముడుచుకుని కూర్చోవని, పనులను పూర్తి చేయడానికి విదేశీ మార్గాలను అన్వేషిస్తా యని ఇల్లినాయిస్ డెమోక్రాట్ అయిన కృష్ణమూర్తి పేర్కొన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో జారీ అయిన మొత్తం హెచ్1బీ వీసాలలో 71 శాతం భారతీయులే పొందారని, ఈ నేపథ్యంలో కొత్త ఫీజు విధానం భారతీయులపై, అమెరికా పోటీతత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. ఈ ఫీజును ఆయన నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై వేస్తున్న పన్నుగా అభివర్ణించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన సాంకేతిక పాత్రలను పోషించే వారిపై ఇంత పెద్ద మొత్తంలో పన్ను విధించడం సరికాదు. వీరిలో చాలామంది భవిష్యత్తులో కొత్త కంపెనీలు స్థాపించి లక్షలాది ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. ఈ విధానం అలాంటి వారిని దూరం చేస్తుందని ఆయన అన్నారు. అమెరికాలో ఆసియన్లు, భారతీయులపై పెరుగుతున్న విద్వేషపూరిత దాడులకు డొనాల్డ్ ట్రంప్‌ను పరోక్షంగా బాధ్యుడిని చేశారు. ఈ విద్వేషానికి కారణం ఎవరని అడగ్గా దాని పేరు డొనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉంటుందని ఆయన చమత్కరించారు. ప్రజల్లోని భయాలను రెచ్చగొట్టి, ఆర్థిక సమస్యలకు మైనారిటీలే కారణమనే భావనను ట్రంప్ కల్పించారని, గడిచిన పదేళ్లలో ఈ విద్వేషం సమాజంలో సాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇటలీతో భారత్ సంబంధాలు బలోపేతం..

### రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందన



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో ప్రధాని నరేంద్ర మోడీ దౌత్య సంబంధాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇటలీతో భారత్ సంబంధాలు ఇటీవలి సంవత్సరాల్లో అన్ని రంగాల్లో గణనీయంగా విస్తరించి, మరింత బలోపేతమయ్యాయని స్పష్టం చేసింది. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సమాధానమిస్తూ ఇటలీతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు అనేక రంగాల్లో విస్తరించడంతో పాటు మరింత పటిష్ఠమయ్యాయని పేర్కొన్నారు. దౌత్య సంబంధాలను పరస్పర గౌరవం, అవగాహనతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. రెండు దేశాల సున్నిత అంశాలు, అభిప్రాయాలను గౌరవిస్తూ పరస్పర అవగాహనతో సంబంధాలను మరింత బలోపేతం చేయడం దౌత్య విధానంలో ముఖ్యమని జైస్వాల్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై వివాదంప్రధాని మోడీ విదేశీ నేతలతో వ్యవహరించే తీరును విమర్శిస్తూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలతో వివాదం చెలరేగింది. గురువారం జరిగిన రచనాత్మక కాంగ్రెస్ జాతీయ సదస్సులో రాహుల్ గాంధీ మాజీ కాంగ్రెస్ ఎంపీ సందీప్ దీక్షిత్‌ను వేదికపైకి పిలిచి ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ దౌత్య విధానాన్ని ఉద్దేశిస్తూ ప్రధానమంత్రికి విదేశాంగ విధానం అంటే ప్రపంచ దేశాల నేతలను ఆలింగనం చేసుకోవడమే అన్నట్టుగా రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రసంగం కొనసాగుతుండగా సందీప్ దీక్షిత్ సరదాగా స్పందిస్తూ ఒక విషయం అడగనా నన్ను మెలోనీ అనుకుని పట్టుకోలేదు కదా అని వ్యాఖ్యానించారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో ప్రధాని మోడీసమావేశాలు, పరస్పర ఆలింగనాలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలను ఉద్దేశించే ఈ వ్యాఖ్య చేసినట్లు భావిస్తున్నారు.

## విదేశాల్లో భారతీయులపై ఏడు రెట్లు పెరిగిన దాడులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** విదేశాల్లో ఉంటున్న భారతీయులపై దాడులు గత ఐదేళ్లలో 7 రెట్లు పెరిగాయని విదేశాంగ శాఖ రాజ్యసభలో వెల్లడించింది. 2021లో విదేశాల్లో భారతీయుపై దాడులకు సంబంధించి 15 ఘటనలు వెలుగులోకి రాగా 2025 నాటికి ఈ సంఖ్య 104కు చేరింది. భారతీయులపై హింసాత్మక దాడి ఘటనలు అత్యధికంగా యుఎస్, యుఎఇ, యుకె, కెనడాల్లో వెలుగు చూశాయి. యుఎఇలో 32 కేసులు, యుకెలో 31, కెనడాలో 30 కేసులు వెలుగుచూశాయి. ఇక ఐర్లాండ్‌లో గత ఐదేళ్లలో భారతీయులపై 24 హింసాత్మక దాడులు జరగ్గా, రష్యాలో 23, జర్మనీలో 19 ఉదంతాలు బయటపడ్డాయి. 2021-25 మధ్య కాలంలో మొత్తం 302 దాడి కేసులు వెలుగు చూడగా 2025లో అత్యధికంగా 104 హింసాత్మక ఘటనలు జరిగాయి. భారతీయులపై హింసాత్మక దాడుల పెరుగుదలలో యేటా హెచ్చుతగ్గులు ఉన్నాయని గణాంకాల్లో తేలింది. యుఎస్‌ఎలో 2021లో ఒక్క ఘటన బయటపడగా, 2022లో ఆరు, 2023లోఒకటి, 2024లో 11, 2025లో 14 దాడి ఘటనలు జరిగాయి. ఇక యుకెలో 2021లో ఒక దాడి ఘటన వెలుగుచూసింది. 2022లో నాలుగు ఉదంతాలు, 2023లో 11, 2024లో పది, 2025లో ఐదు వెలుగుచూశాయి. ఇక కెనడాలో 2021లో భారతీయులపై దాడులకు సంబంధించి మూడు కేసులు వెలుగు చూడగా 2022, 2023 సంవత్సరాల్లో ఆరు కేసుల చొప్పున నమోదయ్యాయి. 2024లో ఏడు, 2025లో 8 దాడి ఘటనలు వెలుగుచూశాయి. మాలీలో 2021-24 మధ్య కాలంలో ఒక్క కేసు కూడా లేకపోగా 2025లో ఏకంగా 11 కేసులు వెలుగుచూశాయి.

# సహనంగా వ్యవహరిస్తే బలహీనులం కానేకాదు..!

### పాక్‌కు మరోసారి అజిత్‌దోవల్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత్ సహనంగా ఉండే దేశమైనప్పటికీ, ఇది బలహీన దేశం కాదని అజిత్ దోవల్ స్పష్టం చేశారు. మా సహనాన్ని బలహీనతగా పొరబడకండి. భారత్ రిస్కులు తీసుకోగలదు. అవసరమైతే గట్టి దెబ్బకొట్టగలదఅని ఆయన అన్నారు. ఆపేషన్ సిందూర్ వ్యూహాలకకు సంబంధించిన వివరాలపై ఆయన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూ డిస్కవరీకి ఇచ్చిననేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు కీలకంగా ప్రచారంలోకి వచ్చాయి. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాద సంస్థల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని దోవల్ వెల్లడించారు. భారత సైనిక, జాతీయ భద్రతా నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను కూడా ఈ డాక్యుమెంటరీ చూపించనుంది. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ లో జరిగిన దారుణమై ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మే 7న ఆపరేషణ్ సిందూర్ చేపట్టారు. పాకిస్తాన్, పీఓకేలోని లష్కరే తోయిబా, జైషే మహ్మద్‌కు చెందిన ట్రైనింగ్ క్యాంపులు, కార్యాలయాలను ధ్వంసం చేశారు. పాక్ సైన్యం భారత్‌పై దాడి చేసేందుకు ప్రయత్నిస్తే, భారత్ తన క్షిపణులు, యుద్ధ విమానాలతో పాక్ ఎయిర్ ఫోర్స్ బేసుల్ని ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో పాకిస్తాన్ లోని 10కి పైగా వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఇందులో పాక్ ఎయిర్ ఫోర్స్, న్యూక్లియర్ కమాండ్ సెంటర్‌గా ఉన్న రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్ కూడా ఉంది. చివరకు పాక్ శరణు కోరడంతో కాల్పుల విరమణ జరిగింది.

## అమెరికా-ఇరాన్ ఘర్షణలో 45 రీపర్ డ్రోన్లను కోల్పోయిన అమెరికా

**వాషింగ్టన్, ఆగస్టు 14:** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలో అమెరికా సైన్యం కనీసం 45 ఎంక్యూ9 రీపర్ డ్రోన్లను కోల్పో యినట్లు అమెరికా పత్రిక ఒకటి నివేదించింది. ఇది అమెరికా వద్ద ఉన్న ఆపరేషనల్ రీపర్ డ్రోన్లలో దాదాపు 25 శాతానికి సమానం. ఈ నష్టంతో అమెరికాకు 1.3 బిలియన్ డాలర్లకు పైగా విలువైన సైనిక సామగ్రి నష్టం జరిగినట్లు తెలిపింది. ఈడ్రోన్ల నష్టం కారణంగా మధ్యప్రాచ్య ప్రాంతంలో నిరంతర నిఘా, ఖచ్చితమైన వైమానిక దాడులు నిర్వహించే అమెరికా సామర్థ్యం తగ్గిందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి పరిసరాల్లో దీని ప్రభావం కనిపిస్తు న్నట్లు తెలిపింది. ఘర్షణ ప్రారంభానికి ముందు అమెరికా వద్ద సుమారు 185 ఎంక్యూ9 రీపర్ డ్రోన్లు ఉండేవి. వీటిలో 165ను అమెరికా వైమానిక దళం, మరో 20ను మెరైన్ కార్ప్స్ నిర్వహించేవి. అమెరికా నిఘా సంస్థలు నిర్వహించే డ్రోన్లు ఈ లెక్కలో లేవు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రధానంగా పనిచేసే మెరైన్ కార్ప్స్ యూనిట్లకు ఎలాంటి నష్టం జరగలేదని మెరైన్ కార్ప్స్ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ జోషువా బెన్‌సన్ తెలిపారు. దీంతో నమోదైన నష్టాలను ప్రధానంగా వైమానిక దళమే భరించాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కో ఎంక్యూ 9 రీపర్ ధర దాని సెన్సర్లు, ఆయుధాల అమరికను బట్టి 30 మిలియన్ నుంచి 50 మిలి యన్ డాలర్ల వరకు ఉంటుంది. నిఘా, కదిలే లక్ష్యాల ట్రాకింగ్, ఖచ్చితమైన దాడుల కోసం వీటిని ఉపయోగిస్తారు. అయితే రీపర్ డ్రోన్లకు ఉన్న తక్కువ వేగం, తక్కువ ఎత్తులో ప్రయా ణించే సామర్థం కారణంగా అవి శత్రు కాల్పులు, ఎలక్ట్రానిక్ జోక్యం, కమ్యూనికేషన్ లింక్ వైఫల్యాలకు గురయ్యే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. కోల్పోయిన 45 డ్రోన్లలో అన్నీ శత్రు చర్యల వల్లే కూలిపోయినవి కావని తెలిపింది. ఆపరేటర్లు, డ్రోన్ల మధ్య కమ్యూనికేషన్ లింక్ తెగిపోవడంతో కొన్ని డ్రోన్లు కూలిపోయినట్లు పెంటగాన్ సమాచారాన్ని వెల్లడించిన ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ నష్టాలపై పెంటగాన్‌లో ఇప్పటికే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మేలో అమెరికా వైమానిక దళానికి చెందిన లెఫ్టినెంట్ జనరల్ డేవిడ్ టాబోర్ సెనేటర్లకు ఇచ్చిన సమాచారం ప్రకారం, క్రియాశీల రీపర్ డ్రోన్ల సంఖ్య సుమారు 135కి తగ్గిపోయింది.

## ఇంకా చీకట్లోనే బంగ్లాదేశ్.. కొత్త ప్రభుత్వానికి చుక్కలు



**ఢాకా, ఆగస్టు 14:** బంగ్లాదేశ్‌లో రెండు రోజుల క్రితం తలెత్తిన విద్యుత్ సంక్షోభం తీవ్రమవుతోంది. గ్యాస్ టెర్మినల్‌లో సమస్య కారణంగా ఎల్ఎన్జీ నిలిచిపోవడం, దేశంలో గ్రిడ్ కుప్పకూలే పరిస్థితికి చేరుకోవడంతో మొదలైన ఈ సమస్య ఇంకా కొనసాగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం మాల్స్, షాపులు, వ్యాపార సంస్థల్ని రాత్రి 8 గంటలకే మూసేయాలని ఆదేశాలు ఇచ్చింది. అయినా పరిస్థితి ఇంకా అదుపులోకి రాలేదు. మరోవైపు భారత్ నుంచి డీజిల్ కోరుతూ ఇప్పటికే బంగ్లా ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరోసారి బంగ్లాలో ప్రజా తిరుగుబాటు తప్పేలా లేదు. బంగ్లాదేశ్‌లో విద్యుత్ సంక్షోభం ఊహించని రీతిలో తీవ్రరూపం దాల్చింది. దేశవ్యాప్తంగా కరెంట్ కోతలు విపరీతంగా పెరిగిపోవడంతో తాత్కాలిక ఉపశమనం కోసం తారిఖ్ రెహ్మాన్ ప్రభుత్వం దేశంలోని అన్ని నివాస, వాణిజ్య ప్రాంతాల్లో ఉన్న షాపింగ్ మాల్స్, మార్కెట్లు, ఇతర దుకాణాలను రాత్రి 8 గంటలకే మూసివేయాలని ఆదేశాలు ఇచ్చింది. మరోవైపు ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. దీనికి తోడు గంటల తరబడి సాగుతున్న విద్యుత్ కోతలు ప్రజల జీవితాన్ని నరకప్రాయంగా మార్చాయి. ఈ నేపథ్యంలో స్థానిక విద్యుత్ స్టేషన్లపై ప్రజలు పలు చోట్ల దాడులకు దిగుతున్నారు. దీంతో ఆరు నెలల క్రితమే ఏర్పడిన ప్రభుత్వానికి చుక్కలు కనిపిస్తున్నాయి. కరెంట్ కష్టాల నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్ష పార్టీలు కూడా రంగంలోకి దిగాయి. సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నారంటూ ప్రధాని తారిఖ్ రెహ్మాన్‌పై విమర్శల దాడి తీవ్రతరం చేశాయి. దేశంలో అప్రకటిత కరెంట్ కోతలు రాత్రి వేళల్లోనూ కొనసాగుతుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఉక్కపోతతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. తగినంత ఇంధన లభ్యత లేకపోవడం వల్లనే విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని చెబుతున్నారు.

## వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**హైదరాబాద్,ఆగస్టు14:** ఈనెల 15న దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా దేశ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ధైర్యసాహసాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్రం, సార్వభౌమత్వం, సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. భారత్‌ను మరింత బలమైన, స్వావలంబనతో కూడిన ఆత్మనిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని శివప్రతాప్ శుక్లా కోరారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందేలా శాంతి, సౌభ్రాతృత్వం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఐక్యతతోనే అభివృద్ధి.. ఐక్యత, సమగ్రత, అభివృద్ధి స్ఫూర్తితో ఉజ్వల భారతావని నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ ఆకాంక్షించారు. దేశ ప్రగతిలో యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం ఎల్లప్పుడూ గర్వంగా రెపరెపలాడాలని, దాని మూడు రంగులు దేశ ప్రజల్లో ధైర్యం, శాంతి, విశ్వాసానికి ప్రతీకలుగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని వికసిత్ భారత్ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

# 17 నుంచి భోగాపురం విమానాలు రాకపోకలు

### ప్రయాణికులు, వాణిజ్య విమాన సర్వీసులకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్



విశాఖపట్నం, ఆగస్టు 14 ప్రభాతవార్త : భోగాపురంలోని అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 17, 2026 నుంచి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో షెడ్యూల్ చేయబడిన అన్ని దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల విమాన సర్వీసులు కొత్త విమానాశ్రయానికి మారనున్నాయి. గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్‌గా రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మౌలిక వసతులతో విమానయాన సంస్థలు, ప్రయాణికులకు స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం, సమర్థవంతమైన విమానాశ్రయ కార్యకలాపాలు, భవిష్యత్‌లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విస్తరించగల సామర్థంతో దీనిని అభివృద్ధి చేశారు. కొత్త విమానాశ్రయానికి కార్యకలాపాల మార్పు ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు మెరుగైన కనెక్టివిటీతో పాటు పర్యాటకం, కార్గో, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభించనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవిఐఎఎల్) అభివృద్ధి చేసి, నిర్వహిస్తున్న ఈ విమానాశ్రయాన్ని కార్యకలాపాల సామర్థం, ప్రయాణికుల సౌకర్యం, దీర్ఘకాలిక విస్తరణకు అనుగుణంగా రూపొందించారు. ఆగస్టు 17 నుంచి విశాఖపట్నం నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు భోగాపురంలోని కొత్త సమీకృత అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వినియోగించనున్నారు. ఈ విమానాశ్రయం ఐఏటీఏ కోడ్ విటిజెడ్ కార్యకలాపాలు నిర్వహించనుంది.

77,342 చదరపుమీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత ప్రయాణికుల టెర్మినల్లో చెక్‌ఇన్, భద్రతా తనిఖీలు, ఇమ్మిగ్రేషన్, బ్యాగేజీ నిర్వహణ, బోర్డింగ్ వంటి ప్రయాణ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సదుపాయాలన్నీ ఒకేచోట అందుబాటులో ఉన్నాయి. అధునాతన బ్యాగేజీ, హ్యాండ్లింగ్ వ్యవస్థలు ప్రయాణికుల సామాన్లను టెర్మినల్‌లో సమర్థవంతంగా తరలించేందుకు దోహదపడతాయి. ప్రస్తుత వాణిజ్య విమాన సర్వీసుల అవసరాలతో పాటు భవిష్యత్‌లో పెరగనున్న విమాన రాకపోకలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. ప్రారంభ దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థం కలిగిన ఈ విమానాశ్రయాన్ని భవిష్యత్‌లో 4 కోట్లకు పైగా ప్రయాణికుల సామర్థ్యానికి విస్తరించవచ్చు. ఎయిర్‌సైడ్ మౌలిక వసతుల్లో 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్‌వే, సమాంతర ట్యాక్సీవే, ర్యాపిడ్ ఎగ్జిట్ ట్యాక్సీవేలు, 18 విమానాల పార్కింగ్ స్టాండ్లు ఉన్నాయి. ఇవి షెడ్యూల్డ్ విమాన సర్వీసుల నిర్వహణతో పాటు భవిష్యత్ విస్తరణకు అవసరమైన మౌలిక వసతులను అందిస్తాయి. విమానాశ్రయ రోజువారీ కార్యకలాపాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషించనుంది. స్మార్ట్ ఎయిర్‌పోర్ట్ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రయాణికుల సేవలు, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా రియల్‌టైమ్ కార్యకలాపాలపై సమగ్ర అవగాహన, ముందస్తు విశ్లేషణలు అందుబాటులోకి వస్తాయి. ఇవి సమన్వయంతో నిర్ణయాలు తీసుకోవడంతో పాటు విమానాశ్రయ కార్యకలాపాల సమర్థవంతమైన నిర్వహణకు తోడ్పడతాయి. కొత్త విమానాశ్రయానికి కార్యకలాపాల మార్పు ఈ ప్రాంత విమానయాన రంగంలో కూడా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఆధునిక మౌలిక వసతులు, మెరుగైన ప్రయాణికుల ప్రాసెసింగ్ సామర్థ్యాలు, భవిష్యత్ విస్తరణకు అవకాశం కలిగిన ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రాంతంలో విమాన కనెక్టివిటీ, ప్రయాణికుల రాకపోకలు, పర్యాటకం, వ్యాపార ప్రయాణాలు, కార్గో, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి మరింత ఊతం అందించనుంది. ఆగస్టు 17న తొలి వాణిజ్య విమాన సర్వీసులకు స్వాగతం పలికేందుకు అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది.

## హిందువుల పైకి హైడ్రా... పాతబస్తీకి ఉచిత కరెంటా?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రంచందర్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్,ఆగస్టు14:ప్రభాతవార్త:** పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని సానుభూతిని, విద్యుత్ బిల్లులు చెల్లించని మైనారిటీల విషయంలో ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. ఒకవైపు సామాన్య పేద హిందూ కుటుంబాలపై హైడ్రాను ప్రయోగిస్తూ వేధింపులకు గురిచేస్తూ... మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు కట్టకపోవడాన్ని సమర్థిస్తూ ప్రోత్సహించేలా మాట్లాడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, ఖిలాఫత్ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు వారి విధానంలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు.

# దుర్గమ్మ సన్నిధిలో వరుణ యాగం ప్రారంభం





**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 14, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో వరుణ యాగ పూజాదికాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను నివారించి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నదులు, చెరువులు, జలాశయాలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దేవాదాయ శాఖ కమీషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మేరకు ఉదయం దేవస్థానంలో దీక్షాపూర్వకంగా వరుణ యాగం సంబందించిన పూజలు నిర్వహిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 6:15 నుండి శ్రీ దుర్గాస్నానఘాట్లో విఘ్నేశ్వర పూజతో వరుణ యాగ పూజా కార్యక్రమములు ప్రారంభం కాగా ప్రత్యేక పూజల్లో ఈవో వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పండితులు వరుణ అనువాక సహిత కారక పారాయణలు నిర్వహించారు. ఈ పారాయణలు కొరకు పండితుల బృందం పవిత్ర కృష్ణానదిలో నడుంలోతు నీళ్లలో ఉండి సకాలంలో వర్షాలు పడాలని పారాయణం చేసారు.


- దుర్గమ్మవారి ఆలయాభివృద్ధి పనుల పరిశీలన: విజయవాడ దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఈఓ సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన అన్నదానం భవనం మరియు ప్రసాదం పొట్టు (తయారీ) భవన నిర్మాణ పనులను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, అందుబాటులోకి రానున్న వసతులపై ఎంపీ కేశినేని చిన్ని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అన్నదాన భవనం, ప్రసాదం తయారీ కేంద్రాల నిర్మాణాలు పూర్తి కావడం సంతోషకరమన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవపు వేడుకలు మహామండపం 7వ అంతస్తులో ఘనంగా జెండా వందన కార్యక్రమం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

# హత్య కేసులో ఇరువురు ట్రాన్స్‌జెండర్లు అరెస్ట్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు14, ప్రభాతవార్త.** బిక్షాటన డబ్బులు వాటాలు పంపకాలలో వచ్చిన విభేదాలతో జరిగిన హత్య కేసును ఛేదించిన కాకినాడ జిల్లా పోలీసులు నిందితులుగా ఇరువురు ట్రాన్స్ జెండర్లు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు కేసు వివరాలు ప్రకారం కాకినాడ 3 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల జ్యోతుల కాలనీ, తోటమ్మవారివీధిలో ఈ నెల 3 వ తేదీన ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు మరియు వాళ్ళతో పాటు తిరిగే ఒక వ్యక్తికి డబ్బుల విషయంలో జరిగిన గొడవ విషయమై పోలీసులు కేసు నమోదు చేసారు. ఇద్దరు ట్రాన్స్ జెండర్లు జెస్సీ, పప్పీ కలసి రాజు శివ అనే వ్యక్తిని త్రీవంగా కొట్టారు. ఈమేరకు రాజు రాజేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. సాగర్ బాబు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చికిత్స పొందుతున్న రాజు శివ పరిస్థితి విషమించి 6న మరణించడంతో సదరు కేసును హత్య కేసుగా ఆల్టర్ చేసారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రత్యేక దృష్టి సారించగా ప్రత్యేక క్రైమ్ బృందాలతో విచారణ చేపట్టారు.

నిందితులు పోర్ట్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో తిరుగుతుండగా సాయిపోగు కిరణ్మయి(జెస్సీ), రెడ్డిపోగు అజయ్ కుమార్ (పప్పీ) అనే ట్రాన్స్ జెండర్లును అరెస్ట్ చేశారు. వారి ద్వారా నేరానికి ఉపయోగించిన సిమ్మెంటు రాయి మరియు కర్ర ను సేకరించి సీజ్ చేసారు. ముద్దాయిలు కర్నూలు జిల్లా కల్లూరు గ్రామస్తులైన సాయిపోగు కిరణ్మయి, రెడ్డిపోగు అజయ్ కుమార్ లుగా గుర్తించారు. వీరు కొంత కాలం క్రితం ట్రాన్స్ జెండర్లుగా మారి వారి వృతి లో భాగంగా కాకినాడ పట్టణ పరిసర ప్రాంతాలలో షాపుల వద్ద డబ్బులు తీసుకుంటూ, భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. మృతుడు అయిన కాకినాడ, రాగంపేట, రెల్లివీధి కి చెందిన రాజు శివ అనే 41 సం॥ల వ్యక్తి పట్టణం లోని ఒక ప్రైవేటు ఆసుపత్రి లో బాత్రూమ్ లు శుభ్రం చేసుకుంటూ జీవించేవాడు. రాజు శివకు ఇంకా వివాహం కాలేదు. మృతుడు అప్పుడప్పుడూ ముద్దాయిలతో కలసి భిక్షాటనకి కూడా వెళ్ళేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 3 వ తేదీన డబ్బుల విషయమై మృతునికి, ముద్దాయిలకు జరిగిన గొడవలలో ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు కలసి రాజు శివను కాళ్లతో వృషణాలపై తన్నడం, చేతులతోనూ, కర్రతోను, సిమ్మెంటు రాయితోను దవడపై కొట్టడం వలన తీవ్ర రక్తస్రావం జరిగి మరణించినట్లు విచారణలో తేలింది. త్వరితగతిన హత్య కేసును చేధించి ముద్దాయిలను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, ఎస్ఐ సాగర్ బాబు, హెడ్ కానిస్టేబుల్స్ పి.పౌలు, ఏ.సతీష్, కానిస్టేబుల్స్ టి.మురళీరాజు, కే.శ్రీనివాస్ క్రైమ్ స్టాఫ్‌ను కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందించారు.

# మన తరం కోసం..



ఫ్యాషన్ ఫ్యాషన్



ఫ్యాషన్ దుస్తులతోపాటూ జ్యువెలరీలోనూ కొత్త ట్రెండ్స్ ఫాలో అవ్వాలనుకుంటున్నారా.. అయితే మార్కెట్లో మెరిసిపోతున్న ఈ సరికొత్త నగల్ని ప్రయత్నించి చూడండి. అద్భుతమైన నగిషీలతో దేవుడి ఉంగరాలూ, అదిరిపోయే డిజైన్లతో పూసల పెండెంట్లూ ఆకట్టుకునే మెడల్లతో రుద్రాక్షల బ్రేస్‌లెట్లూ..ఎంతో అందాన్నిస్తాయి..

## దేవుళ్ల ఉంగరాలు..

అమ్మమ్మల నుంచి అమ్మాయిల వరకూ అందర్నీ మెప్పించే నగలేవైనా ఉన్నాయా అంటే.. అవి కచ్చితంగా టెంపుల్ జ్యువెలరీనే. హారాల దగ్గర్నుంచి గాజుల వరకూ ప్రతిదాంట్లోనూ కనిపించిన ఈ టెంపుల్ థీమ్. నగల ప్రియుల్ని బుట్టలో పడేస్తూ ఈ మధ్య చేతి ఉంగరాల్లోకీ చేరిపోయింది. అప్పట్లో చిన్న డిజైన్లలో కనిపించే దేవుళ్ల చిత్రాలు.. ఇప్పుడు చక్కటి నగిసీలూ, రత్నాల మెరుపులతో అచ్చంగా దేవుడి విగ్రహ రూపాల్లా వస్తున్నాయి. లక్ష్మీదేవి, వేంకటేశ్వరస్వామీ, శివపార్వతులూ.. ఇలా ఎందరో దేవుళ్ల రూపాలతో వజ్రాలూ, కెంపులూ, పచ్చలూ, నీలాల రాళ్ల చమక్కుల్ని జత చేసుకుని కనువిందు చేస్తున్నాయి. ఆడవాళ్లతోపాటు మగవాళ్లకూ వీటిల్లో రకరకాల డిజైన్లు దొరుకుతున్నాయి. అనుక్షణం తమ ఇష్టదైవాన్ని స్మరించుకునేవాళ్లు ఈ టెంపుల్ థీమ్ ఉంగరంతో ఆ దేవుడి రూపాన్ని కళ్లముందుకు తెచ్చుకోవచ్చు.



## రుద్రాక్షల బ్రేస్‌లెట్ !

రుద్రాక్ష భగవంతుడికి ప్రతిరూపమని చెబుతూ కొందరూ, వాటిని ధరించడం వల్ల ఆరోగ్యమంటూ మరికొందరూ.. ఇలా రకరకాల నమ్మకాలతో రుద్రాక్షల్ని ధరిస్తారు. అలాంటివారిని దృష్టిలో పెట్టుకుని ఎంతో పవిత్రంగా భావించే ఆ రుద్రాక్షల్ని- మామూలు దారానికి కట్టుకునే బదులు విలువైన బంగారు నగల్లో తీసుకొస్తే ఎలా ఉంటుంది. అనుకున్నారేమో తయారీదారులు చిన్న చిన్న బంగారు రుద్రాక్షల లాకెట్లతోపాటూ బ్రేస్‌లెట్లనీ తీసుకొచ్చేశారు. ఈ తరానికి నచ్చేలా ట్రెండీ డిజైన్లలో వీటిని తయారుచేస్తున్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా స్వస్తిక్, ఓం, త్రిశూలం లాంటి గుర్తుల్ని బ్రేస్‌లెట్లకి జత చేస్తున్నారు. మిగతా వాళ్ల సంగతేమోకానీ దైవభక్తి ఉన్నవాళ్లకు బహుమతిగా ఈ రుద్రాక్షల బ్రేస్‌లెట్‌ని అందించారంటే కచ్చితంగా అది వారికి అపురూపమైన కానుకే అవుతుంది.



## పూసల పెండెంట్లు!

బంగారమేంటీ..రత్నాలేంటీ. పూసలేంటీ.. అన్నీ నగల్లో భాగం కావాల్సిందే, అమ్మాయిల మెడని చుట్టి అందాల ఆభరణంగా మారాల్సిందేనంటూ డిజైనర్లు సరికొత్త జ్యువెలరీని తీసుకొస్తుంటారు. అందులో భాగంగా కొత్తగా డిజైన్ చేసినవే ఇక్కడున్న ఈ పూసల పెండెంట్లు. అందమైన బంగారు డిజైన్ల వెనక రంగు రంగుల పూసల వరసల్ని జోడిస్తూ.. లాకెట్లునే చక్కని కళా చిత్రంలా తీర్చిదిద్దుతున్నారు. ◻



# పిల్లలు నిద్రపోవడం లేదా !



రాత్రి 11 గంటలైనా ఎనిమిదేళ్ల కొంది మంది పిల్లలు పట్టడం లేదు అంటారు. అలాగే 15 ఏళ్ల పిల్లలు కూడా కొంత నిద్రపోవడానికి ఆసక్తి చూపారు. పగలంతా స్కూల్, హోంవర్క్ అంటూ అలసిపోతారు. అయినా నిద్రలేమికి గురవుతున్నారంటే దానికి కారణం స్క్రీన్, డిజిటల్ టెక్నాలజీ ప్రభావమే అంటూన్నారు నిపుణులు. ఈ సమస్యను పరిష్కరించక పోతే, పిల్లలు శారీరక, మానసిక అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరి స్తున్నారు. పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మెదడు పని తీరు మెరుగ్గా ఉండాలంటే చిన్నప్పటి నుంచి వాళ్లకు నాణ్యమైన నిద్ర అవసరమెంతో ఉంది. కంటినిండా నిద్ర వాళ్ల మెదడుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. శారీరక ఎదుగుదలకు దోహదపడుతుంది. కానీ నిద్రకు ముందు ఫోన్ వినియోగిస్తే అది పిల్లల మెదడు, మనసును ఉత్తేజ పరుస్తుంది. అలాగే ఫోన్, టాబ్లెట్, టివి నుంచి వెలువడే నీలి కాంతి మెదడులో సహజంగా విడుదలయ్యే మెలటోనిన్ స్థాయులను నిరోధి స్తుంది. ఇది నిద్రను ప్రభావితం చేస్తుంది. స్నేహితులతో చాట్ చేయడం, గేమ్స్, రీల్స్ చూడటం వంటివన్నీ నిద్రపోవాలనే ఆసక్తిని తగ్గిస్తాయి. అంతేకాదు, రోజులో ఎప్పుడైనా ఫోన్ లేదా టివిలో చూసిన హింసాత్మక కంటెంట్ ప్రభావమూ పిల్లల మెదడుపై పడి నిద్రను దూరం చేస్తుంది.

**నివారించడమెలా...**

సాయంత్రంవేళల్లో స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి పిల్లలను ప్రోత్సహించాలి. ఉదయం లేదా సాయంత్రం తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా కాసేపు నడిస్తే, నక్రమేపీ వారికి వ్యాయామం అలవడుతుంది. శారీరక శ్రమతో కండరాలు అలిసి హాయిగా నిద్రపోతారు. ఫోన్ వాడకానికి పరిమిత సమయాన్ని కేటాయించి, నిద్రవేళకు గంట ముందే డిజిటల్ వినియోగాన్ని నిలిపేసేలా అలవాటు చేయాలి. నిద్రపోయే ముందు తల్లిదండ్రులు వారికి కథలు చెప్పడం, ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకోవడం వంటివి చేయాలి. ముఖ్యంగా నిద్రపోయే ముందు ఇంటిల్లిపాది ఒకచోట ఫోన్లన్నీ భద్రపరచాలనే నియమాన్ని పెట్టుకోవాలి. అంతేకాదు, పడకగదిలో పెద్దవాళ్లూ కంప్యూటర్, స్మార్ట్‌వాచ్‌లను వినియోగించే అలవాటుంటే మానేయడం మంచిది. లేదంటే వాటి నుంచి వచ్చే నీలికిరణాలు పిల్లల నిద్రపై చెడు ప్రభావం చూపుతాయి. బెడ్‌రూంలో టివి వంటివి లేకుండా ఆ ప్రాంతాన్నంతా సాంకేతికత రహితంగా మార్చితేనే పిల్లలు కంటినిండా నిద్రపోతారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారు. ◻

# పెరుగు పోషకాల గని !



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



పెరుగు వాడకం ఎంత ఆరోగ్యకరమని అనుకున్నా దాని వినియోగ విషయంలో తెలుసుకోవాల్సిన అంశాలెన్నో ఉన్నాయి. పూర్తిగా తయారుకాని పెరుగుని, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న పెరుగు బాగా పులిసిన పెరుగుని తినరాదు. దీని వల్ల ఫుడ్ పాయిజనింగ్ పొత్తి కడుపులో తిమ్మిర్లు, వాంతులు, ఆకలి తగ్గడం, అలసట, చర్మం నొప్పి, మలంలో రక్తం పడడం జరుగుతుంది. వసంత, శరదృతువు, చలికాలంలో తింటే కఫం ఎక్కువైన వారు మానవేయడం మంచిది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నప్పుడు తినరాదు. పెరుగుని వేడి చేసి తినరాదు. దీని వల్ల ఊపిరాడక, శరీరంలో వాపులు వస్తాయి. రాత్రిళ్ళు పెరుగు తినరాదు. జీర్ణవ్యవస్థ వీక్‌గా ఉంటే రాత్రి పూట పెరుగు మానివేయాలి. అజీర్తి ఎసిడిటీ ఉన్నవారు మీగడ పెరుగు తినరాదు. ఎందుకంటే పెరుగులో తీపి, పులుపు రెండు ఉండడం వల్ల కఫం (శ్లేష్మం) ఏర్పడుతుంది. పెరుగుని చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, మామిడి, అరటి, మాంసం, ఎగ్స్, పుల్లని పదార్థాలతో, వేడి పదార్థాలతో కలిపి తీసుకోరాదు. ఎందు కంటే రెండు అధిక ప్రోటీన్స్ గల పదార్థాల్ని ఒకే సారి తినడం వల్ల షుగర్ పెరగడం, దగ్గు, ఆయాసం, చర్మ సమస్యలు అల్సర్‌వస్తాయి రాత్రిళ్ళు పెరుగు మీద నీళ్ళు త్రాగరాదు.

**ఆరోగ్య చిట్కాలు :** పిల్లలు, వృద్ధులు, బలహీనంగా ఉన్నవారు, పోషకాహారలోపం ఉన్నవారు వీర్యకణాల వృద్ధికి పెరుగు+దానిమ్మ, పెరుగు+ ఎండు నరదాక్ష, పెరుగు+ఎండు ఖర్జురాలు, బాదంపొడి కలిపి తీసుకోవచ్చు. జలుబు, దగ్గు, గొంతుసమస్య, జీర్ణశకిన పెరగ డానికి పెరుగు+ మిరియాలపొడి పెరుగు+బెల్లం పొడి, పెరుగు+ జీలకర్ర, వాముపొడి కలిపి తీసుకోవచ్చు. మూత్రాశయ సమస్యలు, అధిక కఫం ఉన్నప్పుడు, తక్షణ శక్తికి అలసటగా ఉన్నప్పుడు పెరుగు+చక్కెర, పెరుగు+తేనె నెయ్యి పచ్చిశనగలు, ఉసిరి కలిపి తీసుకోవాలి. కడుపులో అల్సర్స్, ఇన్ఫెక్షన్స్ ఉన్నప్పుడు, వేడి చేసినప్పుడు పెరుగులో తేనె కలిపి తీసుకోవాలి. శరీరంలో ఫోలిక్ ఆసిడ్ చేరాలంటే, ఆంటిసెప్టిక్‌గాపెరుగు+ పసుపు+ అల్లం తీసుకోవాలి. పంటి సమస్యలు, నోటిపూత ఉన్నప్పుడు పెరుగు+ వాము తీస ుకోవాలి. కండరాల శక్తికి పెరుగు+ఓట్స్ తీసు కోవాలి. దీన్ని శరీరంలో నీరు ఎక్కువగా ఉన్నవారు, బిపి ఎక్కువగా ఉన్నవారు రోజు తీసుకోవచ్చు. జిగట విరేచనాలకి పెరుగు మెంతులు తీసుకోవాలి. అలాగే వేడి అన్నంలో పెరుగు వేసుకొని తినాలి. వేడి తగ్గించి చలువ చేయడానికి పెరుగులో బెల్లం వేసుకొని తినాలి. అజీర్తి ఎసిడిటీ ఉన్నవారు పెరుగులో ఉప్పు వేసుకొని తినాలి. రోగనిరోధక శక్తి పెరగడానికి పెరుగులో దానిమ్మ, ద్రాక్ష, అరటి వంటి పండ్లు వేసుకొని తినవచ్చు. కీళ్ళ నొప్పులు న్నప్పుడు పెరుగు+ఆరెంజ్ జ్యూస్‌తో తినాలి. బరువు తగ్గడానికి పెరుగులో జీలకర్ర వేసుకొని తినాలి. దంతాలనొప్పి, నోటిలో అల్సర్లు ఉన్నప్పుడు పెరుగులో సోంపు గింజలు వేసుకొని తినాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు-చికిత్స:** రోజుకి 3 కప్పుల పెరుగు మాత్రమే తీసు కోవాలి. పెరుగును పరగడుపు, భోజనానికి ముందు, రాత్రిపూట తీసుకోరాదు. మధ్యాహ్నం మాత్రమే తీసుకోవాలి. మజ్జిగ తీసుకోవచ్చు. తాజా పెరుగునే వాడాల్సి ఉంటుంది. ఫ్రిజ్‌లో నిల్వ చేసిన పెరుగుని వెంటనే తినరాదు. బైట పెట్టి 1-2 గంటలకి తీసుకోవచ్చు. ఫ్రిజ్‌లో ఎక్కువ రోజులుంచినపుడు పెరుగులోని పోషకవిలువలు తగ్గిపోతాయి. రాత్రిపూట పెరుగు తీసుకోవాలంటే నెయ్యి, చక్కెర, తేనె ఉసిరిపొడి శనగపిండి కలిపి తీసుకోవచ్చు. కీళ్ళవ్యాధులున్నవారు, కఫం ఎక్కువగా వచ్చేవారు, పెరుగు పడని వారు పెరుగులో మిరియాలపొడి లేదా మెంతి పొడి లేదా చిటికెడు ఎండుమిర్చి వేసి వాడుకోవచ్చు. పెరుగు ఎక్కువగా వాడేటప్పుడు విరుగుడు వెడి నీళ్ళు, జీలకర్ర, శొంఠిపొడి, బెల్లం, ఉప్పు సైంధవలవణం తీసుకోవాలి. ◻

# హనుమ ఆరాధన



ఓం హరి మర్కట మర్కటాయనమః ఆంజనేయస్వామిని మీరు ఇలా తలుచుకోవచ్చు. 11 సార్లు చదువుకుంటే మీ కోరికను ఆ స్వామి ఆలకిస్తారు . ఆపదలో వున్న తన భక్తులను ఆదుకోవడానికి హనుమంతుడు ఎంత మాత్రం ఆలస్యం చేయడు. అలాంటి హనుమంతుడిని అనునిత్యం పూజించే వారు వుంటారు.. ఆ స్వామికి ప్రదక్షిణలు చేసిన తరువాతనే తమ దైనందిన కార్యక్రమాలను మొదలు పెట్టేవారు వుంటారు. ఇక స్వామివారికి ప్రత్యేకించి పూజాభిషేకాలు చేయించే వారు మాత్రం, హనుమకు ఇష్టమైన మంగళవారం రోజున అవి చేయిస్తుంటారు. తమలపాకులతో పూజలు చేయించి .. ఆ స్వామికి ఇష్టమైన తీపి అప్పాలను నైవేద్యంగా సమర్పి స్తారు. ఈ విధంగా చేయడం వలన అనారోగ్యాలు .. ఆపదలు .. ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగిపోతాయి.ఇక చాలామంది శనివారం రోజున కూడా హనుమంతుడిని పూజిస్తుంటారు .. భక్తి శ్రద్ధలతో సేవిస్తుంటారు. శనివారం రోజున హనుమను పూజించడం వలన, శనిగ్రహ సంబంధమైన దోషాలు తొలగిపోతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. శనివారం రోజున హనుమను పూజించేవారి జోలికి రానని ఒకానొక సందర్భంలో శనిదేవుడు హనుమకు మాట ఇచ్చాడట. అందువల్లనే ఆ రోజున హనుమను పూజించడం మంచిది.

# ఫ్రూట్ సలాడ్ ట్రీస్ !



జామచెట్టుకు జామ, సపోటా చెట్టుకు సపోటాలే కాస్తాయి. ఈ చిట్టి చెట్టుకు అయితే పండు ఇంకొకటి రాదు కానీ.. ఒక చెట్టుకు ఆరు రకాల పండ్లు వస్తే ఇదేం ఫాంటసీ సినిమానా అనుకుంటున్నారా? అలాంటివి నిజం చేసి చూపిస్తున్నారు శాస్త్రవేత్తలు. ఆస్ట్రేలియాలో ఎక్కువ అంట్లు కట్టడం (మల్టీ గ్రాఫెడ్) అనే పద్ధతిలో ఒక చెట్టుకు ఆరు రకాల పండ్లు వచ్చేలా అభివృద్ధి చేశారు. వీటిని ఫ్రూట్ సలాడ్ ట్రీస్' అంటారు. గమ్మత్తేమిటంటే ఒకే చెట్టుకు కాసినప్పటికీ ఆయా పండ్లు.. రంగు,రూపం, రుచి, వాసన.. ఎందులోనూ సహజత్వాన్ని కోల్పోవు. వీటని నేల మీదే కాదు కుండీల్లోనూ పెంచవచ్చు. ◻



## ఆత్మహత్యలను ప్రోత్సహించకూడదనే..

ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్టార్‌గా మారిపోయారు హీరో యష్. అప్పటికే కర్ణాటకలో భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆయన, కేజీఎఫ్ సినిమాలతో దేశవ్యాప్తంగా పాపులారిటీ దక్కించుకున్నారు. గతంలో ఆయన వీరాభిమానుల్లో ఒకరు ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. తాను యష్ కి పెద్ద ఫ్యాన్ అని, తన అంత్యక్రియలకు రావాలని సూసైడ్ లెటర్ లో రాసుకొచ్చారు. అయితే యష్ తన అభిమాని చివరి కోరిక తీర్చలేదు. అతడి అంత్యక్రియలకు వెళ్లలేదు. దీంతో అప్పట్లో యష్ పై విమర్శలు వచ్చాయి. దీనిపై ఇన్నాళ్లకు యష్ స్పందించారు. 2021 ఫిబ్రవరిలో యష్ అభిమాని ఆత్మహత్య వ్యవహారం సంచలనం సృష్టించింది. కర్ణాటకలోని మాండ్యా జిల్లా కోడిదొడ్డి గ్రామానికి చెందిన రామకృష్ణ (25) అనే యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చనిపోయే ముందు అతడు రాసిన సూసైడ్ నోట్ అప్పట్లో వైరల్ అయింది. హీరో యష్‌కి, కాంగ్రెస్ నేత సిద్ధారామయ్యకి తాను పెద్ద అభిమానినని, వీరిద్దరూ తన అంత్యక్రియలకు రావాలని అందులో రాశాడు. ఆ సమయంలో రామకృష్ణ అంత్యక్రియలకు సిద్ధరామయ్య హాజరయ్యారు కానీ, యష్ మాత్రం వెళ్లలేదు. తాజాగా ఓ హిందీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఇలా చేస్తే యష్ వస్తాడు అనే తప్పుడు ఆలోచన రాకూడదనే అభిమాని అంతిమయాత్రకు వెళ్లలేదని చెప్పారు.



## ఆర్మీ ఆఫీసర్

బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ ప్రెస్టీజియస్ మల్టీస్టారర్ చిత్రం వెంకీ అనిల్ 5. తెలుగు చిత్రసీమలో హీరోగా అడుగుపెట్టి విజయవంతంగా 40 ఏళ్లు పూర్తి చేసుకున్న వెంకటేష్‌కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.

ఈ సినిమాలో వెంకటేష్ ఇండియన్ ఆర్మీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. కౌంటర్ టెర్రరిజం విభాగంలో ప్రత్యేక అధికారిగా ఆయన పాత్ర కథలో అత్యంత కీలకంగా ఉండబోతోంది. గుబురు గడ్డం, మీసాలు, మిలిటరీ కమోఫ్లేజ్ యూనిఫామ్, బ్లాక్ కంబాట్ షూస్, సన్ గ్లాసెస్‌తో వెంకీ మామ మాస్ అండ్ ఇంటెన్స్ అవతార్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అనిల్ రావిపూడి వెంకటేష్ కలయికలో వస్తున్న ఐదో ప్రాజెక్ట్ కావడం విశేషం. తారాగణం: వెంకటేష్, కళ్యాణ్ రామ్‌ల సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.సంగీతం: నేషనల్ అవార్డ్ విన్నర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. నిర్మాణం: షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ కలబోతగా తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# తెర

## అదరగొట్టిన కాంతార, కాంత!

◆మెల్‌బోర్న్ అవార్డుల్లో దక్షిణాది హవా ◆ఉత్తమ నటుడిగా దుల్కర్ సల్మాన్, దర్శకుడిగా రిషబ్ శెట్టి ◆రేఖ, రాణీ ముఖర్జీలకు ప్రత్యేక గౌరవం ◆ఆస్ట్రేలియాలో ఘనంగా అవార్డుల వేడుక..



ఆస్ట్రేలియా వేదికగా జరిగిన 17వ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా ముగిసింది. 2025 సంవత్సరంలో విడుదలైన అత్యుత్తమ చిత్రాలు, వెబ్ సిరీస్‌లు, సినీ ప్రతిభావంతులకు ఈ వేడుకలో పురస్కారాలు అందజేశారు. కాంత చిత్రంలో చూపించిన అద్భుత నటనకు గానూ దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా ఎంపికవ్వగా, ఆయన నిర్మించిన లోక చాప్టర్ 1: చంద్ర ఉత్తమ చిత్రంగా నిలిచింది. కాంతారా: ఏ లెజెండ్ చాప్టర్ 1 చిత్రానికి గానూ రిషబ్ శెట్టి ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకోవడంతో పాటు భారతీయ చిత్రసీమకు చేసిన సేవలకు లీడర్‌షిప్ ఇన్ సినిమా అవార్డును కూడా కైవసం చేసుకున్నారు. ఇక ఫుల్ ప్లేట్ సినిమాకు గానూ కీర్తి కుల్హరి ఉత్తమ నటిగా పురస్కారం స్వీకరించారు. సినీ పరిశ్రమలో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీని నిర్వాహకులు ప్రత్యేకంగా సన్మానించగా, సీనియర్ నటి రేఖను ఎక్స్‌లెన్స్ ఇన్ సినిమా పురస్కారంతో గౌరవించారు. నటుడు పంకజ్ త్రిపాఠి ఆర్టిస్ట్ ఆఫ్ డిస్టింక్షన్ అవార్డు అందుకున్నారు. వెబ్ సిరీస్ విభాగంలో మట్కా కింగ్ నటనకు విజయ్ వర్మ, దిల్లీ క్రైమ్3కి రసికా దుగల్ ఉత్తమ నటీనటులుగా నిలవగా, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ (సీజన్ 2) ఉత్తమ సిరీస్‌గా ఎంపికైంది. అలాగే ఆమీర్ ఖాన్ నటించిన సితారే జమీన్ పర్ చిత్రానికి ఈక్వాలిటీ ఇన్ సినిమా అవార్డు, సైయారా చిత్రానికి పీపుల్స్ ఛాయిస్ అవార్డు దక్కాయి.



# గ్రాండ్‌గా జార్జ్ క్రిష్ షురూ!



శర్వానంద్ శ్రీను వైట్ల కాంబోలో ఖజార్జ్ క్రిష్ఖ.. పూజా కార్యక్రమాలతో ప్రారంభం!యంగ్ హీరో శర్వానంద్, వినోదాత్మక చిత్రాల దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న కొత్త చిత్రం వైభవంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం 9:45 గంటలకు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, మొదటి షాట్‌కు క్లాప్ కొట్టి సినిమాను అధికారికంగా ప్రారంభించారు.ప్రముఖ నిర్మాణ సంస్థ ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత అనిల్ సుంకర ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జార్జ్ క్రిష్ అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు నిర్మాతలు ప్రకటించారు.వరుస సినిమాలతో జోరు మీదున్న శర్వానంద్ ఈ ప్రాజెక్ట్‌తో మరో కొత్త జోనర్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుండగా, దర్శకుడు శ్రీను వైట్ల తన మార్క్ కామెడీ, పంచ్ డైలాగులు మరియు కమర్షియల్ అంశాలతో గట్టి కమ్‌బ్యాక్ ఇవ్వాలని భావిస్తున్నారు. శర్వానంద్‌లోని క్లాస్ అండ్ మాస్ టైమింగ్‌కు, శ్రీను వైట్ల స్టైల్ వినోదం తోడైతే థియేటర్లలో నవ్వుల పండగ ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ చిత్రాన్ని రాబోయే సంక్రాంతి సీజన్‌లో విడుదల చేసేలా మేకర్స్ ప్రణాళికలు వేస్తున్నారు. ఇక ఈ సినిమాలో నటించబోయే కథానాయిక, ఇతర నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.



## పోతురాజు అవతారంలో రియల్ రౌద్రం!

తెలుగు సినీ పరిశ్రమలో విలక్షణ నటనతో, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దిగ్గజ నటుడు, రియల్ స్టార్ డా. శ్రీహరి. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా ఓ సరికొత్త భారీ చిత్రం రూపుదిద్దుకుంటోంది. భైరవకాళి ఫ్లిక్స్ బ్యానర్‌పై లెల్లా రోహిత్ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని లెల్లా రాహుల్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 15న దివంగత లెజెండరీ నటుడు శ్రీహరి జయంతిని పురస్కరించుకుని చిత్ర బృందం ఈ సినిమా నుంచి పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో విశిష్టమైన పోతురాజు ఆహార్యంలో మేఘాంశ్ శ్రీహరి కనిపించిన తీరు సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌లో మేఘాంశ్ వెనుక రియల్‌స్టార్ శ్రీహరి కూడా అదే పోతురాజు అవతారంలో కనిపిస్తూ తనయుడికి అండగా నిలబడినట్లు డిజైన్ చేసిన విధానం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా వైరల్ అవుతోంది. ఇప్పటికే 50 శాతానికి పైగా చిత్రీకరణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఇండియాస్ బిగ్గెస్ట్ టైటిల్ గ్లింప్స్ రివీలింగ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



## ఆ రూమర్ నా జీవితాన్ని మార్చేసింది

తన క్యూట్ నటనతో ఎన్నో సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది తెలుగమ్మాయి తేజస్వి మదివాడ. క్యారెక్టర్ ఆర్టిస్టుగా అడుగుపెట్టి హీరోయిన్‌గా కొన్ని సినిమాల్లో మెరిసింది. అంతేకాకుండా బిగ్‌బాస్ షోకి వెళ్లి అక్కడ కూడా ఎంతో మందిని అభిమానులుగా మార్చుకుంది. అయితే కొంతకాలంగా తేజస్వికి సరైన అవకాశాలు రావడం లేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలో ఎదురైన ఊహించని సవాళ్లు, చేదు అనుభవాల గురించి వెల్లడించిన సంచలన విషయాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2013లో వచ్చిన ఖసీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టుఖ చిత్రంలో మహేష్ బాబు పాత్రతో సాగే చిన్న సంభాషణతో తేజస్వి నటిగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత మనం, హార్ట్ ఎటాక్, లవర్స్, మళ్లీ మళ్లీ ఇది రాని రోజు, శ్రీమంతుడు, పండగ చేస్కో, కేరింత వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ముఖ్యంగా ఖకేరింతఖలోని ఆమె పాత్రకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు దక్కాయి. ఒకానొక దశలో తనకు వరుసగా దాదాపు 40 సినిమాల వరకు అవకాశాలు వచ్చాయని, కెరీర్ ఎంతో ఆశాజనకంగా సాగుతుందనే నమ్మకం కలిగిందని ఆమె గుర్తు చేసుకున్నారు.

అయితే, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నవదీప్ సరసన చేసిన ఐస్ క్రీమ్ చిత్రం తన సినీ ప్రయాణాన్ని ఊహించని మలుపు తిప్పిందని తేజస్వి పేర్కొన్నారు. ఈ సినిమా విడుదల సమయంలో ప్రచారంలోకి వచ్చిన ఒక వివాదం తనపై తీవ్ర ప్రభావం చూపింది. సినిమాలో తాను న్యూడ్‌గా నటించినట్లు జరిగిన ప్రచారం తప్పు అని, అందులో నిజం లేదని ఆ తర్వాత స్వయంగా వివరణ ఇచ్చినప్పటికీ, ఆ బోల్డ్ ఇమేజ్ ముద్ర తనకు ఇబ్బందిగా మారిందని తేజస్వి తెలిపారు. ఈ వచ్చిన నెగెటివ్ ఇమేజ్ కారణంగా కుటుంబ కథా చిత్రాలలో అవకాశాలు తగ్గడమే కాకుండా, మంచి అవకాశాలు కోల్పోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# నేటి నుండి శ్రీలంకతో కీలకపోరు




**న్యూఢిల్లీ:** శ్రీలంక గడ్డపై ఈ నెల 15 నుండి టెస్టు సిరీస్ ఆడేందుకు భారత జట్టు సిద్ధమైంది. అయితే ఈసారి టీమిండియాకు ఇది కేవలం ఒక ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ (డబ్ల్యూటిసి) ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్‌కు శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఈ నెల 15 నుంచి గాలే వేదికగా ప్రారంభమయ్యే ఈసిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు తప్పక మెరుగైన ఫలితం సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 5వస్థానంలో ఉన్న టీమిండియాకు ఇక్కడ ప్రతి మ్యాచ్ గెలవడం అత్యంత కీలకంగా మారింది. దక్షిణాఫ్రికాతో జరిగిన గత సిరీస్‌లో 2-0 తేడాతో ఓడిపోవడంతో భారత్ పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం ఫైనల్ బెర్త్ రేసులో ముందుండాలంటే శ్రీలంకను వారి సొంత గడ్డపై 2-0తో క్లీన్ స్వీప్ చేయడం ఒక్కటే మార్గం. ఈ సిరీస్ ముగిసిన వెంటనే భారత్ సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో 2 టెస్టులు, ఆతర్వాత ఆస్ట్రేలియాతో 5టెస్టుల సుదీర్ఘ బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ఆడాల్సి ఉంది. అందుకే లంకపై విజయం సాధించి ఆత్మవిశ్వాసాన్ని నిలుపుకోవడం టీమిండియాకు ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ఇక శ్రీలంక మ్యాచ్‌లో టీమిండియా వ్యూహాత్మకంగా ముందుకెళుతోంది. టీమిండియాలో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా బరిలోకి దిగనుండగా, మూడో స్పిన్నర్ కోసం మానవ్ సుతార్, సరాన్ష్ జైన్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ స్పిన్‌కు ప్రాధాన్యత ఇస్తే సారాన్ష్ జైన్ బరిలోకి దిగుతాడు. పేసర్లుగా మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ బరిలోకి దిగనున్నారు. అయితే ప్రసిధ్ కృష్ణకు గుర్నూర్ బ్రార్‌తో పోటీనెలకొంది. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు.

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ రేస్‌కు డూ ఆర్ డై

గాయంతో దూరమైన సాయి సుదర్శన్ స్థానంలో దేవదత్ పడిక్కల్ ఆడనుండగా, ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ బరిలోకి దిగనున్నారు. అలాగే నాలుగు, ఐదు స్థానాల్లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ ఆడనున్నారు. అయితే ఆరో స్థానంలో ఎవర్ని ఆడిస్తారు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ స్థానం కోసం సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. సర్ఫరాజ్ ఖాన్‌వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా 2008లో 2-1తో సిరీస్ గెలిచిన శ్రీలంక, ఆతర్వాత గత 18 యేళ్లుగా భారత్‌పై ఒక్క టెస్టు సిరీస్ కూడా గెలవలేకపోయింది. ఈ సారి ఎలాగైనా ఆ సెంటిమెంట్‌ను బ్రేక్ చేయాలని చూస్తోంది. శ్రీలంక మ్యాచ్‌ను సమం చేసినా లేదా గెలిచినా టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ కల తీవ్రంగా దెబ్బతింటుంది.



## డ్యూరాండ్ కప్.. క్వార్టర్ ఫైనల్స్‌కు జంషెడ్‌పూర్

**న్యూఢిల్లీ:** డ్యూరాండ్ కప్ 2026 గ్రూప్ సి చివరి మ్యాచ్‌లో, జంషెడ్‌పూర్ ఎఫ్‌సి ద్వితీయార్ధంలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎఫ్‌టిపై 6-0 తేడాతో ఘన విజయం నమోదు చేసింది. నాలుగో నిమిషంలో రెడ్ మైనర్స్ తరఫున రేనియర్ ఫెర్నాండెజ్ తొలి గోల్ చేయగా, విరామం తర్వాత 17 యేళ్ల లామ్‌సాంగ్‌జువాలా రంగంలోకి దిగాడు. ఈ యువ ఆటగాడు రెండుసార్లు గోల్ చేయగా, అమన్ సి.కె. జంషెడ్‌పూర్ తరఫున నాలుగో గోల్ చేశాడు. ఆ తర్వాత 80వ నిమిషంలో లామ్‌సాంగ్‌జువాలా తన హ్యాట్రిక్‌ను పూర్తి చేయగా, రాయన్ సి.ఆరో గోల్‌తో ఈ ఘన విజయాన్ని ఖాయం చేశాడు. దీంతో జంషెడ్‌పూర్ క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. అలాగే షిల్లాంగ్‌లో జరిగిన గ్రూప్‌ని చివరి మ్యాచ్‌లో, షిల్లాంగ్ లాజోంగ్, లాంగ్స్‌నింగ్ జట్లు 3-3తో ఆసక్తికరమైన డ్రాను నమోదు చేశాయి. ఈ ఫలితంతో, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలవడానికి అవసరమైన పాయింట్‌ను లాజోంగ్ దక్కించుకుంది. తొలి అర్ధభాగంలో లాజోంగ్ ఆధిపత్యం చెలాయించి, బ్రెజిలియన్ ఫార్వర్డ్ జోవో మొరైస్ రెండు గోల్స్ చేయడంతో 2-0 ఆధిక్యంతో వెళ్ళింది. లాంగ్స్‌నింగ్ బలంగా స్పందించి, కిర్మెన్స్ ఖెమ్ ముఖిమ్, వాడజీద్ కైన్సాయ్ గోల్స్ చేయడంతో 63వ నిమిషానికి స్కోరు 2-2తో సమమైంది. 82వ నిమిషంలో ఎవర్‌బ్రైట్‌సన్ సానా ద్వారా లాజోంగ్ మళ్లీ ఆధిక్యాన్ని సాధించింది. అయితే స్టాపేజ్ టైమ్‌లో సయ్యద్ అహ్మద్ గోల్ చేసి స్కోరును 3-3తో సమం చేయడంతో డ్రాను ఖాయం చేసుకుంది.

### మహిళల ఆసియా కప్, ఆసియా క్రీడల నుంచి..

## జెమిమా రోడ్రిగ్స్ నిష్క్రమణ

### ఆమె స్థానంలో ప్రతీకా రావల్




**న్యూఢిల్లీ:** భారత బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ రాబోయే మహిళల ఆసియా కప్, మహిళల ఆసియా క్రీడల టోర్నమెంట్లకు దూరమైందని బిసిసిఐ తెలిపింది. ఆగస్టు 3వ తేదీన ఇంగ్లాండ్‌లో జరిగిన ది హండ్రెడ్ టోర్నమెంట్‌లో ఆడుతుండగా జెమీమా రోడ్రిగ్స్ కుడికాలి తొడ కండరానికి గాయమైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బిసిసిఐ వైద్య బృందం ఆమెను క్లినికల్‌గా పరీక్షించగా, అది తీవ్రమైన కండర చీలిక అని నిర్ధారణ అయిందని తెలిపింది. ఫలితంగా, ఆమె యుఎఇలో జరగనున్న ఎసిసి మహిళల ఆసియా కప్ మరియు జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల నుంచి తప్పుకుందని స్పష్టం చేసింది. సదరన్ బ్రేవ్ ఫ్రాంచైజీ తరఫున ఇంగ్లాండ్‌లో ఆడుతున్నప్పుడు 25 ఏళ్ల క్రీడాకారిణి కండరాల గాయానికి గురయ్యిందని నివేదికలు పేర్కొన్నాయి. దీంతో ఆసియా కప్ కోసం జెమీమా స్థానంలో ప్రతీకా రావల్‌ను బిసిసిఐ మహిళల సెలక్షన్ కమిటీ జట్టులోకి తీసుకువచ్చింది. కాగా భారత్ తన ఆసియా కప్ 2026 ప్రచారాన్ని ఈనెల 30న థాయిలాండ్‌తో ప్రారంభించనుంది. ఇందుకుగాను ఆసియా కప్ టీమిండియాలో హార్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్‌మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), జి. కమలిని (వికెట్‌కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, ప్రత్ని గౌడ్ ఉన్నారు.



## షెల్టన్‌కు కెనడియన్ ఓపెన్ టైటిల్

**మాంట్రియల్:** ఫైనల్‌లో బ్రాండన్ నకాషిమాను ఓడించడం ద్వారా బెన్ షెల్టన్ కెనడియన్ ఓపెన్ టైటిల్‌ను సాధించాడు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో నకాషిమాను 6-3, 7-6 (4) తేడాతో ఓటమి పాల్చేసి తన తోటి ఎడమచేతి వాటం ఆటగాడైన రఫెల్ నాదల్ తర్వాత వరుసగా రెండు కెనడియన్ ఓపెన్ టైటిళ్లను గెలుచుకున్న మొదటి వ్యక్తిగా బెన్ షెల్టన్ నిలిచాడు. మొదటి సెట్‌లో 3-3 స్కోరు వద్ద, షెల్టన్ ఒక మెరుపు రిటర్న్ విన్నర్‌తో నకాషిమాపై తన మొదటి సర్వ్ బ్రేక్‌ను సాధించిన తర్వాత, ఆ 23 ఏళ్ల ఆటగాడిని ఆపడం ఎవరికీ సాధ్యపడలేదు.

తన ఆధిపత్య సర్వింగ్ ప్రదర్శనతో షెల్టన్ ఆట గమనాన్ని శాసించాడు. మరియు తన ఫోర్‌హ్యాండ్ షాట్లతో నిలకడగా పైచేయి సాధించాడు. ఈ అమెరికన్ ఆటగాడు మ్యాచ్ పొడవునా ఒక్క బ్రేక్ పాయింట్‌ను కూడా ఎదుర్కోలేదు. అంతేకాకుండా తాను సంపాదించిన నాలుగు బ్రేక్ పాయింట్లలో రెండింటిని సద్వినియోగం చేసుకున్నాడు. అతను బిగ్ త్రీలోని మరో సభ్యుడైన నోవాక్ జొకోవిచ్‌తో సమానంగా నిలిచి, 10 సంవత్సరాల క్రితం ఆ సెర్బియన్ తర్వాత ఒక్క సెట్ కూడా కోల్పోకుండా టోర్నమెంట్ గెలిచిన మొదటి వ్యక్తిగా నిలిచాడు.

మాంట్రియల్‌లో తోటి అమెరికన్ నకాషిమాను ఓడించడం ద్వారా, వారిద్దరి మధ్య జరుగుతున్న ఏటీపీ హెడ్2హెడ్ సిరీస్‌లో షెల్టన్ తన ఆధిక్యాన్ని 6-0కి మెరుగుపరుచుకున్నాడు. ఈ విజయంతో, ఆండీ ముర్రే (2009-10), నోవాక్ జొకోవిచ్ (2011-12) మరియు నాదల్ (2018-19) తర్వాత కెనడా టైటిల్‌ను విజయవంతంగా కాపాడుకున్న నాల్గవ వ్యక్తిగా షెల్టన్ ఈ శతాబ్దంలో నిలిచాడు.

## 153 రన్స్ భారీ ఆధిక్యంలో బంగ్లాదేశ్

### 198 పరుగులకు ఆస్ట్రేలియా ఆలౌట్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ పట్టు బిగించింది. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో (101) సెంచరీతో చెలరేగడంతో రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 110 ఓవర్లలో 6 వికెట్లకు 351 పరుగులు చేసి 153 పరుగుల ఆధిక్యంలో ఉంది. నజ్ముల్ హొస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) తృటిలో శతకం చేజార్చుకోగా, ముష్ఫికర్ రహీమ్(55 బంతుల్లో 5 ఫోర్లతో 36), మెహిదీ హసన్ మీరాజ్(73 బంతుల్లో 3 ఫోర్లతో 32 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. హసన్ మహముద్(13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(2/66), జోష్ హేజిల్ వుడ్(2/66) రెండేసి వికెట్లు తీయగా, ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ చెరో వికెట్ పడగొట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 153 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు ఆటలో మరో 50 పరుగుల ఆధిక్యం సాధించి..రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను తర్వగా ఆలౌట్ చేస్తే చారిత్రాత్మక విజయం సొంతమవుతుంది. అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా, టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హొస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.

# బిఎస్ఎన్ఎల్ నష్టం రూ.1,280 కోట్లు




**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్‌కు తొలి త్రైమాసికంలో రూ.1,280 కోట్ల నికర నష్టం నమోదైంది. గత యేడాది ఇదే కాలంలో నమోదైన రూ.1,007 కోట్ల నష్టంతో పోలిస్తే నష్టం మరింత పెరిగింది. ఆదాయంతో పోలిస్తే ఖర్చులు అధికంగా పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.1,419 కోట్ల నష్టంతో పోలిస్తే తాజా త్రైమాసికంలో నష్టం తగ్గింది. భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేసిన నేపథ్యంలో ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక గణాంకాలను సంస్థ పునఃప్రకటించింది. బిబిఎన్ఎల్‌ను మినహాయిస్తే మార్చి త్రైమాసికంలో బిఎస్ఎన్ఎల్ నికర నష్టం రూ.1,269 కోట్లుగా ఉంది. బిఎస్ఎన్ఎల్ మొత్తం వ్యయాలు యేడాది ప్రాతిపదికన 5.5 శాతం పెరిగి రూ.7,242.5 కోట్లకు చేరాయి. ఉద్యోగుల వ్యయం 1.8 శాతం పెరిగి రూ.1,974.5 కోట్లకు చేరుకోగా, నెట్‌వర్క్ వ్యయాలు ఏకంగా 28 శాతం పెరిగి రూ.1,761 కోట్లకు చేరాయి. తరుగుదల, అమోర్టైజేషన్ వ్యయాలు 9.6 శాతం పెరిగి రూ.2,394.5 కోట్లకు చేరాయి. మరోవైపు కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4.2 శాతం, త్రైమాసిక ప్రాతిపదికన 2 శాతం పెరిగి రూ.5,306 కోట్లకు చేరింది. కన్స్యూమర్ మొబిలిటీ విభాగం ఆదాయం ఏడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగి రూ.2,282 కోట్లకు చేరినా, గత త్రైమాసికంతో పోలిస్తే 7.5 శాతం తగ్గింది. ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్ ఆదాయం 12 శాతం పెరిగి రూ.1,736 కోట్లకు చేరింది. కన్స్యూమర్ ఫిక్స్‌డ్ యాక్సెస్ విభాగం ఆదాయం వార్షికంగా 14.5 శాతం తగ్గి రూ.1,290 కోట్లకు చేరింది.

అయితే మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఈ విభాగం ఆదాయం 29.5 శాతం పెరిగింది. దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ నెట్‌వర్క్ విస్తరణను బిఎస్ఎన్ఎల్ వేగవంతం చేస్తున్న సమయంలో ఈ ఫలితాలు వెలువడ్డాయి. ఢిల్లీలో 5జీ సేవల ప్రారంభానికి కూడా సంస్థ చర్యలు చేపట్టింది. బీఎస్ఎన్ఎల్ మొత్తం మొబైల్ చందాదారుల సంఖ్య సుమారు 9.3 కోట్లుగా ఉంది.

# భారత స్టాక్ మార్కెట్లకు బ్రేక్

### రెండు వారాల లాభాల పరంపరకు తెర

**ముంబయి, ఆగస్టు 14:** భారత స్టాక్ మార్కెట్ బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 వరుసగా రెండు వారాల పాటు నమోదైన లాభాలకు బ్రేక్ వేశాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత పెరగడం, అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో ఈ వారం మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ 50లు ఈ వారం చెరో 0.6 శాతం క్షీణించాయి. శుక్రవారం నిఫ్టీ 50 29.85 పాయింట్లు తగ్గి 24,366 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 70.71 పాయింట్లు నష్టపోయి 78,009.25 వద్ద స్థిరపడింది. విస్తృత మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీలు చెరో అర శాతం మేర పడిపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్స్, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ ఆటో, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్స్ సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మీడియా సూచీ మాత్రం లాభాల్లో ట్రేడైంది. అంతర్జాతీయ మార్కెట్లు అంతర్జాతీయ మార్కెట్లు మాత్రం లాభాల్లో కొనసాగాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు గురువారం రాత్రి టెక్నాలజీ, కమ్యూనికేషన్ సర్వీసెస్ రంగాల ఆధారంగా పుంజుకున్నాయి. ఎస్‌అండ్‌పీ 500 రికార్డు స్థాయి ముగింపును నమోదు చేసింది. శుక్రవారం ఆసియా మార్కెట్లలో ఎక్కువ భాగం లాభాల్లో ఉన్నాయి. జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు ముందంజలో నిలిచాయి. నిక్కీ 225 1.4 శాతానికి పైగా పెరగగా, టాపిక్స్ 0.8 శాతం లాభపడింది.


పంజాబ నేశనల బైంక ...भरोसे का प्रतीक! punjab national bank ...the name you can BANK upon!

ప్రజా ప్రకటన

ఈ ప్రకటన, శూన్య నిల్వ ఉన్న మరియు గత మూడు సంవత్సరాలకు పైగా కస్టమర్ ద్వారా ఎటువంటి లావాదేవీలు జరగని నిష్క్రియ ఖాతాదారుల కోసం జారీ చేయబడింది. తమ ఖాతాను తిరిగి సక్రియం చేసుకోవడానికి KYC పత్రాలను సమర్పించి PNB శాఖను సంప్రదించవలసిందిగా కోరడమైనది. ఈ ప్రకటన తేదీ నుండి ఒక నెలలోపు ఖాతాను సక్రియం చేయనట్లయితే, తదుపరి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అటువంటి నిష్క్రియ ఖాతాలను మూసివేయబడతాయి.

ఏవైనా ప్రశ్నలు/సహాయం కోసం దయచేసి మీ శాఖను సంప్రదించండి.

పంజాబ్ నేషనల్ బ్యాంక్

తేదీ: 15.08.2026


అధీకృత సంతకందారు


## టాటా సన్స్ చైర్మన్ రేసులో ముగ్గురి పేర్లు



**ముంబయి, ఆగస్టు 14:** టాటాసన్స్‌లో కీలక నాయకత్వ మార్పునకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుత చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తన ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరితో ముగిసిన తర్వాత తిరిగి నియమించుకోవాలని తాను కోరుకోవడం లేదని స్పష్టం చేసిన నేపథ్యంలో, తదుపరి చైర్మన్ ఎంపిక ప్రక్రియ ప్రారంభ దశలోకి ప్రవేశించింది. అయితే, ఎంపిక కమిటీ తుది కూర్పు, తదుపరి చైర్మన్‌గా పరిగణనలోకి వచ్చే పేర్లపై ఇంకా అధికారిక నిర్ణయం వెలువడలేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం, వర్గాల ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రక్రియ ప్రారంభ దశలోనే ఉంది. సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్ కూర్పును పరిగణనలోకి తీసుకుంటే ఎంపిక ప్యానెల్‌లో నోయెల్ టాటా, దారియస్ ఖంబాటా, భాస్కర్ భట్ ఉండే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇక చంద్రశేఖరన్ తర్వాత టాటా సన్స్ చైర్మన్ పదవికి అంతర్గత అభ్యర్థులుగా పలువురు సీనియర్ టాటా గ్రూప్ అధికారులు చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రాథమికంగా జెఎల్ఆర్ సిఇఒ పిబి బాలాజీ, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ శైలేష్ చంద్ర, టాటా స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ టివి నరేంద్రన్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇవి ప్రస్తుతం వర్గాల స్థాయిలో వినిపిస్తున్న ప్రాథమిక పేర్లు మాత్రమేనని, తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థుల జాబితాలో మార్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

## భారత ఫారెక్స్ ఖజానా కళకళ



**ముంబయి, ఆగస్టు 14:** భారత విదేశీ మారక నిల్వలు ఆగస్టు 7తో ముగిసిన వారంలో 14.136 బిలియన్ డాలర్లు పెరిగి 707.002 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) శుక్రవారం వెల్లడించిన డేటా ప్రకారం అంతకుముందు జూలై 31తో ముగిసిన వారంలోనూ విదేశీ మారక నిల్వలు 10.512 బిలియన్ డాలర్లు పెరిగి 692.866 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ యేడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరాయి. అనంతరం మధ్యప్రాచ్య ఘర్షణలు ప్రారంభం కావడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. దీంతో ఆర్‌బీఐ విదేశీ మారక మార్కెట్‌లో డాలర్ల విక్రయాల ద్వారా జోక్యం చేసుకోవాల్సి రావడంతో వరుసగా కొన్ని వారాల పాటు నిల్వలు తగ్గాయి.

విదేశీ కరెన్సీ ఆస్తులు ఆగస్టు 7తో ముగిసిన వారంలో 9.946 బిలియన్ డాలర్లు పెరిగి 574.625 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విదేశీ మారక నిల్వల్లో ఎఫ్‌సిఎ ప్రధాన భాగంగా ఉంటుంది. డాలర్లలో లెక్కించే ఎఫ్‌సీఏలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ఉంటుంది. మరిన్ని విదేశీ మారక నిధులను దేశంలోకి ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ జూలైలో ఎఫ్‌సీఎన్ఆర్ (బి) పథకం సహా పలు చర్యలను ప్రారంభించాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు దేశానికి సుమారు 40 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇక దేశ బంగారం నిల్వల విలువ 3.995 బిలియన్ డాలర్లు పెరిగి 108.738 బిలియన్ డాలర్లకు చేరుకుంది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ ఎస్‌డీఆర్‌లు 79 మిలియన్ డాలర్లు పెరిగి 18.745 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## 9.78 శాతంగా టోకు ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశీయ టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం జులైలో 9.78 శాతంగా నమోదైంది. అంతకుముందునెలలో నమోదైన 9.87 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ప్రాథమిక గణాంకాల ప్రకారం, అన్ని వస్తువులకు సంబంధించిన టోకు ధరల సూచీ జులైలో 110.0గా ఉండగా, జూన్‌లో ఇది 110.2గా ఉంది. ప్రధాన విభాగాల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. ప్రాథమిక వస్తువులు, తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం పెరగగా, ఇంధనం-విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం తగ్గింది. ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం పెరుగుదప్రాథమిక వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం జూన్‌లోని 7 శాతం నుంచి జులైలో 8.52 శాతానికి పెరిగింది. ఆహారేతర వస్తు వుల ద్రవ్యోల్బణం 11.07 శాతం నుంచి 17.66 శాతానికి, ఖనిజాల ద్రవ్యోల్బణం 9.45 శాతం నుంచి 13.28 శాతానికి పెరిగింది. ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గింది. జూన్‌లో 5.49 శాతంగా ఉండగా, జులైలో 5.44 శాతంగా నమోదైంది. ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం జూన్‌లోని 27.41 శాతం నుంచి జూలైలో 20.05 శాతానికి తగ్గింది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.